TEXT LIGHT WITHIN THE BOOK ONLY

UNIVERSAL LIBRARY

OU_204330

UNIVERSAL LIBRARY

OUP—23—4-4-69—5,000.

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T83/S35Pr Accession No. T4417

Author [illegible]

Title [illegible] n.d.

This book should be returned on or before the date last marked below.

# ప్రతిజ్ఞ

★

రచయిత:

విద్వాన్ కవిరాజు

పండిత

పెనుమెచ్చ సత్యనారాయణరాజుగారు

జయపుర సంస్థానాస్థానకవి

తణుకు.


ది మోడరన్ బుక్ హౌస్,

పబ్లిషర్స్ అండ్ బుక్ సెల్లర్స్

మచిలీపట్నం.


Rights Reserved. Price 1—0—0

# నివేదన

ప్రతిజ్ఞ యను నీ నవల చరిత్రాత్మకమైనది. ఇందలి యితివృత్తము చంద్రగిరి రాజధానిగా నాంధ్రకర్ణాటక సామ్రాజ్యము నేలిన శ్రీ వీరవేంకటపతిరాయలకు వాని వంశస్థులకు సంబంధించినది. విజయనగర పతనానంతరము తిరిగి కర్ణాటక సామ్రాజ్య మెట్టి యౌన్నత్యమును బొందినదియు. నెట్టి యిక్కట్టులకు లోనైనదియు నిందుఁ దెలియనగును. రాజాంతఃపురములలో జరుగు నపూర్వసంఘటనలు- రాజబంధువుల దురాగతములు, రాజభక్తుల నిష్కళంక దేశభక్తియు నిందుఁ బ్రతిబింబించుచు నుండును.

తంజావూరు రఘునాథరాయలయు, వెంకటగిరి యాచమనాయనియు నపూర్వ ప్రతిభా ప్రభావములు అసహాయ శూరతా ధీరతలు, అద్భుత ఘటనా చాతుర్యములు, సకలకళా రాసిక్యములు ఆంధ్రవిద్యార్థులచేఁ దిలకింపఁజేసి పులకింపఁజేయుటయే యీనవలయొక్క ప్రధానలక్ష్యము.

మూర్తీభవించిన యాంధ్రత్వమున కిది మూదల. ఈనవలకు వలయు చారిత్రక విషయములు, కథా సంవిధానము నెఱిఁగించిన బహుభాషావేత్తలగు శ్రీ సారంగు నరసింహారావు బి.ఏ.బి.యల్. గారికి, నా కృతజ్ఞతాపూర్వక నమస్కారములు. ఈ నవల వ్రాసి యొసంగవలసినదిగాఁ గోరిన బందరు మోహనన్ బుక్ హౌస్ పబ్లిషింగ్ కంపెనీ వారికి, వారికి నిది వ్రాసి యీయవలసినదిగాఁ బట్టుపట్టి వ్రాయించిన మా శిష్యుఁడు ఆయుష్మంతుఁడు తంగిరాల వేంకట సుబ్బారావునకును నా యాశీర్వాదములు.

శ్రీ విక్రమవిలాసము
తణుకు

గ్రంథకర్త

II

# ఈ గ్రంథరచన కుపకరించిన గ్రంథములు

1 ఆంధ్రుల చరిత్ర
2 తంజాపురాంధ్రనాయక చరిత్ర
3 వేంకటగిరి సంస్థానచరిత్ర
4 జీర్ణకర్ణాట సామ్రాజ్యచరిత్ర
5 రాయలవాచకము
6 యాచకెూర విజయము
7 వసుచరిత్రము
8 పారిజాతాపహరణము
9 విజయవిలాసము
10 రఘునాథాభ్యుదయము (సంస్కృతము)
11 రఘునాథాభ్యుదయము (నాటకము)

పై గ్రంథకర్త లందఱికి నా కృతజ్ఞతా పూర్వకాభినందనములు.

# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | దసరా వేడుకలు. | 1 |
| 2. | రాజదర్శనము | 14 |
| 3. | పూర్వగాథ | 18 |
| 4. | దర్బారు | 25 |
| 5. | వీరవేంకటపతిరాయలు – మరణము | 39 |
| 6. | రాజబంధనము | 53 |
| 7. | ప్రతిజ్ఞ | 62 |
| 8. | ఆలోచన | 68 |
| 9. | సమావేశము | 73 |
| 10. | రాయప్ప ప్రయాణము | 79 |
| 11. | చిక్కదేవరాయలు – చెఱ | 85 |
| 12. | శ్రీరంగరాయల దాటించుట | 92 |
| 13. | హత్య | 94 |
| 14. | రఘునాథరాయల యభయము | 104 |
| 15. | మంత్రాలోచన | 110 |
| 16. | యుద్ధము | 115 |
| 17. | పట్టాభిషేకము | 120 |

# ఇందలి ముఖ్యపాత్రలు

| | | |
|---|---|---|
| వీరవేంకటపతిరాయలు | ... | చంద్రగిరిమహారాజు |
| వెంకటమ్మ | ... | రాణి |
| జగ్గరాజు | ... | రాణితండ్రి (కందనోలు ప్రభువు) |
| ఓబలరాయఁడు | ... | రాణి తమ్ముఁడు (చంద్రగిరి దుర్గాధ్యక్షుఁడు) |
| తిరుమలదేవరాయలు | ... | రాణి కృత్రిమపుత్త్రుఁడు |
| చిక్కదేవరాయలు (వీనినే కొందఱు శ్రీరంగరాయలందురు) | ... | రాజు అన్న శ్రీరంగరాయలకొడుకు |
| శ్రీరంగరాయలు (వీనినే కొందఱు రామరాయలందురు) | ... | చిక్కదేవరాయల రెండవ కుమారుఁడు |
| ముమ్మడాంబ | ... | శ్రీరంగరాయల భార్య (పెనుగొండ తిరుమలరాజు కూఁతురు) |
| పెమ్మసాని తిమ్మరాజు | ... | మంత్రి |
| రఘునాథరాయలు | ... | తంజావూరు ప్రభువు |
| యాచేంద్రుఁడు (యాచమనాయకుఁడు) | ... | వెంకటగిరి సామంతరాజు |
| కొండవీటి తిమ్మరాజు | ... | రాజుగారి చెల్లెలి పెనిమిటి |
| పెనుఁగొండ తిరుమలరాజు | ... | తిమ్మరాజుకొడుకు (శ్రీరంగరాయల మామ) |
| రాయభూపాలుఁడు | ... | యాచేంద్రుని పినతండ్రి |
| వీరనారాయణుఁడు | ... | సేనాధ్యక్షుఁడు |
| రాయప్ప | ... | ఖిలేదారు (సాంప్రతులని నాఁటి హోదా పేరు) |
| రాంజీ బ్రహ్మచారి | ... | గురుదేవుఁడు |
| తిరపయ్య | ... | శ్రీరంగరాయలను గాడిదమీఁద దాఁటించిన చాకలి |

ఇంకను మిగిలిన పాత్రములు నవల పఠించునపుడు తెలియఁగలరు.

# ప్రతిజ్ఞ

## దసరా వేడుకలు

శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామివారి దివ్యదేవాలయము నకు సరిగాఁ బదునొకండుమైళ్ళ దూరమునఁ జంద్రగిరి దుర్గము కనులపండువు చేయుచుండును. ఆ దుర్గరాజమునకుఁ బ్రభువు శ్రీ వీరవేంకటపతిరాయలు. వీరవేంకటపతిరాయలు చంద్ర వంశ సుక్షత్రియుఁడు. శ్రీ రామరాజు వంశములోనివాఁడు. సహజగంభీరమూర్తి. వయోవృద్ధుఁడు. మహాభక్తుఁడు. పూర్వా చారపరాయణుఁడు. రాజనీతిచతురుఁడు. ఎదిరిహృదయము నంతలోఁ గనిపెట్టఁగల సూక్ష్మబుద్ధి గలవాఁడు. ఒక్కమాటలోఁ జెప్పవలయుననిన ఆవులించిన ప్రేవులు లెక్కపెట్టఁగల ప్రజ్ఞ గలవాఁడు.

తెల్లవాఱిన శరత్కాల మారంభమగును. నాఁడు భాద్రపదమాసమున అమావాస్యదినము. ఇంకను చోలికోడి కూయలేదు. బ్రాహ్మముహూర్త మాసన్నమగుచున్నది. ఆ ముహూర్తమును సూచించుచు మోసాలలో మంగళవాద్య ములు మొరయుచుండెను. పరిచారికలు పరిచారకులు ఎవరి పనులలో వారు నిమగ్నులైనారు.

కోటలోనివారితోపాటు పట్టణములోనివారందరు మేలు కొనియున్నారు. ఇండ్లుముంగిండ్లు మిద్దెలు మేడలు సర్వాంగ సుందరముగా అలంకరించుకొనుచున్నారు. పిన్నలు పెద్దలు కోటలో జరుగు దసరా వేడుకలఁ గాంచఁ గుతూహలపడు చున్నారు. ప్రతి వీథియుఁ బ్రతి గృహమును నిత్యోత్సవము పచ్చతోరణమున్నై కనువిందొనర్చుచుండెను.

ఖిలేదారు రాయప్ప అశ్వశకటారూఢుఁడై వచ్చి దేవిడీ గయొద్దఁ దిగెను. ద్వారపాలకులు సవినయముగఁ జిఱునవ్వులు చింద 'సర్కారువారు లేచినారు. తమకై నిరీక్షించుచున్నారు' అని మనవిచేసికొన్నారు.

రాయప్ప చకచక రాజదర్శనమునకు వెడలెను. రత్న దీపికాశ్రేణిమధ్య మెఱయుచున్న శుభ్రాసనముపైని మహారాజు వీరవేంకటపతిరాయలు ఆసీనుఁడైయుండెను. రాయప్ప చెంత కేగి వంగి నమస్కరించి నిలిచెను. మహారాజు మందహాస పూర్వకముగాఁ గూర్చుండ నియోగించి యిట్లనెను.

వీర :- ఏమీ రాయప్పగారూ! శరన్నవరాత్రములకుఁ దగిన నగరాలంకారమంతయుఁ బూర్తియైనదియా! దసరా దర్బారు నకు రావలసినదిగా మన మాహ్వానించినవారందఱు వచ్చి నారా! వారి కందఱికి బసలు ఎక్కడెక్కడ ఏర్పాటుచేసి నారు? ఎవరి యలవాటులకుఁ దగినట్లుగా వారికి మజ్జనభోజ నాదులు జరుగునట్లు కట్టడచేసితిరా? ఇఁకఁ బూర్తికావలసిన పను లేమియున్నవి?

రాయ :- చిత్తము, చిత్తము. సర్కారువారి యనుగ్రహముచే సర్వము చక్కఁగా నిర్వర్తింపఁబడునట్లు ఆయాయి పనులకుఁ

దగినవారి నందఱిని నియమించియున్నాను. ప్రభుకటాక్షముచే ఎందును లోపము రాఁబోదు. రాత్రిప్రొద్దు (కాలము) పోవునప్పటికి కందనోలు (కర్నూలు) నుండి జగ్గరాజుబాబు గారు దయచేసినారు. వారిని ఉత్తరపుగవనునొద్దనున్న సౌధములోఁ బ్రవేశపెట్టినాము. కొండవీటినుండి తిమ్మరాజుబాబు గారు విచ్చేసినారు. వారికి నచ్చటనే విడిది యేర్పఱచినాము. వారు విజయముచేసిన మఱొక ముహూర్తకాలమునకు మధురాంతక ప్రభువు యాచేంద్రులుగారు అరుగుదెంచినారు.

వీర :- ఇంకను ఎవరు వచ్చినారు ?

రాయ :- వారు చనుదెంచిన మఱియొక గడియకుఁ దంజావూరు నుండి శ్రీ రఘునాథరాయలవారు వేంచేసినారు. వారిరువురకు అతిథిగృహములో వసతులు గావించినాము మహాప్రభూ !

వీర :- మిగిలినవారికి ?

రాయ :- సామంతరాజులకుఁ గవి గాయకాదులకు వారివారికి దగిన విడుదులు చూపినాము.

వీర :- అందఱకుఁ దగినట్లుగా అన్ని యేర్పాటులు గావించినారు గదా !

రాయ :- చిత్తము. ఎవరి హోదాకుఁ దగిన మర్యాదలు వారికి నడచునట్లు కట్టుదిట్టములు గావించినాము.

వీర :- ప్రధానమంత్రిగా రెక్కడ ?

రాయ :- శ్రీ ప్రధానమంత్రివారగు పెమ్మసాని తిమ్మరాజుబాబు గారు స్వయముగా దయచేసి శ్రీ జగ్గరాజువారిని శ్రీ యాచేం

ద్రులవారిని, శ్రీ రఘునాథ రాయలవారిని సందర్శించి కుశల ప్రశ్నలుచేసి భటులకు సేవకులకు 'రాజగౌరవములను' జూప వలసినదిగా హెచ్చరికచేసి రాత్రి రెండవజామునకు స్వగృహమునకు దయచేసినారు మహాప్రభూ !

వీర:- సరేమంచిది. కాని రాయప్పగారూ ఏమిటి యాచేంద్రుఁడు మధురాంతకమునుండి వచ్చినట్లు చెప్పినారు. ఆయన రాజభక్తికి మెచ్చి మనము ఆయనకు ఉత్తరమల్లూరు రాజ్యము కానుకగా ఇచ్చినాముగదా ! అప్పటినుండి రాలేదా యా మహావీరుఁడు ?

రాయ :- చిత్తము మహాప్రభూ ! పరాకుపడితిని క్షమింపుఁడు. పూర్వపు అలవాటుచొప్పున నోరు జారిపోయినది. మన్నింపుఁడు.

వీర :- మీరు మరల ఉదయమునఁ బ్రొద్దెక్కకుండ యాచేంద్రులను రఘునాథరాయలను దర్శించి, వారి కేమి కావలయునో కనుఁగొని, మేము సాయంకాలము వచ్చి దర్శనమిచ్చెదమని చెప్పుఁడు.

రాయ :- చిత్తము చిత్తము మహాప్రభూ ! శ్రీ ప్రభువువారి నిత్యానుష్ఠానములు పూర్తియగునప్పటికి వారేవచ్చి శ్రీవారి సందర్శనము కావించుకొందుమని మనవి చేయవలసినదిగా సెలవిచ్చినారు. చిత్తము.

వీర :- సరే మంచిది. మేము స్నానాదికములు కావించుట కరుగుచున్నాము. మీపని మీరు చూచుకొనుఁడు.

రాయ :- చిత్తము. చిత్తము. శ్రీ తిరుపతి పుణ్యక్షేత్రము నుండి బ్రాహ్మణోత్తములు వేదపారాయణము చేసికొనుచు

భాతాళగంగ తీసికొనివచ్చి శ్రీవారి మజ్జనశాలయొద్ద నిలిచియున్నారు.

వీర :- ఓహో ! అప్పుడే వచ్చినారా ! పుణ్యాత్ములు. వేద మూర్తులు. ఉండమనుడు ఇదిగో వచ్చుచున్నాము.

రాయ :- ఎవరురా అక్కడ ? త్వరగాపోయి సర్కారువారు స్నానమునకు దయచేయుచున్నారని చెప్పు పరిచారికలకు.

అనఁగానే భటుఁడు పరువెత్తెను. మహారాజు వీర వేంకటపతిరాయలు లేచి మజ్జనశాలాభిముఖుఁడై వెడలెను. వేదమంత్రములచేఁ బూతములై, బ్రాహ్మణానీతములైనపాతాళ గంగాజలంబుల స్నానము చేయవచ్చిన మహారాజునుగాంచి పరిచారికలు వంగి నమస్కరించి పైఁడిముక్కాలిపీఁటను వేసి దానిపైనఁ గూర్చుండ వేడుకొనిరి. మహా రా జుపవిష్టుఁ డయ్యెను. పు రో హి తు ని భా ర్య ల లా ట రే ఖ చెమరింపఁగా, హారములు వ్రేలఁగా కంకణములు తాళములు వేయఁగా సంపెంగ నూనియతోఁ దలయంటినది. అంత నొక పరిచారిక తొలుత మీఁగడరాచి పిమ్మట కస్తూరికా కర్పూర మిళితమగు నలుగుబిండి పెట్టినది. వేఱొకతె తుమ్మెదలఁబోలు వాని పెన్నెఱులు చేతులతోఁ బిడిచి, విప్పి, విదిర్చి, కొనగోరు లతోఁ జక్కగా దువ్వి నడుమనడుమ గొజ్జఁగినీరు (పన్నీరు) సల్లి, పరిమళించు నుసిరికముద్దపెట్టి తలరుద్దినది. కొంద ఱొయ్యారి కత్తె లొకరి చేతినుండి మఱొక రందిపుచ్చుకొని బంగారు బిందెలతోఁ గోరువెచ్చనినీళ్లు దీయఁగా నొక యొప్పులకుప్ప కొప్పుజాఱఁగా నొప్పుమీఱఁగా మహారాజును జలకమార్చెను. పిమ్మట మహారాజు బ్రాహ్మణు లందీయఁగా పాతాళగంగా

జలములఁగూడఁ జలకమాడెను. ఇంకొకర్తుక వలిపంపు వస నంబుతో తడియొత్తెను. అంత మఱొకర్తుక, నఖాంతరములచే నెఱులజిక్కులుతీసి శిరసార్చెను. మఱియొక్కతె వెన్నెల నిగ్గులు వెదజల్లు మడుఁగులందిచ్చెను. ఇంకొకతె రత్నహార ములు కంఠమునందుంచెను. ఒక్కతె పూలమాలలువైచెను. ఒకతె చందన మలఁదెను. ఒకొరిత కప్పురంపువీవన వీచెను. మఱొకతె నిలువుటద్దము నెదుట నిలిపెను. ఇంక నొక చక్కనిచుక్క తిరుమూర్ణముతో తిరుమణి దిద్దెను. కొందరు సుందరులు విచిత్ర మౌక్తికనీరాజనము లొసంగిరి. అప్పటికి బ్రాహ్మముహూర్తపుగడియలు వచ్చెను. వీరవేంకట పతిరాయలవారు పవిత్రాసనముపై ఆసీనుఁడయ్యెను. బ్రాహ్మ ణులు ఆరాధ్యనామావళులు పఠించిరి. అధ్యాత్మకీర్తనలు గానముచేసిరి. పాండవగీతలు, భ్రమరగీతలు, కీర్తించిరి. గజేంద్ర మోక్షము, భారతసావిత్రి, వామనస్తోత్రము, గంగావతరణము పఠనముగావించిరి. భారత భాగవత రామాయణముల మహి మల వివరించిరి. అక్రూర భీష్మస్తవములను బఠించిరి. సంజయ విదురాది నీతుల వినిచిరి. భర్తృహరి నీతివైరాగ్య శతకముల వక్కాణించిరి. అష్టాదశ పురాణసారముల నెఱిఁగించిరి.

మహారాజేంద్రుఁ డన్నియు సావధానముగా విని తొలుత అద్దమునుగాంచి, కన్యకామణుల వీక్షించి, దుర్గాసందర్శనము చేసి, కపిల ధేను సంపూజనము చేయుటకై బయలుదేఱెను.

అప్పటికి నాలుగుగడియలు ప్రొద్దెక్కినది. వెండిగొరిజలు, బంగారు కొమ్ములు, స్వర్ణఘంటికలు, కుచ్చుతోఁక, కడవ

పొదుగుగల కపిలధేనువు దేవ్యాలయముముందు దివ్యమంగళ మూర్తియై వెలుగొందుచుండెను.

నాఁడు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి. శరన్నవరాత్ర పూజల కారంభదినము. వీరవేంకటపతిరాయలు తొలుత కులదేవతయగు దుర్గాదేవిని బూజించి యావెంటనే కపిలగోవు నర్చించుట యనూచానాచారము. అచ్చటనే మున్ముందు, వివిధ దేశాగతులయిన బంధుమిత్ర సామంత కవి గాయకాదులు ప్రభుదర్శనము కావించుకొనవలయును. కావున జగ్గరాజు, కొండవీటి తిమ్మరాజు, యాచేంద్రుఁడు, రఘునాథరాయలు మున్నగువారు, పాళెగాండ్రు, కవి పండిత గాయకులు అచ్చటికి వచ్చి వేచియున్నారు.

అంతఃపురమునుండి మహారాజు బయలుదేరుటతోడనే రాజాగమన వార్తను సూచించుచుఁ దూర్యారావములు మొరసెను. ఏచ్చటివా రచ్చట అవహితచిత్తులై నిలిచియుండిరి.

ముందు బ్రాహ్మణులు వేదమంత్రములను బఠించుచుండఁ బార్శ్వభాగములఁ గొందఱు శంఖారావములు గావించుచుండిరి. వెనుకవైపున పుత్తడి బొమ్మలగు పనికత్తెలు బారులుదీరి చీరల రంగులు దశదిశలు వెలుఁగింప, గిలుకుమట్టియలు ఘల్లుఘల్లుమనుచుండఁగాఁ బైఁడిపళ్లెరంబుల పుష్ప ఫలాదులు పెట్టికొని యొయ్యారంబుగఁ జనుదెంచుచుండిరి.

మహారాజచంద్రుఁడు మెల్లమెల్లగాఁ బయిఁడి పావలపై నడచివచ్చి దుర్గాలయ ప్రాంగణమునఁ బావలు విడిచి గర్భాలయమునకుఁ జనెను. [illegible] పరివారమంతయుఁ గపిల

ధేనువుచుట్టు బారుతీరి తమతమ భావంబు ననుసరించి నిలిచి యుండిరి.

మహారాజులుంగారు దుర్గాదేవి నారాధించి కపిలగోవు నొద్దకు వచ్చునంతలో ప్రధానమంత్రి పెమ్మసాని తిమ్మరాజుగారు కూడ నచ్చటికి వచ్చిరి. అచ్చట నున్నవారెల్ల మంత్రిపుంగవు నకు నమస్కరించి యొదిఁగి నిలువఁబడి యున్నంతలో మహా రాజుగా రరుదెంచిరి. మంత్రిమణితోపాటందఱును వంగి యభి వాదనము నొసర్చిరి. మహారాజు క్రేఁగంటి ప్రసారములచే వారినందఱినిఁ గుశలప్రశ్నములు గావించెను. పురోహితుఁడు యథావిధిగా మహారాజుచే గోపూజ చేయించెను. వీరవేంకట పతిరాయ మహారాజు గోపూజ సభక్తికముగాఁ గావించి ప్రద క్షిణ మాచరించెను. గోమాత పితుకకయే పాలు వర్షించెను. పురోహితుఁడు ఆ గోక్షీరమును కనక కలశములోనికిఁ బట్టి మంత్రపూర్వకముగా మహారాజమహాళి మహాళిమీఁదఁజల్లి యాశీర్వదించెను. మహారాజు మహాప్రసాదమని వినమిత శిరస్కుఁడై విప్రాశీర్వాదమును గైకొనెను. పిమ్మటఁ బురో హితుఁడా క్షీరంబులను, మంత్రివర్యునకు, జగ్గరాజులకు యాచేంద్ర— రఘునాథరాయ ప్రభృతులకు శీర్షములపైఁ జల్లి త్రావనొసంగి దుర్గాప్రసాదంబు నొసంగెను.

ప్రసాదంబు నందఱు స్వీకరించిన వెంటనే దేవ్యాలయ మున కొక మూలగను దూర్పుగవంకునకుఁ జెంతగను నున్న సుదీర్ఘమయిన కంచుస్తంభమునైపునకుఁ బురోహితుఁడు మార్గ దర్శియై చనఁగా మహారాజు ముంగటను దరువాత నమాత్యుఁ

డును, పిమ్మట జగ్గరాజును, వెనుక యాచేంద్ర రఘునాథ రాయాదులును సగౌరవముగా నడచి చనిరి.

మహారాజ పుంగవుఁ డచటికిఁ జనునంతలో ఖిలేదారు రాయప్ప యెదురుగా వచ్చి నమస్కరించి రెండుచేతులు సాఁచి యిటు మహాప్రభూ! యిటు దయచేయుఁడని దారిచూపి జెండా స్తంభము చెంతకుఁ దోడ్కొని పోయెను.

ధ్వజస్తంభమును మహారాజు సమీపించినంతనే పురోహితుఁడు ధ్వజపూజ గావించెను. మహారాజు వరాహ పతాకము నెగురవేసెను. తోడనే భూనభోంతరాళములు బోరుకలంగ ఫిరంగులు ఇరువదియొక్క సారులు ప్రేల్చఁబడెను. అచ్చటికి వచ్చిన యెల్లవారు నుల్లంబులు పల్లవింప జయ జీవ కర్ణాట సామ్రాజ్య పునఃసంస్థాపనస్రష్టా! వీరవేంకటపతిరాయ మహారాజా! యని యెలుఁగెత్తి జయ జయ నినాదములు గావించిరి. పురంధ్రులు మహారాజు శిరంబుపైని లాజలు (పేలాలు) సల్లిరి. అంతలో నాఁటి పూజావిధానము ముగిసినది. మహారాజావారు అంతిపురంబునకుఁ జనిరి. తక్కుంగల వారందఱు యథార్హవాహనారూఢులై తమతమ విడిదిపట్టుల కేఁగిరి.

మహారాజు కుతపకాలమున షడ్రసోపేత భోజనముచేసి కొండొకకాలము విశ్రమించెను.

కొంతసేపటికి పగటి నాల్గవజాము ప్రారంభమును సూచించుచు దేవిడీపై నగారాలు మ్రోఁగినవి.

మహారాజు తన సహజ సుందరాకారమునకు వన్నెవెట్టు దుస్తులను ధరించి సభామందిరాభిముఖుఁడయ్యెను.

'మహారాజు దర్బారు మహలు' లోనికి జనునప్పటికి ఖిలేదారు రాయప్ప చేతులు జోడించుకొని యెదురుగావచ్చి ప్రభువును భద్రాసనము దగ్గరకుఁ దోడుకొనిపోయెను. మహారాజు సుఖాసనాసీనుఁడై రాయప్పవంకఁ జూపులు సారించెను. పరేంగితాసగాహియగు రాయప్ప—చిత్తము మహాప్రభూ! జగ్గరాజు బాబుగారు ఏలిసవారు చేయించిన యేర్పాటులకు సంతృప్తి వెల్లడించినారు. యాచేంద్రుఁడుగారు ప్రభువ రేణ్యులు జరిపించుచున్న మర్యాదలకు సంతుష్టి చెందినారు. అంతియేకాదు మహాప్రభూ! తమకోడిడే లోకమని మురియుచున్నారు. అంతటి ప్రభుభక్తి పరాయణుని శూరాగ్రేసరుని కనివిని యెఱుంగము మహారాజ చంద్రా? ఒహో యేమి ఠీవి, ఏమి రాజభక్తి! ఒడ్డు, పొడుగు, ఔదార్యము, సాహసము, ధైర్యము, స్థైర్యము, విశ్వాసము మూర్తీభవించిన యా యాచేంద్రులు కర్ణాటరాజ్యలక్ష్మి నోముపంటకాని యన్యుఁడుకాఁడు. సర్కారుమీఁదను సామ్రాజ్యము మీఁదను ఆ వీరునకుఁ గల భక్తి తాత్పర్యములు సాటిలేనివి, కనివిని యెఱుంగనివి. రఘునాథరాయలో! సాక్షాత్తు రఘునాథరాయలే మహాప్రభూ! ఏమిరసికత! ఏమి పాండిత్యము! ఏమికవిత్వము! ఏమిసంగీతము! ఏమివీరత్వము! ఏమియౌదార్యము! అన్నింట నతనికతండె సాటి మహారాజా! ఆంధ్రదేశమునకు యాచేంద్రులు, ద్రావిడదేశ మంతకు రఘునాథరాయలు పెట్టని కోటలై నిలిచి పాలుచుచు మన కర్ణాట సామ్రాజ్యమును సుస్థిరము చేయుచున్నారనుట శ్రీవారికి విశదమేకదా! వారివారి హోదాలకుఁ దగినట్లుగా నెల్లకార్య

ములు జరుగు నేర్పాట్లు కట్టుదిట్టముగాఁ జేయించినాము. వారి రాకపోకలకు జోడుగుఱ్ఱాలబండ్లేర్పాటు గావించినాము. చిత్తము.

వీర :- ఈపూఁట కొత్తవారెవరైన వత్తురేమో !

రాయ :- చిత్తము. నూటయెనిమిది తిరుపతులనుండి తీర్థ ప్రసాదములను, డెబ్బదిరెండు దేవస్థలాలనుండి విభూతి గంధప్రసాదములను దీసికొని యర్చకులు విచ్చేసియున్నారు. వారి వారికి బసలేర్పాటులు గావింపఁబడినవి. శ్రీరంగాది వైష్ణవ క్షేత్రంబులనుండివచ్చిన వైష్ణవులకును. పంచభూతాత్మకములైన యేకామ్రనాథ, జంబుకేశ్వర, అరుణాచలేశ్వర, కాళహస్తీశ్వర, చిదంబర, శ్రీశైల, దక్షారామాది శైవ క్షేత్రములనుండి యరుదెంచిన యారాధ్యులకు వేఱువేఱ యథోచిత మందిరములు విడిదిపట్టులు గావించి వారివారి యాచారానుకూలములైన మజ్జన భోజనాదు లేర్పాటు గావించినాము. మహాప్రభో యింకను జాలమంది మహోత్సవములు చూచు వేడుకతో రానైయున్నట్లు వినుచున్నాము. మఱి బసలకుఁ దగిన వస......

వీర :- రానీయుండి ! విదురుఁ డేమన్నాఁడో విన్నారా !

రాయ :- చిత్తము చిత్తము.

వీర :- 'బంధుసంకీర్ణ మందిరము' కావలెనని కోరుకొన్నాఁడు భగవంతుఁడైన శ్రీకృష్ణపరమాత్మ వర మడుగుమని నప్పుడు. తెలిసినదా రాయప్పగారూ ! అంతకు బసలు సరిపోనిచో వేంకటేశ్వరాలయమున కేగు మార్గముదగ్గఱగల మేడలు మిద్దెలుకూడ ఈ పనికొఱకు అడిగిపుచ్చుకొనుఁడు.

రాయ :- చిత్రము చిత్రము.

అనుచున్నంతలో యాచేంద్రులు మహారాజ దర్శనార్థ మరుదెంచిరి. మహారాజు వారిఁగాంచి సంతోషపూర్వకముగాఁ గూర్చుండుఁడని వారు రుచితాసనములఁ గూర్చుండిరి. మహారాజు వీరిం గాంచి కుశల ప్రశ్నపూర్వకముగా దేశపరిస్థితులనుగూర్చి ప్రశ్నించెను. అందు యాచేంద్రుఁడు సగౌరవముగా లేచి నిలువఁబడి, యిట్లనెను.

"మహారాజా! యావదాంధ్ర దేశమునను బ్రజలు సుఖముగానున్నారు. పాఁడి పంటలకుఁ గొఱఁతలేదు. తూర్పున బొబ్బిలి ప్రాంతమునఁ గొందఱు కొండరాజులుమాత్రము అజ్ఞానవిలసితులై యించుక మిడిసిపడుచున్నట్లు వినుచున్నాము. అంతకుమించి యులజడులు మఱెచ్చటను లేవు. అవియైనను 'ఉష్షు' అనిన ఎగిరిపోయి యణఁగిపోవునవె. అవసరము వచ్చిన నచ్చట మా రెండవయబ్బాయి యుండనే యున్నాఁడు."

వీర :- అట్లయిన యాచేంద్రుల కన్నుల నెఱ్ఱసెరలు చూపట్టు నవసరము కలుగదు గాఁబోలు!

యా :- ప్రభు కటాక్షము.

అనుచు నొకచేతిని మీసముమీఁదికి రెండవచేతిని మొలలోని కత్తిమీఁదికిఁ బోనిచ్చెను. వాని మే నుప్పొంగెను. ఱొమ్ము విరిచెను. భుజముల మూపురములు పైకిలేచెను. మహారాజు అరమోడ్పుఁ గన్నులతో యాచేంద్రుని రాజభక్తిని, మగఁటిమిని బరికించి ముసిముసినవ్వులు నవ్వుకొనెను. రఘునాథరాయ లదికాంచి సాభిప్రాయముగా—

'ఇది మహారాజు సత్సభాసదనమిందు
నెందు శత్రులు పొడసూపరేల యాచ
శౌరు హస్తము ఖడ్గముఁ జేరె ? నడవి
పంది వేటలుతలఁపుచుఁ బొంచెనొక్కొ ?

పంకముల పొంకములువీడు పట్టులివ్వి
శాలి క్షేత్రాలి శరణంబు సలుపుచుండె
వారిదంబులు వెలవెలఁ బాఱుచుండె
నేల యాచేంద్రు కనుఁగవ యెఱ్ఱఁబాఱు ?

నగలుగాని యున్నఁగాని
నగలూను నె కలుష తెఱుపువన్నియు నెపుడేఁ
తగవుగాని యాచమేంద్రుని
మొగమను చందురునిఁగాంచి పులకించినవే.'

అనెను. మహారాజు సహజ గాంభీర్య వాక్యములతో రఘునాథరాయల రాసిక్యమును ఆశుకవితాశక్తిని గొనియాడి చేర చోళ పాండ్య మగధ మళయాళాది దేశంబుల తెఱంగు తెఱింగి మామగారగు జగ్గరాజుగారిని మన్నించి, యున్నవారి క్షేమంబులారసి రాయప్పవంకఁ జూచెను. అది గ్రహించి రాయప్ప—తా మందఱు రేపటినుండి జరుగు గజాశ్వరథ ఖడ్గాది పూజలకుఁ దప్పక దయచేయుచుండుఁడు. ఈ పదిదినములు యేలినవారి యాతిథ్యము స్వీకరింపుఁడు. అనఁగానే యందఱు తమ తమ విడిదిపట్టులకరిగిరి.

# రాజ దర్శనము

తిరుమల దేవరాయల పెండ్లియైనతరువాత వచ్చిన 'దసరా' మహోత్సవములలో మొదటిది యిదియె. కావుననే జగ్గరాజు, ఓబలరాయఁడు యాచేంద్రుఁడు రఘునాథరాయలు కొండవీటి తిమ్మరాజు మున్నగు ముఖ్యబంధువులు, సామంతులు, ఆప్తులు వచ్చియున్నారు.

నాఁడు నవమితిథి. మహారాజు నిట్టుపాసముచేసి సాయంకాలము దుర్గాదర్శనము కావించుకొని 'రక్తపుగద్దియ' నధిష్ఠించెను. సభాభవనమంతయు నెఱ్ఱని రత్నకాంతులచే వెలుఁగొందుచున్నది. రక్తవస్త్రధారులైన భటులు, సైనికులు, మంత్రి సామంతులు గొలువుదీరి యుండిరి. మహారాజు వీర వేంకటపతిరాయలు ఎఱ్ఱని వంకీతలపాగా ధరించెను. దానిపైని చిత్రదీధుతులతోఁ బ్రకాశించు తురాయి చూపఱదృష్టుల మిఱుమిట్లుగొలుపుచు శోభిల్లుచుండెను. బంగారు జలతారు నగిషీ పనిచేసిన ఎఱ్ఱని మొగములు నిలువుటంగీని (శర్వాణిని) దాల్చి కంఠమున దాడిమబీజమాల ననుకరించు రత్నహారమును వైచి కొనెను. చేతనున్న ఖడ్గము రక్తవర్ణభాసితకోశముతో శత్రు భీకరమై, మహిషాసుర మర్దినియగు మహాకాళిచేతి భీకర కర వాలము ననుకరించుచుండెను.

అప్పుడొక పూజారి దేవీప్రసాదమును దీసికొనివచ్చి మహారాజు నాజ్ఞచే నందఱికి నొసఁగెను. ప్రసాదస్వీకారానంతరము సభ చాలింపఁబడెను.

మహారా జంతఃపురమున కేఁగెను. రక్తాంబరముల విడిచి, మడుఁగుదోవతులు ధరించి, పవిత్రాసనముపైని గూర్చుండెను. సేవకులు దూరముగాఁ దొలఁగి చనిరి. రాణి వెంకటమ్మ గోక్షీరములను, గోఘృతమును, ద్రాక్షాగుళుచ్ఛములను, దాడిమఫలబీజములను, చిన్ని పూఁదేనెయు, చక్కెరయు, నాదిగాఁగల దివ్యపదార్థవిశేషములు వేఱువేఱు పైఁడిపళ్ళెరంబుల లోను, రత్నాల గిన్నెలలోను బెట్టుకొని స్వయముగాఁ దీసి కొనివచ్చి మహారాజు చెంతనుంచి, వికసితస్వాంతయై యల్లన చీరచెఱుంగున వీచుచు నిలఁవబడెను. మహారాజు ప్రశాంత చిత్తముతో వాని నారగించి లేచి, ప్రక్షాళితపాణివదనుఁడై మడుఁగుల విడచి, దగ్గఱనున్న సోఫాలోఁగూర్చుండెను. వెంకటమ్మ వెంటనే లోని కేఁగి తిరుమలదేవరాయని, వాని యర్ధాంగిని వెంటఁబెట్టుకొని వచ్చెను. వారితోడనే ఓబలరాయలు, జగ్గరాజుకూడ వచ్చిరి. వచ్చినతోడనే తిరుమలరాయలును భార్యయు మహారాజునకువంగి నమస్కరించిరి. మహారాజు మౌనముగా అధరస్పందముతో నాశీర్వదించి, యందఱను గూర్చుండుఁడనెను. జగ్గరాజు ఓబలరాయలు గూర్చుండిరి. తిరుమలరాయలు, భార్యయు, రాణి వెంకటమ్మయు నిలువఁబడియే యుండిరి. అదిగాంచి మహారాజు వారేదియో చెప్పఁదలచి యున్నారని గ్రహించి, రాణిని వీక్షించి, నవ్వుచు 'అత్త కొత్తకోడండ్రి పొత్తు హత్తుకొని యున్నదిగదా' యనెను.

వెంకమ్మ :- చిత్తము, అంతయుఁ దమవిలువయేగదా?

వీర-రా :- గుణవతి, విద్యావతి, సౌందర్యవతి పైఁగా మేన గోడలు అని కోరితెచ్చికొనిన కోడలు మూడుమూర్తుల నిన్నే పోలియున్నదనియా నీకీయానందము?

వేంకటమ్మ :- (ముసిముసి నవ్వులు నవ్వుచు) చిత్తము. తాము అన్యథా తలంపరేని ఒక్కమనవి.

వీర-రా :- అభ్యంతరమేమి ?

వేంకటమ్మ :- రేపు విజయదశమిగదా !

వీర-రా :- ఔను.

వేంక :- రేపు మహారాజావారు సింహాసనపూజ కావింతురు గదా !

వీర :- అది చిరకాలమునుండి వచ్చుచున్న యాచారమేకదా !

వేంక :- కావుననే ఒక్క మనవి.

వీర :- అనుమానమేల ? స్వేచ్ఛఁగా జెప్పవచ్చును.

వేంక :- ప్రతియేఁట మహారాజావారు సింహాసనపూజ చేయు సమయమున కిరీట ఖడ్గాదులు చిక్కదేవరాయలకిచ్చి గౌర వించుచున్నారుగదా !

వీర :- ఏదో చాలకాలమునుండి యట్లు జరిగిపోవుచున్నది.

వేంక :- ఈయేఁడు రేపటిరోజున మహారాజావారు సింహాసన మును బూజించునపుడు కిరీట ఖడ్గములు చిరంజీవి తిరుమల దేవరాయని చేతికిచ్చి సన్మానింపఁజేయుడు. ఇదే నా మనవి.

వీర :- ఎవరైననేమి కిరీట ఖడ్గాదుల నందుకొనుటకు ; యథా ప్రకారముగా జరిగిపోనిత్తుము.

వేంక :- తమకుఁ దెలియని దేమున్నది ? ఆ శుభసమయములోఁ గిరీటఖడ్గములు తమచేతినుండి యందుకొనువాఁడెకదా యువరాజపట్టము నందఁగలుగువాఁడు.

వీర :- 'సందో రాజా భవిష్యతి' దాని కేమి ? ముందు చూచుకొనవచ్చును.

వేంక :- ఇదిగో మా నాన్నగారు, మా యన్నగారు, నేను అందఱము మున్పటనుండి యనుకొనుచున్నాము. రేపు ముద్దుచెల్లించి తప్పక తిరుమలరాయునకే సింహాసన పూజాసమయమునఁ గిరీట ఖడ్గము లిప్పించవలయును.

వీర :- సరే. రేపటిపూటకు ఇప్పుడింత రాద్ధాంతమెందులకు? అట్లే చూచుకొందము. ప్రొద్దుపోయినది. మామగారు పెద్దలు. వెళ్ళి పరుండండి.

అనఁగానే యందఱును దప్పక తిరుమలరాయునికే మహారాజు యువరాజ గౌరవము నడపఁగలఁడని సంతసించిరి. రాణి యంతఃపురమున కరిగెను. తిరుమలరాయలు, భార్యయు, మహారాజునకు మ్రొక్కి తమనాగారమున కేగిరి. జగ్గరాజు ఓబలరాయలు తమతమ యునికిపట్టుల కరిగిరి.

# పూర్వగాథ

కన్యాకుమారికాగ్రము మొదలుకొని కటకమువఱకు నేకాతపత్రముగాఁ బరిపాలించిన శ్రీకృష్ణదేవరాయ సార్వభౌముఁడవతారము చాలించినాఁడు. తల్లికోటయుద్ధ మారంభమాయెను. విజయనగర సామ్రాజ్యనౌక శత్రు సముద్ర మధ్యమునఁ దెరచాప తెగి దిక్కుతోఁపక యల్లాడినది. నలుమూలలనుండి విరోధితండంబులు విజృంభించెను. పోరు ఘోరంబాయెను. కృష్ణానది రక్తప్రవాహ మయ్యెను. రామరాయల శిరోధి (మెడ) విరోధియగు నిజాంషాహాచే నఱకఁబడెను. ఇంకేమున్నది! హంపి విజయనగరము పగర చేతులలోఁబడి నిర్వీర్యము నిస్తేజమునైనది. రూపుమాసినది.

ఏరీ యా మహాకవిసార్వభౌములు! ఏరీ యా గాయకశిఖామణులు! ఆ దివ్యసౌధములు! ఆ సుందరమందిరములు! ఆ భవ్యదేవాయతనములు! ఆ మహోన్నత గోపురములు! ఆ జలనాళికలు! ఆ యుద్యానవాటికలు! ఆ నాట్యమందిరములు! ఆ గజశాలలు! ఆ గుఱ్ఱపుసాలలు! ఆ విపణివీధులు! ఆ రత్నరాసులు! ఆ కేళాకూళులు! ఆ ఘంటాపథములు! ఏవి? అన్నియు నామమాత్రావశేషములైనవి.

ప్రతి ప్రదేశమునను అరాజకచిహ్నములు పొడసూపినవి. వేయేల? కప్పకుఁ బండ్లువచ్చి కఱవవచ్చెను.

ఇట్లు విచ్ఛిన్నమై పోయిన విజయనగర సామ్రాజ్యమును సాధ్యమైనంతవఱకుఁ జిక్కఁబట్టి, యుక్కిమిగిలి సదాశివదేవ రాయలు పెనుగొండనుండి రామరాజు సాచివ్యమున రాజ్య పాలనము చేయసాగను. అట్లు కొంతకాలము కడచినది. విజయ నగర రాజ్యలక్ష్మి కొండొక నవీనతళను దాల్చినది. మోడు వాఱిన చెట్లు చిగిర్చినవి. వసంతోదయమైనది. మూకత్వము దాల్చిన యాంధ్రకవికోకిలములు కుహుకుహు రావములఁ గూయఁదొడఁగినవి. తిరుమలదేవరాయలు రాజ్యాధిపత్యము వహించినాఁడు. జీర్ణ కర్ణాటరాజ్యమును బునరుద్ధరించినాఁడు. కవి పండితుల లాలించి పాలించినాఁడు. 'సంస్కృతాంధ్ర భాషాసామ్రాజ్యసర్వంకష చతుర్విధ కవితానిర్వాహక సాహిత్య రసపోషణుఁడ'గు రామరాజభూషణునిచే వసుచరిత్రము నంకి తము పొందినాఁడు. కృష్ణరాయలనాఁటి వైభవోన్నతులను జూఱఁగొనినాఁడు. 'జీర్ణకర్ణాటాంధ్రపునరుద్ధారక', 'వీరప్రతాప రాజాధిరాజ', 'రాజపరమేశ్వర' 'అష్టదిగ్రాజకుల మనోభయం కర' 'జయజన్యమన్నెవిభాళ' 'మూఱురాయరగండ' 'ఎంతెంబర గండ' మున్నగు బిరుదములు వహించి ధరాపాలనముచేసి వెలుఁగుమాలిన తెలుఁగుజాతికి వన్నెయువాసియుఁ గలిగించి నాఁడు.

'వీనులవిందై యమృతపు
సోనలపొందై యమందసుమ చలదళిసీ
గానముఁ గ్రిందై' తిరుమల
మానవపతి కీర్తి గానమాధురి వెలసెన్.

ఆ రాజమార్తాండుని పిమ్మట నాతని సహోదరుఁడగు శ్రీరంగరాయలు రాజై తన రాజధాని 'చంద్రగిరికి' మార్చెను. ఆతని తమ్ముఁడు వేంకటపతిరాయలు. ఇతఁడే మన కథాకాలపు నాఁటి రాజు. శ్రీరంగరాయుల (రెండవ) కుమారుఁడు చిక్కదేవరాయలు బాలుఁడు కావునచే శ్రీరంగరాయుల యనంతరము రాజ్యభారము వేంకటపతిరాజు వహించెను. ఇతఁడు తిరుపతివేంకటేశ్వరుని భక్తుఁడు, రామానుజాచార్య శిష్యుఁడు. రాజనీతి నెఱిఁగినవాఁడు. పట్టిన కత్తి, కట్టిన కాసె విడకుండ దక్షిణదేశమంతయు అసివాలుగా నేఁగి యనన్యసాధారణశూరుఁడై హిందూరాజ్యస్థాపనకై నక్తందివము (రాత్రి-పగలు) పలుపాట్లు పడెను. నైజాము ప్రాంతమునుండి తలచుచున్న రాజ్యముపైకి దాడిచేయు తురుష్కులను జయించి మరల నట్టిదాడులు రాకుండ నరికట్టుటకై తన చెల్లెలి భర్తయగు తిమ్మరాజను మహావీరునకు గొండవీటి రాజ్యమును దుర్గమును నొసఁగెను. కొండవీటి తిమ్మరాజు దండిమగంటిమికి బెండువాటి మొండితనమునకు గండశత్రువులు గూడ నావంక రాజంకిరి. పెక్కుమంది రాజులు యుద్ధమక్కఱ లేకయే విజయనగర సామ్రాజ్యమునందలి యభిమానముచే వేంకటపతిరాయల సార్వభౌమత్వము నంగీకరించి యాతనిని రాజాధిరాజుగా మన్నించిరి. వారిలో ముఖ్యుఁడు తంజాపుర రాజగు శ్రీ రఘునాథరాయలు. కొందరు సామాన్యరాజులు తలబిరుసుఁదనముతో వేంకటపతిరాయల నెదిర్చి పోరిరి. ఆ యుద్ధములలో వేంకటపతిరాయలకు మధురాంతకము ప్రభువు వెలమకుల భూషణుఁడునునగు యాచేంద్రుఁడు బాసటయై నిలిచెను. ఆతని యనన్యప్రతాపైకసహాయుఁడై వేంకటపతిరాజు,

ప్రతిఘటించిన శత్రురాజులతోఁ భండనంబులఁ జెండాడి 'వీరవేంకటపతిరాయ'లను పేరుగాంచెను. ఒక సమయమున నుత్తరమునఁ బొట్నూరునొద్ద ఓఢ్రరాజులు కొందఱు తిరుగుబాటు చేసిరి. వెంటనే యాచేంద్రుఁడు వేంకటపతిరాయల యాజ్ఞగొని యచ్చటికి దండెత్తి వెడలి యుత్కళరాజుల నెదిర్చి మదమణఁచెను. యాచేంద్రుని ధాటికాఁగలేక యా యుత్కళరాజులు చెట్టుపుట్టపాలై, కొండగుహలను శరణుసొచ్చిరి. వెంటనే యాచేంద్రుఁడు బొబ్బిలి సంస్థానమును స్థాపించి యచ్చటఁ దన రెండవకుమారుని రాజప్రతినిధిగ నిలిపి తాను జంద్రగిరికి వచ్చి జరిగిన వృత్తాంతమంతయు వీరవేంకటపతిరాయలకు నివేదించెను. ఆతఁ డొనర్చిన సాహసకృత్యమునకు వీరవేంకటపతిరాయలు మెచ్చి 'ఉత్తరమల్లూరు' సంస్థానము నాతనికిఁ గానుకగా నొసంగెను. యాచేంద్రుఁడు కొంతకాలమునకు 'వేంకటగిరి' యను పట్టణము నిర్మింపఁజేసి తన రాజధాని నచ్చటికి మార్చెను. మధురాంతకమును దన పినతండ్రికుమారుఁడగు రాయభూపాలున కిచ్చివేసెను.

యాచేంద్రుఁడు తనకు నండగానుండఁగా భండనభీముఁడై మెఱసిన వీరవేంకటపతిరాయలు జీర్ణకర్ణాటరాజ్యమును తొంటి కంటె మిన్నగా సముద్ధరించి 'జీర్ణకర్ణాటరాజ్య పునస్స్రష్ట' 'హిందూరాజ్యసమాధురంధర' యను బిరుదములు వహించెను. కృష్ణరాయలనాఁటి రాజవైభవములఁ గూర్చిన యుదంతములను దెలుపుచు 'విజయనగర సామ్రాజ్య'మను గ్రంథమును రచించెను.

ప్రజలలో నూతనచైతన్యము రేకెత్తించుటకై యాతఁడేఁటేట శ్రీకృష్ణరాయల దసరాదర్బారులను దలపించు దర్బారులు చంద్రగిరిలో జరిపించుచుండెను.

వీరవేంకటపతిరాయల కిద్దఱు భార్యలు. పట్టమహిషి యగు పెద్దభార్యపేరు తిప్పాంబిక. రెండవభార్య వెంకటమ్మ. ఈమె కంబనోలురాజగు గొబ్బూరి జగ్గరాజు కూఁతురు. జగ్గరాజు వీరవేంకటపతిరాయలకు మామగారగుటయేగాక, సేనాధిపతికూడ. వెంకటమ్మ తమ్ముఁడగు ఓబలరాజు చంద్రగిరి దుర్గాధిపతి.

రాణు లిరువురకుఁగూడ బిడ్డలులేరు. అంతఃపురములోని పెత్తనమంతయుఁ బెద్దరాణిది. చిన్నరాణి యెందును జోక్యము కలుగఁజేసికొన వీలులేదు. పెద్దరాణి యెంత సరళవిశాలహృదయయో, చిన్నరాణి యంత సంకుచిత కుటిలస్వభావ. దసరా మహోత్సవములలో మహారాజు నగరువిడిచి యూరేఁగఁ జనునప్పుడు పెద్దరాణి చెలిమిఁ గేలంగిలించి యంతఃపురద్వారము వఱకు వచ్చుటయు నూరేఁగి తిరిగివచ్చినప్పు డీమెయె, హారతి యిచ్చి లోనికిఁ దీసికొనివెళ్లుటయు నాచారము. వెంకటమ్మ కది గిట్టదయ్యెను. తేళ్లు జెఱ్ఱులు ప్రాకినట్లయ్యెను. తన కడుపున నొక కుమారుఁడు జనించినచో భావిపాలకుని తల్లిగాఁదా నంతఃపురాధికారముఁ జెలాయింపవచ్చునని తలంచెను. మ్రొక్కరాని దేవతలకు మ్రొక్కెను. కాని యామెకోర్కె ఫలింపలేదు. దినములు గడచినకొలఁది సవతిపై మచ్చరంబు పెచ్చుపెరఁగఁజొచ్చెను. ఏమియుఁ దోఁచలేదు. ఆలోచించి

నది. ఆలోచించినది. ఊంకించినది. తల పంకించినది. తన చిన్ననాఁటి దాసియగు సంగనాచిని బిలిచినది. తన మెడలో నున్న చంద్రహారమును దీసినది, దాని మెడలో వేసినది. ఏదో చెవి గొఱికినది. వెంటనే సంగనాచి కోటదాఁటి వెడలినది. అతి రహస్యముగా నొక బ్రాహ్మణశిశువును దీసికొనివచ్చినది. రాణిచేతిలోఁ బెట్టినది. చిన్నరాణిగారికి మగశిశు వుదయించె నని ప్రకటించినది. మహారాజున కంతయు నవగతమైనది. కాని యామెయందలి ప్రేమాతిశయముచే నేమియు ననలేదు. ఆ శిశువును దన కుమారునిగానే లాలించెను. పాలించెను. అంత పురములోని యింతుల సంగతులు బైటఁ బొక్కరాదని గాంభీర్యమువహించెను. కాని లోకము మాయఁగ మూకుడుందునా? ప్రజలు తలకోకమాదిరిగాఁ జెప్పుకొనసాగిరి. ఆ కుఱ్ఱవానికిఁ దిరుమలదేవరాయలని నామకరణము చేసిరి. అతఁడు దినదిన ప్రవర్ధమానుఁడగుచుండెను. మహారాజు ఎల్లకార్యములయందుఁ దన యన్నయగు శ్రీరంగరాయుల కుమారుఁడగు చిక్కదేవ రాయలును యువరాజుగా గౌరవించుచుండెను. కాని వెంకటమ్మ (చిన్నరాణి) మాత్రము తాను పుత్రుఁడని ప్రకటించిన వానిని మహారాజు పుత్త్రుండుగా సంగీకరించెనని యనుకొనెను. తోడనే యంతఃపురాధికారములెల్ల దానె వహించెను. అది కని పెద్దరాణి తిప్పాంబిక యేమియుఁ జేయలేకపోయెను. చూచుచు నూరకొనెను. తిరుమలరాయలు పెరిగి పెద్దవాఁడయ్యెను. యౌవన మావిర్భవించినది. వాని నడకలు మహారాజున కంతగా నచ్చులేదు.

చిన్నరాణిని నామెతండ్రి జగరాజును 'ఈ తిరుమల దేవరాయని మహారాజు యువరాజుగాఁ బరిగణించునా ? రాజ్యభార మతని భుజస్కంధముపైని బెట్టునా ?' యను సందేహము పీడించుచునేయున్నది. వారి గుండె లనుక్షణమును 'పీచుపీచు' మనుచునేయున్నవి. తిరుమలరాయలు యువకుఁడు. కేవల మవివేకి కాఁడు. గడుసువాఁడు కాఁడు. అదియొకమాదిరి మానిసి. కాని లాభమేమి ? యువరాజ గౌరవము, మరియాద, యున్నియుఁ జిక్కరాయలకే మహారాజు జరుపుచుండెను. అల్లుఁకా దిట్లని మహారాజుతోఁ జెప్పుటకెవ్వరు సాహసింపఁ గలరు ? జనాపవాదము మాత్రమయ్యెను. ఏమిచేయుదురు ? జగ్గరాజు, కూఁతురు వెంకటమ్మ యేకాంతముగ ఆలోచించుకొనినారు. మంత్రి పెమ్మసాని తిమ్మరాజును, దండనాథుఁడు వీరనారాయణుని లోఁబఱచికొనినారు. అందఱు కలిసి యాలోచించుకొన్నారు. ఒక నిర్ణయమునకు వచ్చినారు. లోకులు కాకులై వాయుచున్న మచ్చ మాపుకొనఁదలపెట్టినారు. జగ్గరాజు కుమారుఁడైన ఓబలరాయని కుమార్తెను తిరుమలదేవరాయలకిచ్చి పెండ్లిచేయింప రాణి వెంకటమ్మతో నాలోచించి నిశ్చయించుకొనినారు. మామగారి యధికారముతో జగ్గరాజీ వార్తను మహారాజున కెఱిఁగించినాఁడు. మహారాజు కాదనక యంగీకరించెను. వివాహము మహేంద్రవైభవముగా జరిగిపోయినది. గంభీరమూర్తియగు మహారాజు తిరుమలదేవరాయలు తన కుమారుఁడైనట్లే వ్యవహరించుచుండెను. వెంకటమ్మ జగ్గరాజు ఓబలరాజు మున్నగు వారు తమ పథకము పాఱినదని లోలోన మురిసిపోవుచున్నారు.

కాన యేపుట్టలో నేపామున్నదో యెవ్వరెరుంగుదురు? మహారాజు హృదయముమాత్రము ఎవరికిని గోచరము కావుట లేదు.

---

# దర్బారు

రాత్రి రెండుజాములవఱకు మహానవమి మహోత్సవములలో మునిఁగి తేలిన రాజోద్యోగులు, సైనికులు, భటులు, 'దాసదాసీలు', చుట్టపక్కాలు, పౌరులు, పిల్ల, మేక అందఱు నాల్గవజాము ఆరంభమగునప్పటికే కోటలోని మంగళవాద్యములను విని లేచి యెవరి పనులలో వారు నిమగ్నులైరి. అంతలోఁ గోటలో దేవిడీయొద్ద వందిమాగధు లెలుఁగెత్తి—

'ఏవంకఁ జూచిన హేమకుంభ ప్రభా
మండితోజ్జ్వల సభామండపములు
ఏవీథిఁ జూచిన నిక్షురంభా స్తంభ
దర్పణాంచిత గృహద్వారభూమి
ఏచాయఁ జూచిన నిభతురంగానేక
రాహుత్త సుభటవిరాజితంబు
ఏదిక్కు చూచిన నేణ నేత్రా దేహ
ఘనసార మృగమద గంధ లహరి

యెచటఁ గనుఁగొన్న నవరత్నఖచిత రచిత
హాటకోన్నత వివిధశృంగార వనులు

కలిగి శ్రీ చంద్రగిరిపై వెలుఁగుచుండె
వీర వేంకటపతిరాయ ! వేగ లెమ్ము'

అని మహారాజును మేలుకొలిపిరి. అది విని మహారాజు మెల్లన లేచి నిత్యానుష్ఠానములు యథావిధిగా నిర్వర్తించుకొనెను.

లోకబాంధవుఁ డుదయించెను. పద్మినులు వికసించెను. 'లక్ష్మీవిలాస' మను పేరుగల సభాభవనము తలుపులు తెఱవఁబడెను. ఖిలేదారు రాయప్ప సింహాసనాదులు, భద్రాసనంబులు, చిత్రాసనంబులు, స్వర్ణాసనంబులు, రజతాసనంబులు, రత్నకంబళములు మున్నగునవి యథాక్రమముగ నమర్పఁబడి యున్నవో లేవో యని వరుస వరుసలుగాఁ దిరిగి సభాభవన మంతయుఁ బరికించెను.

తూర్పుగానున్న యున్నత చంద్రకాంత శిలావేదికపైని నవరత్న ఖచిత సింహాసన మమర్పఁబడి యుండెను. దాని చెంతనే స్వర్ణమయాసనము విరాజిల్లుచుండెను. దాని కించుక క్రిందిభాగమున మఱొక కనకాసనము భాసిలుచుండెను. దాని నానియె సింహాసనమునకుఁ గుడివైపుగా మగఱాల నిగనిగల వెలుఁగు పుత్తడి క్రొత్తయాసనము లైదు గలవు. ఆ వేదికకు నలుఁగెలంకులను రత్నదీపికా స్తంభములు వెలుఁగొందుచుండెను. ఆ వేదికకుఁ గ్రిందిభాగమున భద్రచిత్రాసనాదు లొకదాని వెనుక నొక్కటిగా వరుసలుదీర్చి యమర్పఁబడియుండెను. వాని వెనుక మంచెలపై రత్నకంబళములు పఱుపఁబడియున్నవి. సభాంగణమునకుఁ బైనున్న యంతస్తులో శుద్ధాంత ముగ్ధాంగనలు గూర్చుండి క్రింద జరుగు దర్బారు వేడుకలు చూచుటకై

త్రిభుజాకారముగా బంగారు రంగారు కుర్చీలు వేయఁబడి యుండెను.

'దర్బారు మహలు' ముఖద్వారమున వీరభటులు విచ్చు కత్తులతోఁ 'బహరా' యిచ్చుచున్నారు. ఆఱు గడియల ప్రొద్దెక్కినది. మహారాజు పేరోలగంబుండు సమయ మాసన్న మైనది.

రాజబంధువులు, దొరలు, మన్నీలు, సామంతరాజులు, పాళెగాండ్రు, సేనానాయకులు, అమరనాయకులు, ఆప్తులు, ఆశ్రితులు, ఆస్థానకవులు, పండితులు, పురోహితులు, ఆచార్య పురుషులు, జియ్యంగార్లు, యతులు, జ్యోతిషికులు, వైద్యులు, గాతులు, మాగధులు, వందిమాగధ వైతాళికులు, పాఠకులు, శాస్త్రవేత్తలు, నాటకాలంకారజ్ఞులు, విద్యాధికులు, వైణికులు, వాంశికులు, సాముగరడీలు నెఱపువారు, 'మొఖాసాదారులు' 'అగ్రహారికులు' 'దేశపాండ్యాలు' అమీనులు, సముద్దారులు, మున్నగాఁగల డెబ్బదిరెండు వినియోగంబులవారు సభా మందిరమునకు వచ్చి యెవరిస్థానమున వారు గూర్చుండిరి.

ఇంతలో—జయ! వీరప్రతాప రాజాధిరాజ! జయ! రాజ పరమేశ్వర! జయ! అష్టదిగ్రాజకుల మనోభయంకర! జయ! జన్య మన్నెవిభాళ! జయ! మురురాయరగండ! జయ! ఎంతెంబురగండ! జయజయ! జీర్ణకర్ణాటాంధ్ర సామ్రాజ్య పునస్స్రష్టా! విజయీ భవ! యను సాహణినాదములు అంతఃపురము బహిర్ద్వారము నొద్దనుండి వినవచ్చెను. తౌర్యత్రికములు మొరసెను. భేరులు మ్రోఁగెను. శంఖములు నినదించెను. వీరభటులు బరాబరులు

చేయుచుండఁగా హెగ్గడికత్తెలు వింజామరలు వీచుచుండఁగా పురోహితుఁడు ముందు నడవఁగా మహారాజు వీరవేంకటపతి రాయలు, మంత్రి పెమ్మసాని తిమ్మరాజు, చిక్కదేవరాయలు, తిరుమలరాయలు, జగ్గరాజు, కొండవీటి తిమ్మరాజు, యాచేంద్రుఁడు, రఘునాధరాయలు ఒకరి వెంబడి నొకరు సభామందిరమును బ్రవేశించిరి. రాజాగమనంబును గాంచి సభ్యులెల్లరు లేచి నిలఁబడి వంగి నమస్కరించిరి. మంత్రి మహారాజాజ్ఞచే వారి నందఱిని యథాస్థానంబులఁ గూర్చుండుఁడని చెప్పెను. అందఱు తమ తమ స్థానముల నలంకరించిరి. చంద్రశాలోపరి భాగంబుననుండి రాజాంతఃపురస్త్రీలు మేఘముల చాటుననున్న మెఱపులవలె వేడుకలఁ దిలకించుచుండిరి,

పురోహితుఁడు మహారాజుచే సింహాసనమునకు షోడశోపచార పూజ చేయించుటకై యుపక్రమించెను. మహారాజు తన కరవాలమును కిరీటమును దీయుచుండెను. సరాలున జగ్గరాజు, చెంతనున్న తిరుమలరాయుని వాని నందుకొనుమని కనుగీటెను. అతఁడు వెనుకాడుచుండెను. చిక్కరాయలు ముందడుగువేసి నిలిచెను. జగ్గరాజు మహారాజును వీక్షించెను. సాహాయ్యుఁడై 'మహారాజా! పూజానంతరమునఱకు నీ ఖడ్గ కిరీటములు నీ యారసపుత్త్రుఁడగు తిరుమలరాయని చేతి కీయవలయునని నిర్బంధించెను. మహారాజు నిసర్గ గాంభీర్యముతో అట్లిచ్చుటకు వీలులేదనెను.

జగ్గరాజు ఇచ్చితీరవలయుననెను. మహారాజు నివ్వుగుగప్పిన నిప్పువలె "జగ్గరాజుమామగారూ! తగ్గుము. శుభముహూర్తము దాఁటిపోవుచున్నది." అనెను.

అనఁగానే యీ మాటతోఁ గొండవీటి తిమ్మరా జందుకొని 'జగ్గరాజుగారూ! కానిం డీయేఁటి కీమహోత్సవము మామూలు ప్రకారముగా' అనెను. జగ్గరాజు ససేమిరా యనుచుండెను. సభయంతయు 'నిర్ఘాంత'పోయి చూచుచున్నది. మహారాజు తన సహజారుణ నేత్రములతో జగ్గరాజును వారించుచుఁ గుందనపు నగిషీ జిలుగు వెలుఁగులు చిమ్ము నొఱతో మెఱయు ఖడ్గమును చిక్కదేవరాయల చేతికిచ్చెను. చిక్కరాయలు సవినయముగ నందుకొనెను. మహారాజు కిరీటమును దీయుచుండెను. జగ్గరా జగ్గిమీఁది గుగ్గిలమై భగ్గుమని మకుటము నందుకొనుటకై ముందునకు వచ్చెను. అదిచూచి యాచేంద్రుఁడు తన సార్వభౌమునకు గౌరవ భంగము గలుగుచున్నదని తలంచి, లేడిపైకుఱుకుఁ గొదమ సింగంబువలె నిశిత నిస్త్రింశము (వాడికత్తి)ను జళిపించుచు ముందునకువచ్చి జగ్గరాజును రెట్టవట్టి యావలకుఁ ద్రోసెను. ఆ త్రోపువడి జగ్గరాజు త్రోఁకతొ్రక్కిన త్రాఁచువలె మండిపడెను. యాచేంద్రుఁడు జగ్గరాజును రూక్షవీక్షణంబుల వీక్షించి 'జగ్గరాజా! నీ పెగ్గె లెఱుంగనివారము గాము. హనుమంతుని ముందరనా కుప్పిగంతులు. చాలింపు, తొందరపడకు. ఇది రాజశాసనము, ధిక్కరింప నేరికిఁ దరము గాదు. కిరీటముగూడఁ జిక్కదేవరాయలే యందుకొని తీరవలయును. ఆతఁడే యువరాజు, అదే రాజాభిప్రాయము. రాజాజ్ఞ, అడుగు ముందుకు పెట్టకు, అగౌరవము చెందఁగలవు' అని గద్దించి పలికెను. జగ్గరాజు సిగ్గుపడి సభ వీడిపోయెను.

మహారాజు మంత్రినిగాంచి నీవుపోయి జగ్గరాజను బిలుచుకొని రమ్మనెను. మంత్రి వెడలెను. పురోహితుఁడు పూజ చేయించెను. మహారాజు చిక్కరాయల చేతిలోనున్న కిరీటమును ఖడ్గమును దీసికొని ధరించెను. సభ్యులు జయజయ నినాదములు చేసిరి. మహారాజు సింహాసన మెక్కబోవునపుడు తనకంటెఁ బెద్దవారైన యాత్మబంధువులకు మ్రొక్కుట పరిపాటి. మామగారగు జగ్గరాజు దగ్గఱ లేకుండుటచే బావగారైన కొండవీటి తిమ్మరాజునకు నమస్కరించి సింహాసనము నధిష్ఠించెను. విప్రు లాశీర్వదించిరి. సదస్యులు జయజయ నినాదములతో లాజలు సల్లిరి. మంత్రి సామంతాది సకల ప్రజలు తమతమ శక్తుల ననుసరించి మహారాజునకు సువర్ణ పుష్పములతోఁ బాదపూజ గావించిరి. ఆ వాడదేశపురాజు గండపెండేరములఁ రాజేంద్రుని యడుగుల భజించెను. పాండ్యరాజు బంగారు పావలంపి చరణముల తాఁకెను. వారాంగన లాడిరి. గాయకులు పాడిరి. ఇంతలో జగ్గరాజు వచ్చెను. అప్పటికి వీరనరసింహరాయలు సింహాసనాసీనుఁడై యుండుటచే మహారాజుపై గౌరవము ప్రకటించుకొనుటకై జగ్గరాజు వంగి నమస్కరించెను. అదిచూచి యాచేంద్రుఁడు తిరస్కారపూర్వకముగా నవ్వెను. పిమ్మట మహాకవి రామరాజభూషణుఁడు లేచి

'చుట్టఁజుట్టుకొని శేషుఁడు నిద్దురయెపోవు
ముదిపన్నగములలో మొదటివాఁడు
మొనయుకాదిమకూర్మము ముసుంగు మేనుమో
పిసఁ బెద్దవారిలోఁ బెద్దవాఁడు

సమధి కాశావాప్తి హస్తముచాఁచుఁ
బద్మినీవైరి దిక్కరితల వడఁకువాఁడు
తనయొంటి పంటిచేతనె యంటు నాదికా
లము ఘూర్ణి పాండురోమములవాఁడు
కదల లేఁడద్రి బహువయఃక్రమమువాఁడ
టంచు వారల నిరసించి యవనికాంత
తన భుజాదండమునను౦డఁ దనరుచుండు
భావజనిభుండు వేంకటక్ష్మావిభుండు.'

'ఆంధ్రీశుం డతి దానశూరుఁ డతి రమ్యాకారుఁ డత్యంత సుప్రసన్నుఁ డంచుందను సన్నుతించు కవివాగ్వ్యాపారమెల్లన్ యథార్థతముంబై విలసిల్లఁ దిర్మలమహారాయేంద్రు శ్రీ వేంకట క్షితినాథోత్తముఁ డందుఁ దందు గతిగల్పించుం గవిశ్రేణికిన్'

అని యిప్పు పూఁదేనె జాలువాఱునట్లు మధురాతి మధుర స్వరముతో వీరవేంకటపతిరాయ మహారాజు కీర్తిని గానముచేసెను.

పిమ్మట మంత్రి పెమ్మసాని తిమ్మరాజు లేచి రాజ్యాభివృద్ధిని ప్రజారక్షణమునుగూర్చి మహారాజు గావించు ప్రజాసేవను వివరించువాఁడై

మహారాజశేఖరా! సభ్యులారా! శ్రీమన్మహారాజాధిరాజ జీర్ణ కర్ణాటాంధ్ర సామ్రాజ్య పునస్స్రష్టలగు శ్రీ వీరవేంకటపతిరాయలవారు సింహాసనస్థులైనది మొదలుకొని నేఁటివఱకు బొక్కసమున నిలువయున్న మూలధనము, పదునెనిమిదికోట్ల ముప్పదియాఱు లక్షలు. ఇదికాక కర్ణాటక

సామ్రాజ్యము నందుఁగల వివిధములగు పరగణాలలో నున్న నిలువ ఎనిమిదికోట్ల నాలుగులక్షలు. దేవాదాయ, బ్రహ్మదాయ, సర్వమాన్య మతములకు నలువదిలక్షలు పోఁగా మిగిలినది ఆఱుకోట్ల పండ్రెండులక్షల పదునాఱువేల గుఱ్ఱములకు, నాలుగువందల రెండు ఏనుఁగులకు, రెండులక్షల కాల్బలమునకు, గుత్తి, గండికోట, గుఱ్ఱంకొండ, మద్దూరు, సోమగిరి, పెనుఁగొండ, నంద్యాల, శ్రీరంగపట్టణము, ఉమ్మత్తూరు, మధుర, పాళ్యముకోట, దిండిగల్లు, డంకినీకోట, శ్రీవిల్లిపుత్తూరు, పొట్నూరు, గోపాలపురము మున్నగాఁగల, చోటులలో నగుచున్న వ్యయము ఎనిమిదికోట్ల మూఁడులక్షల ముప్పదివేల వరాలుపోను మిగిలియున్న నిలువ మూఁడుకోట్ల ముప్పదిలక్షల నాల్గువేలు. అందు అగ్రహారములకు, తటాకములకు అన్నసత్రములకు వ్యయపఱుపఁబడిన ద్రవ్యముపోను, ఇప్పటికి మూలధనములోఁ జేర్చుటకు రానైయున్న ధనము మూఁడుకోట్ల రెండున్నరలక్షలు. ఈ మూలధనమునుండి రాఁబోవు సంవత్సరమునకు కావేరి, తుంగభద్ర, స్వర్ణముఖి, మున్నగు నదులకు ఆనకట్టలు కట్టించుటకు, ఏడుకోట్ల రూపాయలవఱకు వెచ్చించుటకు శ్రీ ప్రభువువారు అనుజ్ఞ దయచేసియున్నారు. ప్రజలు ఈతిబాధలు లేకుండఁగ సుఖముగఁ గాలము పుచ్చుటకే యీ యేర్పాటు గావింపఁబడెను. ఇంతియెగాక, శ్రీ సార్వభౌములు తలపెట్టిన యొక శుభకార్యము దమకు నివేదించుకొనుచున్నాను. తమ యేల్బడిలోనున్న ప్రతి పదేసి గ్రామములకు నొక్కొక్క యుచిత వైద్యశాల స్థాపంపనున్నారు. ప్రజలు నిరామయు

లుగా రామరాజ్యమునందువలె సుఖింపఁజేయుటయే శ్రీవారి యుద్దేశ్యము." అని నుడువఁగానే సదస్యులెల్ల అమందానంద హృదయులై కరతాళధ్వనులను చేసిరి. పిమ్మట మంత్రి సభ్యులను గాంచి "పూజ్యులారా! మీ యందఱి సమక్షమున మన సార్వభౌములకుఁ గుడిభుజములైయున్న శ్రీ రఘునాథ రాయలవారికిని, శ్రీయాచేంద్రులవారికిని రత్నఖచిత సువర్ణకోశ యుత కరవాలమును బహూకరించుచున్నారు. మఱియుఁ దమ యాస్థానకవులలో 'ఏకదిన ప్రబంధ ఘటికా సద్యశ్శత గ్రంథ కల్పనుఁడగు, రామరాజభూషణునకును పదకవీశ్వరులైన అన్నమయ్యగారికినిఁ బ్రత్యేకముగా నొక్కొక్క యగ్రహారమును, దయచేయుచున్నారు." అని ప్రభువుకంకఁ జూడఁగానే మహారాజు, రఘునాథరాయ యాచేంద్రులకు ఖడ్గరాజములను సబహుమానముగా నొసంగి, యగ్రహార దాన తామ్రశాసనముల రామరాజభూషణునకు నన్నమయ్యకు నొసంగెను. సభాభవనమంతయుఁ గరతాళ ధ్వనులచే మాఱుమ్రోఁగెను. వెంటనే యొయ్యారికత్తెలు తమ వాఁడిచూపుల సభ్యుల నదలించుచు నందఱకుఁ జందన తాంబూలాదు లొసంగిరి. సార్వభౌముఁడు లేచెను. సభ చాలించఁబడెను. ఎవరి బసకు వారు చనిరి.

సాయంకాలము జమ్మికిఁ బ్రదక్షిణించుటకై మహారాజు బయలుదేఱుటను సూచించుచు దేవిడీపై తూర్యారావములు గావింపఁబడెను. ఆ ధ్వనులను విని పౌరులందఱు త్వరత్వరగాఁ బలురకముల దుస్తులను ధరించి, కోటపైపునకు విఱుగఁబడి రాఁ దొడఁగిరి. బంగారు నగిషీగల యంబారీని బూన్చిన గజరాజములు దర్బారు మహలునకు దగ్గరగా నిలువఁబడి ఘీంకార

ములు చేయుచుండెను. మహారాజు సపరివారుఁడై యచ్చ
టికి వచ్చి తాను భద్రగజము నధిష్ఠించి తన ప్రక్కనే చిక్క
దేవరాయలను గూర్చుండఁబెట్టుకొని యమాత్యుని మఱియొక
గజముపైఁ గూర్చుండ నియోగించెను. రఘునాథరాయ,
యాచేంద్రులు, గొబ్బూరి జగ్గరాజు, ఓబలరాయలు, కొండవీటి
తిమ్మరాజు లుత్తమాశ్వముల నలంకరించిరి. ఊరేగింపు
సాగెను. మహారాజుగారి కరిరాజు దేవిడీ దాటఁగనే యిసుపది
యొక్కమార్లు శతఘ్నులు పేల్పఁబడెను. అంతలో నెదురుగా
నిలిచి, కటకపు రాజయిన గజపతి పంపిన మదపుటేనుఁగులు
తమ రాజునకు బదులుగా హస్తములు మోడ్చి నిలిచెను. అశ్వ
పతి పంపిన గుఱ్ఱములు కళ్ళెముచే వెనుకకు బిగింపఁబడిన
మోరల నల్లాడ్చుచుఁ దమ యేలికకుగాను దండము పెట్టెను.
ఆశ్వికులు పౌరులను బరాబరులు చేయుచుండిరి. పౌర నారీ
మణులు సౌధోపరితలంబులనుండి మహారాజుపై పూలు,
పేలాలు, ముత్యాలు చల్లుచుండ తమ చీరచెంగులను బట్టు
కొని, లాగుచు "అమ్మా ! కిరీటముపైఁ దురాయి యెగురు
చున్నవారేగా మహారాజుగారు ? చిత్ర చిత్ర వర్ణములతోఁ
గన్నులు మిఱుమిట్లు గొల్పుచున్న యీ రత్నహారములు వేసి
కొన్నవారేగా మన మహారాజావారు ? అమ్మా ? రాజులందఱ
కీ నిమ్మకాయలు నిలువఁబెట్టెడి కోరమీసములు, విశాల
సుందరముఖములు, దీర్ఘనాసికములు ఇట్లే యుండునా ?
ఏమమ్మా ! ఆ ప్రక్కనున్న నూనూఁగు మీసాలవారేనా
యువరాజావారు ? అబ్బా ! ఎంత అందముగా, ఠీవిగా, ఉన్నా
రమ్మా ?" అని ప్రశ్న పరంపరలు గురియుఁ బిల్లలకు 'అవును

నాయనా. ఊరుకోరా చూడురా యుత్సవము.' అని తల్లు లుల్లాసముతో సమాధానములు చెప్పుచుండిరి. భిల్లు లాడుచుండిరి. వారాంగనలు పాడుచుండిరి. సరదాసులు, సాము చేయుచుండిరి. గజ ఘీంకృతులతో, హయహేషలతో నుత్సవము దసరా దిబ్బకు సాగిపోయెను. మహారాజాదులు వాహనములనుండి క్రిందికిఁ దిగిరి. ప్రజలు కొండలు చుట్టును నమర్పఁబడియున్న మంచెలపైఁ గూర్చుండిరి. యువకులు కొండలు చుట్టుపట్టులనున్న చెట్ల కొమ్మలపై కెక్కిరి. మహారాజాదులు తూర్పుదిశగానున్న వేదికలపైఁ గల భద్రాసనములపై నాసీనులైరి.

అంతలో నొక రాజపుత్త్ర వీరుఁడొక పంచకళ్యాణి గుఱ్ఱంబు నెక్కివచ్చి మహారాజునకు నమస్కరించెను. మహారాజు కటాక్ష వీక్షణములతో ననుజ్ఞ యిచ్చెను. వెంటనే యా మేటి యాశ్వికుఁడు 'ఛే' యని యశ్వము నదల్చెను. అది వాయువేగ మనోవేగములతోఁ బఱవఁదొడఁగెను. ఆ యాశ్వికయోధుఁడు కళ్ళెమును విడిచిపెట్టి తన శిరోవేష్టనము (తలపాగా) ను విప్పివేసెను. అది రమారమి నలువదిమూరల పొడవుండును. ఆ విప్పిన తలచీరను ఒక చేతితోఁ జక్కదిద్దుకొనుచు నొకచేతితోఁ జుట్టుకొనెను. అట్లు కావించినపిమ్మట గుఱ్ఱమును నాలుగుకాళ్ళు సాచి నేలమీఁదఁ బ్రాఁకునట్లు తఱిమి, భూమిపైఁ బెట్టబడియున్న నిమ్మకాయను దన చేతిలోని వాఁడి కత్తితో రెండు ముక్కలుగా నఱకెను. చూపఱులు చప్పట్లు సఱచిరి. పిమ్మట నిరువురు యోధాగ్రేసరులు కత్తులు త్రిప్పుచుఁ దమతమ మేనులకు రాచికొనియున్న మంచిగంధపుఁ బూఁతలను

ఖడ్గధారలచే నైపుణ్యంబు మెఱయఁ దీసి[illegible]నిరి. అది కాంచి మహారాజానంద పరవశుఁడై తన పచ్చలహారమును ముత్యాల హారమును జెట్టియొకనికిఁ గానుకగా నొసఁగెను. వెంటనే యువరాజు చిక్కదేవరాయలు తన వజ్రపుటుంగరమును, గుఱ్ఱపుస్వారిచేసిన యాశ్వికునకు నొసంగెను. అచ్చటనున్న యెల్లవారు 'సెబాస్! మహారాజునకుఁ దగిన యువరాజు' అని కొనియాడిరి.

పిమ్మట మహారాజు శమీపూజ గావించి జమ్మికిఁ బ్రదక్షిణించి మరల గజవాహనారూఢుఁ డయ్యెను. వాద్యములు మ్రోఁగెను. ఊరేగింపు వేడుక ఘంటాపథమునుండి సాగినది. పౌరపురంధ్రీ రత్నములు సేసలు చల్లిరి. చేతులెత్తి మ్రొక్కిరి. జేజేలు కొట్టిరి. క్రమముగా నూరేగింపు జాముఱాత్రి యగునప్పటికిఁ గోటకుఁ జేరెను. మహారాజు దర్బారు మహలువద్ద కరివాహనమునుండి క్రిందికి దిగెను. అందఱు చేతులెత్తి నమస్కరించి యెవరి బసలకు వారు చనిరి. యువరాజు మహారాజు ననుమతింబొంది తన సౌధమున కేఁగెను.

మహారాజు, కంచుకి దారిచూపఁగాఁ గక్ష్యాంతరములు గడచి యంతఃపురమునకుఁ జనెను. 'మహారాణి' వెంకటమ్మ యెదురుగావచ్చి మహారాజునకు హారతి యీయలేదు. అట్లీయకపోవుట యాచార పరంపరాస్థితికి విరుద్ధము. ఒక బ్రాహ్మణ పురంధ్రి నిజకోమలకర పల్లవములతో మందస్మిత సుందర వదనారవిందయై యెదురువచ్చి కర్పూరపు నీరాజనము నొసంగెను. హారతి నందుకొని మహారాజు శయనాగారమున కేఁగెను.

హంసతూలికా తల్పముపైని శయనించెను. కాని నిద్దుర పట్ట లేదు. జగ్గరాయల యాగడము, వెంకటమ్మ యలుక, తన ముదిమి యన్నియు మూర్తీభవించి యతని కనులయెదుట నృత్యమాడఁ దొడఁగెను. అటునిటు దొరలెను. లేచెను. కూర్చుండెను. పరుండెను. లేచెను. ఇటునటు గదిలోనే పచారులు చేసెను. మరల శయ్యఁ జేరెను. పైకిఁ జూచుచు నిట్లు వితర్కించుకొనెను.

"ఈ విజయదశమీ మహోత్సవము నా జీవితములోఁ గడపటిది కావచ్చును. నా వయస్సు మీఱిపోయినది. ఏక్షణ మెట్టిదో నేను జీవించియుండఁగనే నా యనంతరపు రాజును నిర్ణయించి తీరవలయును. కానిచో శ్రీకృష్ణదేవరాయల యనంతరము విజయనగరమునకుఁ బట్టిన దుర్గతియే చంద్రగిరికినిఁ బట్టఁగలదు. కత్తి కలము సమానముగా నడపిన రాయలు ఎంత వీరుఁడు! ఎంత పండితుఁడు! అయిననేమి? తుదిగడియలలోఁ దన యనంతరపు రాజును నిర్ణయింప లేకపోయినాఁడు. తుద కేమైనది. కర్ణాట సామ్రాజ్యము అస్తవ్యస్తమైనది. విజయనగర మహాపట్టణము నామమాత్రావశేషమైనది. ఆ జీర్ణ కర్ణాటక సామ్రాజ్యమును మరల ఒంటికి సుఖము, కంటికి నిద్ర లేకుండ ఖడ్గైక శరణ్యుఁడనై పునరుద్ధరించితిని. దీనికి ఇప్పుడే నేను భావిరాజును నిర్ణయింపనైతినేని దప్పక గత చరిత్ర పునరావృతమగును. ఈ సామ్రాజ్యమంతయు ఈనఁగాచి నక్కలపాలు చేసినవాఁడ నగుదును. తిరుమలరాయనిఁ జూచుచు నెట్లు రాజును చేయఁగలను. ఆ కృత్రిమ పుత్త్రుని రాజును జేసినచో

లోకము నవ్వదా ? సామంతరాజు లంగీకరింతురా ? రాయల పేరుతో నీ సామ్రాజ్యమును బునరుద్ధరించితినిగాని యిందు నా ప్రజ్ఞ యిసుమంతయు లేదు. రాయల వంశముపై భక్తి విశ్వాసములే నా యేల్బడికి మూలములయ్యెను. ఇప్పుడీ కృత్రిమపుత్రు నభిషిక్తుఁ జేసితినేని బ్రజావిప్లవము తప్పదు. దేశ మరాజకము కాకమానదు. ఎవ్వ రంగీకరించినను దిరుమల రాయని రాజుగాఁ జేయుటకు యాచేంద్రుఁ డెన్నఁడు నొప్పుకొనఁడు. యాచేంద్రుని బాహుశక్తి బుద్ధిబలము సహాయముగా నున్నన్నినాళ్ళే సామ్రాజ్యపు దీప్తి. ఏమైన సరె, కుటుంబ కలహము వచ్చిన వచ్చుఁగాక ! చిక్కదేవరాయని నా బొందిలోఁ బ్రాణముండఁగానే యభిషిక్తుఁ జేసి, కర్ణాటసామ్రాజ్యము నాచంద్రతారార్కముగా వర్ధిల్లఁజేసెదను" అని యనుకొనుచు సుఖనిద్రను జెందెను. రాత్రి గడచినది. తెల్లవారినది. మహారాజు లేచెను. రాచకార్యములలో నిమగ్నుఁడయ్యెను. దసరాకు వచ్చినవా రెచ్చటివా రచ్చటికేఁ జనిరి. కాలచక్రముతోపాటు రాజ్యచక్రము యథాప్రకారముగాఁ తిరిగిపోవుచున్నది.

# మరణము

వసంతకాలము వచ్చినది. చెట్లు చిగిర్చి పుష్పించెను. గండుఁ గోయిలలు కొమ్మ కొమ్మలపై గూర్చుండి కుహూ కుహూ యని కూయుచుండెను. తుమ్మెదలు పూఁదేనెలాని జుమ్మని ఝుంకారము చేయుచుండెను. చిలుకలు కలికిపలుకులఁ గులుకుచుండెను. గోరువంకలు నోరులార నీరుపట్టులఁజేరి వారికణములను గ్రోలుచుండెను. ప్రాణికోటులు చెట్లనీడల నాశ్రయించి సుఖించుచుండెను. దివసములు పరిణామ రమణీయములయ్యెను. సలిలములు సులభావగాహములయ్యెను.

చంద్రగిరి దుర్గమంతయు వట్టివేళ్ళ ఘుమఘుమలతోఁ బన్నీటి సీరముల జల్లులతోఁ జల్లదనముల కిక్కయై యొప్పుచున్నది. కాని యేమిలాభము? బాహ్యశాంతియేగాని యంతశ్శాంతి కోటలోనున్నట్టు గన్పట్టుటలేదు.

మహారాజు వీరవేంకటపతిరాయలు మంచముపట్టి కృశించుచుండెను. నానాఁటికి నాతనిస్థితి నీరసించుచున్నది. ఏదో తీరని సమస్యతో నతఁడుక్కిరిబిక్కిరై పోవుచున్నాఁడు. ఊపిరాడుటలేదు. వయోవృద్ధుఁడు. దేనిని దెంపుచేసికొనలేకున్నాఁడు.

తాను మిక్కిలి ప్రేమించిన చిన్నరాణి వెంకటమ్మ యెడమొగము, పెడమొగముగా నున్నది. మామగారగు గొబ్బూరి జగ్గరాజుగారు జబ్బుగానున్న తన్నుఁ జూడవచ్చియు మనసిచ్చి పలుకరించుటలేదు. బావమఱఁది ఓబలరాజు డసలే రుసరుసలాడుచున్నాఁడు. తన యల్లుఁడు తిరుమలరాయనికి జరిగిన

యవమానమునకు. కాని యెవరేమి చేయఁగలరు! రాజున కాగ్రహము వచ్చినదని చచ్చినట్లు పడియుండిరి.

ఉన్నట్లుండి రాజొకనాఁడు తన నీరసస్థితినిఁ దలంచి కలంగి, మంత్రి పురోహిత సామంత దండనాథుల రావించి యిట్లనెను.

"అప్పలారా! నే నిన్నినాళ్లు పరిపాలించిన సామ్రాజ్యము మా యన్నగారగు శ్రీరంగరాయలవారిది కాని నాది కాదు. వారి రాజ్య మేలవలసినవాఁడు వారి కుమారుఁడగు చిక్క దేవరాయలుగాని నేనుగాదు. అతఁడు ప్రాజ్ఞుఁడై యుండఁగా నింక నెంతకాలమని నేను వాని రాజ్యము నాక్రమించుకొని కులుకుదును? నాకా వార్ధకము పైఁబడినది. ఎన్నినాళ్ళేలినను నేమిలాభము? తుదకు రాజ్యాంతమందు ననుభవించునది నరకమేకదా! నాకుఁ దుదిగడియలు సమీపించిన ఛాయ లగపడుచున్నవి. ఇఁక బ్రతికినన్నాళ్ళు బ్రతకను. నేఁడో రేపో యే గడియలోనో నాకమునుండి పిలుపువచ్చును. అది రాకమునుపే నా కనులముందు మీ యందఱి సమక్షమున చిక్కదేవరాయలకు ఖడ్గ కిరీట రాజముద్రికల నొసంగుచున్నాను. నేఁటినుండి మీకు మహారాజు అతఁడుగాని నేనుగాను. తిరుమల దేవరాయలు మావాఁడని మీ రంద ఱెఱింగినవిషయమె. అతని కెంతను నే లోఁగును రానీయక నాకు మాఱుగాఁ జూచుకొనుఁడు. అని మంత్రి పెమ్మసాని తిమ్మరాజునంక సాభిప్రాయముగాఁ జూచెను. వెంటనే మంత్రి రాజహృదయము గ్రహించి ఖడ్గ కిరీట రాజముద్రికల రాజున కందించెను.

మహారాజు చిక్కదేవరాయలను జెంతకురమ్మని పిలిచి భగవద్ధ్యాన పూర్వకముగా నాశీర్వదించి కిరీటము వాని శిరమునఁ బెట్టి కత్తి చేతికిచ్చి రాజముద్రిక గల యుంగర మతని వ్రేలికిఁ బెట్టెను. అందఱు సంగీకార సూచకముగా మందహాసము గావించిరి. రాజు మొగమెత్తి యాచేంద్రునివంకఁ జూచెను. వెంటనే యాచేంద్రుఁడు మహారాజు చెంతకు వచ్చెను.

వీర :- యాచేంద్రా ! నీ భుజబలము బుద్ధిబలము మా సామ్రాజ్యము సుస్థిరమగుటకుఁ గారణములైనవి. ఇఁక మీఁదఁగూడ నిట్లే.... . ...

యాచేం :- తమ రవక్రపరాక్రమముచే శత్రువులఁ జించి చెండాడి దేశమును సరీతిబాధముగాఁజేసి ప్రజలకెట్టి యలజడి లేకుండఁజేసినారు. కృష్ణరాయలకుఁ బిమ్మట విజృంభించిన మహమ్మదీయులు మరల మీ యేలుబడిలోనేకదా తల పైకెత్తకుండఁ బడియున్నది. తఱచు నైజాము ప్రాంతము నుండి తక్కలచెదపలె వచ్చిపడెడు యవనసేనల నరికట్టుటకుఁ గొండవీటిలో శ్రీ తిమ్మరాజుగారిని దాము నియమించుటచేఁ దమ రాజనీతి విశారదత్వము వెల్లడి యగుచున్నది. ఆ కొండవీటి పరగణా శ్రీ తిమ్మరాజుగారికిఁ దమ రొసంగుట 'యేకక్రియాద్వ్యర్థకరి' (ఒక పని రెండు ఫలితముల నొసంగును) యనునట్లైనది. తమ చెల్లెలుగారైన రాధికాదేవి గారి కాభూభాగ మరణ మిచ్చినట్లయినది. తిమ్మరాజుగారు కొండవీటి దుర్గములో నుండుటంజేసి తురుష్కుల దండయాత్రలు పూర్తిగా నరికట్టఁబడినవి. దక్షిణదేశమునుండి

విరోధుల దాడులు లేకుండఁ దంజాపూరులో మన రఘునాథ రాయ లుండనే యున్నాఁడు. ఉత్తర ప్రాంతమున ఒడ్డె రాజుల గర్వఁదనము సాగనీయకుండ మావాఁడు బొబ్బిలిలోఁ గలఁడుగదా ! అవసరమునుబట్టి యున్నంతలోనే నేనొక కంటఁ జూచుకొనుచునే యుందును. కావునఁ దా మెట్టి యలజడి చెందవలదు.

వీ :- చిక్కదేవరాయలు రాజ్యపాలనానుభవము లేనివాఁడు.

యాచేం :- మంత్రిపుంగవు లున్నారు, పెద్దలు జగ్గరాజుగా రున్నారు. మీ కోర్కె నెఱవేఱకపోవుటెట్లు ?

వీ :- అందఱు నున్నారు. లేకేమి ? యాచేంద్రా ! ఆది నుండి రాజ్యాభివృద్ధి భారమంతయు మీ చేతులమీఁదనే కదా నడచినది !

యాచేం :- మహారాజా ! మహారాజా తాము నిశ్చింతగా నుండుఁడు. నా బొందిలోఁ బ్రాణము ఉండఁగా చిక్కదేవ రాయలపై నీఁగ వ్రాలనీయను. నా ముక్కులో నూపిరి యున్నంతవఱకు నీ కర్ణాట సామ్రాజ్యము నన్యాక్రాంతము కానీయను.

వీ :- అట్టి సామర్థ్యము గలవాఁడవనియే కదా యాచేంద్రా ! నీ సమక్షమున చిక్కదేవరాయలను రాజుగాఁ జేసినది. వీనికి లోకానుభవము తక్కువ. పరిపాలనలో నొడిదుడుకులు కలుగకుండ మీరు.........

యాచేం :- మహాప్రభూ ! తాము దీని కింతగాఁ జెప్పవలయునా ! అవసరమునుబట్టి నే నిచ్చట నొక యేఁడాది

పాటుండి యున్నియుఁ జక్కఁబెట్టుకొను చుందును. మధ్య మధ్య వేంకటగిరికిఁ బోయివచ్చు చుందును. నే వనస్థల ములలో నున్నపుడు నా మంత్రి యిచ్చట నుండఁగలఁడు. నా సేనాధ్యక్షులలో నొకనిని వీరనారాయణునకు సహాయ కునిగా నుంచెదను.

వీర :- మంచిది యాచేంద్రా ! మఱచిపోవలదు.

అని మహారాజు రామనామస్మరణ నిమగ్నుఁడయ్యెను.

అది విని జగ్గరాజు మరమర చూచెను. ఓబలరాయలు పొగలు చిమ్మెను. మంత్రి వెన్నమరాజు, సేనాధ్యక్షుఁడు వీర నారాయణుఁడు నొకరి మొగ మొకరు చూచుకొనిరి. తలుపు చాటుననుండి యిది యంతయుఁ జిన్నరాణి వెంకటమ్మ చూచు చునే యున్నది. ఆమె కనుఁగొలఁకులనుండి రెండు వేఁడినీటి కణము లగ్నికణములవలె రాలినవి. ఉంకించినది; తల వంకించి నది. ఇఁకఁ దన జన్మము వ్యర్థమని తలంచినది. తాను బ్రతికినను జచ్చినను నొక్కటియె యని యెంచినది.

ఇది జరిగిన యనతికాలమునకె మహారాజు బ్రతుకుఁ జరమదశకు వచ్చినది. మాటలేదు. చూపులేదు. మందు లోపలికిఁ బోవుటలేదు. వెంకటమ్మ వెంటనే తండ్రిని, మంత్రిని, సేనాపతిని రావించినది. వారి నుద్దేశించి యిట్లనినది.

'అయ్యలారా ! మీ రందఱు నెఱిఁగినదేకదా ! మహా రాజు నాయెడ నాచరించిన యపచారము, అన్యాయము ! నా కింతకన్న నేమి యవమానముగలదు ? అయినదేదో యైనది.

బ్రతికియుండి ప్రజాపవాదమును భరింపఁజాలను. అన్నిటికి మీరే గలరు. నాయనంతరమందైన నా సంకల్పము నెఱవేర్పుఁడు. ఎట్లయినఁ దిరుమలరాయుని మహారాజును జేసి గద్దె నెక్కింపుఁడు. ఇవిగో తీసికొనుఁడు.' అని రత్నహారములను దీసి మంత్రికిఁ జమూపతికి నొసంగెను. వారు కాదనక యందుకొనిరి. జగ్గరాజు విషాదానందముల నొందెను. మఱొక క్షణమునకు మహారాజు భౌతికదేహమును జాలించెను. వెంటనే దుర్గాలయము తలుపులు తటాలునఁ దెఱువఁబడెను. ఒక దివ్యతేజస్సు ఆ త్రిలోకమాతయొక్క విగ్రహములో లీనమయ్యెను. కోటయంతయుఁ గటికచీఁకటిలో మునిగిపోయెను. జెండా దించఁబడెను. పట్టణమంతయుఁ బాడుపడినట్లయ్యెను.

మహారాజు మరణించిన మఱుక్షణమునందె చిక్కదేవరాయలు పట్టాభిషిక్తుఁడై సింహాపీఠిక నధిష్ఠించెను. విషాదగీతికలలో ఆనందగీతికలు మేళవించినవి. ఎల్లవారి మనంబుల ధైర్యజ్యోతులు వెలిఁగినవి. మహారాజు భౌతికదేహము కోట నానియున్న ప్రత్యేక శ్మశానవాటికలోఁ జందన కాష్ఠముపైఁ జేర్పఁబడెను. చిక్కదేవరాయలు చితికి నగ్ని ముట్టించెను. అగ్నిభట్టారకుఁడు భగభగ వెలుగుచుండెను. వెంకటమ్మ పసుపుబొమ్మయై వచ్చి హరహరమహాదేవ శంభో! యని యఱచి యా చితిపై కుఱికెను. దుందుభులు మొరసెను. పౌరులు పూలు సల్లిరి. జగ్గరాజేడు పుగ్గపట్టెను. తిరుమలదేవరాయలు ధైర్యము కోలుపోయెను. పదిరోజులు కడచినవి.

మహారాజు శ్రాద్ధక్రియలు యథావిధిగా జరుపఁబడెను. షోడశ మహాదానములు చేయఁబడెను. అంత్యేష్టి ముగిసెను.

వీర వేంకటదేవరాయల కాలమునందువలెనె రాచ కార్యము లన్నియుఁ గట్టుదిట్టముగా నడుచుచుండెను. తిరుమల దేవరాయలకుఁ గొంటిరీతిగనె రాచ మరియాదలు జరుపఁబడు చుండెను. భార్యతో సతఁడు రాచనగరులోనే నివసించు చుండెను. యాచేంద్రుఁడు చంద్రగిరియందే యుండి యరిభీక రుఁడై చిక్కదేవరాయల కన్ని కార్యములందును సాయము చేయుచుండెను. ప్రజలు రాజునెడ భక్తియుక్తులై మెలఁగు చుండిరి.

ఇట్లొక యేఁడాది గడచిపోయినది. ఈ యేఁడాదిలోను యాచేంద్రుఁడు నడుమ నడుమ వేంకటగిరికేఁగి వచ్చుచుండెను. యాచేంద్రుఁడు చంద్రగిరిలో లేని సమయముచూచి చిక్కదేవ రాయలు సమయము చిక్కినప్పుడెల్ల తిరుమలరాయాదులను అవమాన పఱచుచుండెను. ఆ సంగతి యెప్పటికప్పుడు రాయప్ప యాచేంద్రున కెఱిఁగించుచు వచ్చెను. అది వినినప్పుడెల్ల యాచేంద్రుఁడు, చిక్కదేవరాయుని పుత్రప్రేమతోఁ, జాటున మాటునఁ జనవున, బలిమిని, నయమున, భయమున మందలించు చుండెను. తిరుమలరాయనితో, 'చిక్కదేవరాయల మాటలు పాటింపకుఁడు, అన్నిటికి నేనున్నాను. మీ మర్యాదలకు లోటు రానీను'నని సద్దుబాటు మాటలాడుచుండెను.

ఇంతలో నుత్తరమున బొబ్బిలిప్రాంతమున నున్న దొరలు ఓడరాజుల సాహాయ్యమునఁ దిరుగుబాటొనర్చినట్లు వార్త

యేతెంచినది. తన కుమారుని క్షేమమునకు భంగము వాటిల్ల నున్నట్లు వార్త రాఁగానే యాచేంద్రుఁడు చిక్కదేవరాయల యాజ్ఞఁ గైకొని కొంత యాశ్వికసేనను దనవెంటఁ దీసికొని చంద్రగిరిలోఁ దన మంత్రి నట్టిపెట్టెను. ఎప్పటికప్పుడు వార్త లంపుమని యశ్వారూఢుఁడై బెబ్బులివలె బొబ్బిలికిఁ జనెను. చిక్కదేవరాయలు రాజనీతికుశలుఁడా కాఁడు. పరాక్రమమా పూజ్యము. సాహసమా సున్న. ఔదార్యమా హుళక్కి. ఆలోచనయా తక్కువ. నిక్కు యెక్కువ. తలతిక్కయా యధికము. రాజ్యమా తలవని తలంపుగాఁ గొత్తగా వచ్చి నెత్తిపైఁబడినది. ఇట్టుగా దిట్టని దిద్దు పెద్దలా యొద్దలేరు. 'అసలే కోతి. కల్లుత్రావినది, తేలుకుట్టినది, దయ్యము పట్టినది' యన్న ట్లున్నది యాతని సంగతి. తప్పొప్పులు సవరించి మందలించు యాచేంద్రుఁడు చెంతలేకుండుటచే నాతఁడు ఆడిన దాటఁగాఁ బాడినది పాటగా వ్యవహారము సాగింపసాగినాఁడు. సందుదొరికి నదికదాయని 'యిచ్చకాల బుచ్చన్న' లందఱు ఉన్నవి లేనివి కల్పించి నిరపరాధులమీఁదఁగూడ నేరములు మోపి రాజున కెఱిఁగింపసాగిరి. 'దున్నపోతీనిన దన దూడను గట్టివేయు'మని నట్లాతఁడు సత్యాసత్యములు విచారింపక తనకు విరోధులని తలఁచినవారి నందఱిని రాచి రంపానఁ బెట్టసాగెను.

చంద్రగిరి దుర్గాధ్యక్షుఁడును, తిరుమలరాయని మామయు నగు ఓబలరాయుని నా పదవినుండి తొలఁగించి యానెగొందెలో నున్న తన బావమఱఁదిని రావించి యా పదవి నాతని కంటఁ గట్టెను. దానితోఁ గోటలో ముసలము పుట్టెను. మంత్రి పెమ్మసాని తిమ్మరాజు, సేనాధ్యక్షుఁడు వీరనారాయణుఁడు

తనకు శత్రుకోటిలోనివారని తలఁచి వారిని రావించి, గూర్చుండుఁ డనినయెడఁ బలుకక యలుకదీపింప 'ఏమండీ! మహారాజావారి యవసానకాలమున వెంకటమ్మగారు మీ కుమారునిని దిరుమల దేవరాయని రాజుగాఁ జేయవలెసినదిగా సర్థించి, చేతియొక్క రత్నహారము లంచముగా నిచ్చినదటగా! పాపము! ఆమె వాంఛించిన తిరుమలదేవరాయలగారిని కోటనుండి పంపించివేసి నాము. మీ సాయమందకమునుపే వారు నిష్క్రమించినారు.

మంత్రి :
సేనా : } హారము లిచ్చినమాట వాస్తవమే కాని తిరుమల రాయని ప్రభువుగాఁ జేయుఁడని లంచమిచ్చుట మాత్రము అసత్యము మహాప్రభూ! తమ కానందము కలిగినప్పుడు రాజులు హారాదికము లిచ్చుట మేము పుచ్చుకొనుట యాచారము. అట్లే వారిచ్చినారు, మేము పుచ్చుకొన్నాము. ఇన్నాళ్ళు వీరవెంకటపతిదేవరాయలవారి యుప్పుపులుసు తిని త్రావి బ్రతికిన మేము వారిచే నియుక్తలయిన యేలినవారిని కాదని తిరుమలదేవరాయలవారిని జంద్రగిరి దుర్గమునకు రాజుఁజేయుటకు మా కెన్ని గుండెలుండును మహాప్రభూ! మేమనఁగా నెంతవారము. శివ శివా! యెంతమాట వినవలసివచ్చినది. మమ్ము రాజద్రోహులుగాఁ గట్టినారా!

చిక్క :- ఔను.

మంత్రి, సేనా :- అయితే తమ చిత్తము.

చిక్క :- చిత్తము గిత్తము తరువాతఁ జూతము. మీ యొద్ద నున్న యీ హారములను దీసి యిక్కడఁ బెట్టుఁడు.

మంత్రియు, సేనానాయకుఁడును దమ తమ మెడలలో నున్న హారములను దీసి యచ్చట నుంచిరి. చిక్క దేవరాయలు ఖిలేదారగు రాయప్పవంకఁ జూచెను. రాయప్ప యది గ్రహించి వెంటనే యా హారములను 'రత్న భాండారము'నఁ బెట్టి తాళము వేసి ముద్రిపెట్టెను. రాజు రాయప్పను బిల్చి రాయప్పగారూ! ఏమిటి నగరములోని వింతలు విశేషములు?

రాయ :- చిత్రము చిత్రము— ఏమున్న వండి. ప్రభువువారి పరిపాలనము...

చిక్క :- ఊఁ— పరిపాలనము—ఏమిటి నీళ్ళు నములుచున్నావు?

రాయ :- ఏమీ లేదండి.

చిక్క :- నే నడిగినది మన పరిపాలనమును గూర్చి కాదు. తిరుమల దేవరాయలవారినిగూర్చి ప్రజ లేమనుకొనుచున్నారని.

రాయ :- చిత్రము చిత్రము— అనుకొనుట కేమున్నది?

చిక్క :- ఏమియు లేదా! అహహ! ఎంత గడుసువాడండీ— రాయప్పగారూ 'తిరుమల దేవరాయల దొరగారు వారు వీర వేంకటపతిరాయలవారి యౌరసపుత్రుఁడు కాఁడు. వెంకటమ్మగారి మానసపుత్రుఁడు. కర్ణాటాంధ్ర సామ్రాజ్యము నాఁచికొనుటకై జగ్గరాజాదులు సలిపిన, పన్నిన కుట్రల ఫలరత్న మా మహానుభావుఁడు. ఎందఱెన్ని 'పన్నాగములు' పన్నిననేమి? మహారాజుగారు నిజము కనిపెట్టినాఁడు. మమ్ములనే తుదకు సామ్రాజ్యాభిషిక్తులఁ జేసినారు. మోసము డాఁగునా, బండారము బైటఁబడినది' అని యూరివాఁడ

జెప్పుకొనుచున్నారటగా ఆబాలగోపాలము, మీరు విననే లేదా రాయప్పగారూ !

రాయ :- చిత్తము, చిత్తము, అలాగునా మహారాజా ?

అని జాఱుచు జాఱుచునున్న కళ్ళజోడులోనుండి చూపులిటునటు ప్రసరింపఁజేసి నిలుపుటంగి ప్రక్కజేబులోనున్న జేబురుమాలు తీసికొని ప్రక్కకుఁదిరిగి యొక్కసారి మోడుముముక్కు తుడుచుకొని మరలఁ జిత్తము చిత్తము అన్నాడు. మంత్రి దండనాథులు తిరస్కారభావ సూచకదృష్టులు పరపినారు.

చిక్క :- తిరుమలదేవరాయలవారున్నారే సాక్షాత్తు భూవర ప్రవరులండోయి ! విన్నారుకదా !

రాయ :- చిత్తము చిత్తము.

చిక్క :- చూడలేదటండీ, వారి నడకతీరు, ముఖవర్చస్సు, పాపము ఎంత రాచకళ యుట్టిపడుచున్నదో ! ఓహో నున్నగానున్న యీ మూతిని జూచినఁ జాలదా వారి రాచ తీవిని బరికించుటకు?

రాయ :- చిత్తము, చిత్తము-అన్ని యేలినవారికి అవగతములే.

చిక్క :- సరేకాని రాయప్పగారూ ! ఆ యంటుమామిడి మొక్కగారిని తిరుమలదేవరాయలవారిని రాచనగరు వీడి దూరముగా వారి యిచ్చవచ్చిన చోటునకు దయచేయుమని చెప్పినాము - ఏమందురు మంత్రిగారూ ! మీ రేమందురు దండనాథుఁడుగారూ !

మంత్రి, సేనా :- 'ఇచ్ఛామాత్రం ప్రభోస్సృష్టిః' అన్నారు గదా! మహాప్రభూ! తమరెట్లు తలంచిన యట్లు గావింపుఁడు.

రాయ :- చిత్తము సర్కారువారూ! ఒక్కమనవి :- తామీ రీతిని ఆజ్ఞాపింపఁగలరని నిన్ననే తిరుమలదేవరాయలకుఁ దెలిసినది. మూట ముల్లె కట్టి కందనోలునకుఁ (కర్నూలు) బ్రయాణమాయెను. నేను వలదని మందలించినాను. నా మీఁదఁ బెద్దతికముంచి యాతఁడు తన ప్రయాణము మాని వేసినాఁడు.

చిక్క :- ఓహో! ఇదియా సంగతి. పాపము, వా రింకను మనల నుద్ధరింపవలసి యున్నది కాఁబోలు రాయప్పగారూ!

రాయ :- చిత్తము, తాము కొంచెము దూరముగా యోజింపుఁడు. నేను 'పెద్దముండావాఁడను' ఎందులకు మనవిచేసి కొన్నానో నిదానింపుఁడు. నా వయస్సెంతయో చిత్త గించినారా! తొంబది యెనిమిదేండ్లు. నేను విజయనగర ములోఁ బుట్టి పెరిఁగినాను. ఆ మహానగర వైభవమం తయుఁ గనులారఁ గాంచినాను. అచటనుండి శ్రీరంగ రాయలవారితోఁ బెనుఁగొండకు వచ్చినాను. వారి పెట్టు పోతలలోఁ బెరిఁగినాను. చెప్పుచేతలలో మెలఁగినాను. శ్రీరంగరాయలవారె నన్నుఁ దమతో నీ చంద్రగిరికి దోడ్కొని వచ్చినారు. వారి యనంతరము శ్రీ వేంకటపతి దేవరాయలవారు నన్నాదరించినారు. 'తదారభ్య' మొన్న మొన్నటివఱకు నేను వారి ప్రసాదము స్వీకరించి వారి వస్త్రముకట్టి, కష్టమనక, సుఖమనక, రాత్రియనక, పగలనక,

దూరమనక, భారమనక, ఎండయనక, వానయనక కోటలోని వ్యవహారమంతయు నెత్తిని వేసికొని మోసినాను. ఇప్పుడు తమయొద్దఁగూడ మోయుచున్నాను. నే నన్నదెన్నఁడు శ్రీరంగరాయలవారుగాని, శ్రీ వీరవేంకటపతి దేవరాయలవారుగాని కాదని త్రోసివేయలేదు. మీరుకూడ నాయందు దయయుంచి నా మాట నిందుక మన్నింపుఁడు.

చిక్క :- అయితే, మీ యిష్టమువచ్చినట్లు చేయుఁడు. వాఁడు మాత్రము కోటలో నా యెదుట నుండఁదగఁడు.

రాయ :- చిత్తము. అందులకనే నిన్ననే వారిని గోట యావలనున్న మాకంద వనములోని (మామిడితోఁట) సౌధములోఁ బ్రవేశపెట్టినాను. చిత్తము.

చిక్క :- అట్లా! మా యభిప్రాయము మీకు ముందుగానే తెలిసినది కాఁబోలు, ఎంత భావిభావజ్ఞులు మీరు.

రాయ :- చిత్తము - అది యంతయు సన్నిధాన ప్రభావమే కదా!

చిక్క :- అన్నట్లు మఱచినాను రాయప్పగారూ! మనము పనినుండి తొలఁగించిన ఓబలరాయాదులు మన పట్టణమందే యున్నారా? ఎందేనిఁ జనినారా?

రాయ :- చిత్తము చంద్రగిరిలోనే యున్నారు.

చిక్క :- సరే, కానిండు. వారి నొక కంటితోఁ, గనిపెట్టి యుండుఁడు.

రాయ :- చిత్తము. సెలవు దయచేయుఁడు.

చిక్క :- సరే 'వెళ్ళి' రండు. మంత్రిగారూ ! వీరనారాయణుడు గారికి కూడ సేనానాయకత్వమునుండి......

మంత్రియు దండనాథుడును చిత్తమని సెలవుతీసికొని వెడలిరి.

చిక్కదేవరాయలు విరోధులన్న వారిని బాధింపగలడు కాని నిర్మూలింపగల యుపాయముగాని, చాకచక్యముగాని యెఱుంగడు. కావుననే యింటను బయటను గ్రోధాగ్నులు రాజుచున్నవి.

# రాజ బంధనము

చిక్క దేవరాయలు దూరాలోచనలేక దురాలోచనా పరుఁడై యోబలరాయాదులను బదభ్రష్టులను జేసెను. కాని యేమిలాభము? వారినిఁ జంద్రగిరినుండి మఱియొక గ్రామమునకు వెడలఁగొట్టలేదు సరిగదా! వారు బయట నేమి కుట్రలు పన్నుచున్నారో కూడాఁ గనుగొనుటలేదు.

ఓబలరాజు చిక్క దేవరాయలపైఁ గావలసినంతదుష్ప్రచారము చేయసాగినాఁడు. రాజుచే నవమానితుఁడైన సేనాధ్యక్షుఁడు వీరనారాయణుఁడు, పగఘూని, వగమాని, వెఱివీడి, బహిరంగముగా శత్రుపక్షమునఁ జేరెను. చిక్క దేవరాయల నెట్లైనఁ బదభ్రష్టునిఁజేసి తిరుమలరాయని సింహాసన మెక్కింప దృఢనిశ్చయుఁడయ్యెను. జగ్గరాయలకుఁ జంద్రగిరికి రావలసినదిగా వర్తమానము నంపెను. గొబ్బూరి జగ్గరాజు గొబ్బున వచ్చి చంద్రగిరిలో వాలెను.

జగ్గరాజు, ఓబలరాయఁడు, వీరనారాయణుఁడు పెమ్మసాని తిమ్మరాజు నలుగురు గూడి మంతనముచేసిరి; చెవులు కొఱికికొనిరి. అది చూచిన ప్రజలు 'ఈ దుష్ట చతుష్టయము గూడినద'ని గుజగుజలు పోయిరి. జగ్గరాజుసామ్ముతినినవారు 'జగ్గరాజు మహారాజునకుఁ గానుక లర్పించుటకై వచ్చినాఁడ'ని మాత్రము బైటఁ బొక్కించినారు. తెలియనివా రౌనుగాఁ బోలు ననుకొనిరి. కాని విజ్ఞులు 'ఏదోకొంప ముంచుఁగు'నను కొనిరి. జగ్గరాజో కనాఁడు రాయప్పద్వారమునఁ జిక్క దేవరాయలకుఁ దాను దన కుమారునిచే క్షమార్పణము చెప్పించుటకు

వచ్చినాననియు దర్శన మిప్పింపవలసినదనియు వర్తమాన మంపి నాఁడు. రాజు కాఁబోలునని యట్లె రమ్మనినాఁడు. జగ్గ రాజు రాజును దర్శించి 'మహారాజా! ఓబలరాయఁడు వాఁడు తెలివితక్కువగా వ్యవహరించినాఁడు. నేఁడు పశ్చాత్తాపపడు చున్నాఁడు. నేనుగూడ దర్బారునుండి కోపముతో వెడలిపోతిని. అయిన దేదో యైనది. మనమందఱము స్వర్గీయ మహారాజా వారి యాజ్ఞ పాలింపవలసినవారమె. కావున నిచ్చటి మా యునికికి మీ రియ్యకొనవలయును. ఈ పెద్దవయసులో మను మని మనుమరాలిని విడిచి యుండ లేను. మావాఁడు కూఁతును, అల్లుని వీడ లేఁడు. కాన అనుమతింపుఁడు.' అని కోరెను. జగ్గరాజు కోటలోనే బసచేసెను. దూరదృష్టి లేక చిక్కరాయ లంగీకరించెను. ఖిలేదారు రాయప్పకీ నలుగురి సమాలోచ నము లింతగా నున్నవని దెలియరాదయ్యెను. అతఁ డింటియొద్ద వంచిన తల కోటయొద్ద నెత్తుట, కోటలోనికిఁ జనుట, యచ్చట వలసినపనులు యథావిధిగా జరిపించుట, మరల నింటికి వచ్చుట, రామ! కృష్ణ! యనుకొనుట, మనుమలతో నాడుకొనుట, యతిథి అభ్యాగతుల కింతపెట్టుట. తప్ప నన్యమేమియు జోక్యము కలి గించుకొనఁడు. అందుచేతనే యతఁడనిన రాజోద్యోగులకుఁ బ్రజలకు నపారమైన భక్తి, గౌరవము. అతనినిగూర్చి చాటునఁ గాని, మాటునఁగాని యెవరు చెడుగాఁ జెప్పుకొనరు.

పత్రికలో బల్లెమైయున్న జగ్గరాజునిగాని, యోబల రాయనిగాని నక్కవినయములు చూపుచున్న మంత్రినిగాని సేనానాయకునిగాని చిక్కరాయలు ఉక్కివులని (కపటులు) కని పెట్టలేదు సరికదా పైపెచ్చు వా రందఱు తన పేరుచెప్పిన

మాత్రమున గడగడ లాడిపోవుదురని తలంచెను. రాబోవు ననర్థములకుఁ బ్రతీకారము చేయఁగలిగినంత ధీశక్తిగాని, యాలోచనగాని, మెలఁకువగాని, యుపాయముగాని, యతనికి లేదు. చంద్రగిరి దుర్గాధ్యక్షుఁడుగా, నియమితుఁడైన యాతని బావమఱఁది కోటకుఁ గొత్తవాఁడు. ఏ పుట్టలో నే పా మున్నదో యాతనికిఁ దెలియదు. గ్రుడ్డియెద్దు చేలోఁ బడినట్లు తన పని తాను జేసికొని పోవుచున్నాఁడు.

జగ్గరాజాది చతుష్టయ మున్నట్లుండి యొక్కనాఁటి రేయి తా మనుకొనిన విధముగాఁ గోట ముట్టడించి యంతః పురములోని చిక్కరాజును సకుటుంబముగా బంధించిరి.

రాయప్ప యిల్లు కోట కీశాన్యదిక్కునందున్నది. కోట లోని ప్రాసాద శిఖరము లాతనియింటి యరుగుమీఁదఁ గూర్చుండినఁ గానవచ్చుచుండును.

నాఁడు ఏకాదశి, వేంకటేశ్వరస్వామివారి పటము నెదురుగాఁ బెట్టుకొని రాయప్పయు నతని కుటుంబమును ఇరుగు పొరుగువారును భజన చేసికొనుచుండిరి. భక్త్యావేశములో మైమఱచి

'త్వమేవ (నీవే) మాతాచ పితాత్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ !
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవ దేవ !
త్వమేవ సర్వంమమ దీనబంధో !

అని ధ్యానము చేయుచుండిరి.

అంతలో నొక రాజభటుఁడు రొఁజుకొనుచుఁ బరువెత్తు కొనివచ్చి 'బాబూ రాయప్పగారూ! రాయప్పగారూ! ఖిలే దారుబాబూ! రండు రండు, కొంప లంటుకొన్నవి. జగ్గరాజు గారు ససైన్యులై వచ్చి దుర్గము ముట్టడించినారు. చిక్కదేవ రాయ మహారాజులుంగారిని బంధించి తీసికొనిపోవుటకు సిద్ధముగా నున్నారు. రండు, రండు, త్వరగా రండు, అని బిగ్గరగా నఱచెను. ఆ కేకలు విని రాయప్ప యులికిపడి లేచెను. కట్టుకొనిన పట్టుపుట్టము విప్పి త్వరత్వరగాఁ దన మామూలు దుస్తులను ధరించి సరాసరి మంత్రియింటికరిగి వానిని దీసికొని రాజప్రాసాదము దగ్గరకుఁ బోవుచుండెను. మంత్రి తన కేమీ తెలియనట్లు రాయప్పతో బయలుదేఱెను. దేవిడీయొద్ద సైనికులుఁ బ్రిజలు గుమిగూడి యుండిరి. రాయప్ప లోపలి కరుగుచుండఁగా సైనికు 'లటకా' యించిరి. రాయప్ప గుడ్లుఱిమి చూచెను. సైనికులు 'అడుగు కదలనీఁడు'మనిరి. వెనుకనున్న మంత్రి పెమ్మసాని తిమ్మరాజు ముందునకువచ్చి 'పోనీయుఁడు, దారినిండు' అని యదలించెను. సైనికు లదరి బెదరి దారి యిచ్చిరి.

రాజప్రాసాదము చుట్టు మూఁగిన మూఁకలు 'పట్టుఁడు, కట్టుఁడు' అని కేకలువేయుచుండిరి. ఆ యఱపులు విని పరుపులపైనున్న చిక్కదేవరాయలు, నాతని పెద్దకుమారుఁడు వేంకటాద్రిరాయఁడు, రెండవ కుమారుఁడు శ్రీరంగరాయలు నులికిపడి లేచి యంతఃపుర ద్వారముచెంతఁ జింతాక్రాంతులై నిలిచి యుండిరి. వారపుడు దిగ్బంధనములో నున్నారు.

అంతఃపురములోపల నాక్రందనధ్వనులు మిన్నుముట్టఁ జొచ్చెను. ఏమూలఁజూచినా నాలగోఁడు బాలగోఁడుగా నున్నది.

రాయప్ప కనుమూసి తెఱచునంతలో రాజునొద్ద వ్రాలెను. రాయప్పను జూచుటతోడనే రాజు కన్నులు రాజును (చంద్రుని) గాంచిన కలువలవలె విప్పారెను. అతని గుండె కొండొక ధైర్యము వహించి, మూఁడు తరములనుండి రాజకుటుంబమును గనిపెట్టుకొనియుండి వారి కూడుతిని బీర చుట్టియున్న రాయప్పకు రాజఋణము దీర్చుకొనుటకు నింత కంటె నదనేది? శాంతమూర్తియగు నాతఁడు రాజుపై దౌర్జన్యము జరుగుట కెన్నఁడు నంగీకరింపఁడు. తన ప్రాణము పోకడకైన నంగీకరించునుగాని రాజకుటుంబ మవమానము చెందుట కంగీకరింపడు.

జగ్గరాజు మహారాజును రహస్యముగాఁ గొనిపోయి బంధింప సమకట్టియుండెను.

రాయప్పతోపాటు పౌరులనేకులు కోటలోపలికిఁ జొచ్చుకొనివచ్చిరి. వారినిఁ జూచుటతోడనే జగ్గరాయలకుఁ బచ్చి వెలఁగకాయ గొంతున కడ్డుపడినట్లాయెను. ఏమి చేయుటకుఁ దోఁచలేదు. ప్రజలు తనపైఁబడి చంపుదురేమో యని జంకెను. కొంకెను. రాయప్పనుజూచి ధైర్యము తెచ్చుకొనెను. రాయప్పయనినఁ బ్రజల కఖండ గౌరవమున్నదని యాతఁడెఱుంగును. తిరుమలరాయఁడు చంద్రగిరిలో నింతవనుక నుండుటకు రాయప్ప సాయమె కారణమనుమాట యాతఁడు మఱచలేదు. రాయప్ప యేపక్షమును వహించినవాఁడుకాఁడు.

ఆతనికి రాచనగరులో నలుజడి లేకుండనుండుటయె కావలసిన విషయము.

జగ్గరాజు రాయప్పనుజూచి రాయప్పగారూ ! ఈ గడియనుండి చంద్రగిరికిఁ దిరుమలదేవరాయలె మహారాజు. చిక్కదేవరాయలుకాఁడు. చిక్కదేవరాయలను వాని భార్యను, కొడుకులను గోడలిని అడుగు దాఁటకుండఁ నంతఃపురములోనే బంధించినాము. అనఁగానె రాయప్ప, "జగ్గరాజుగారూ ! చాల అనాలోచితకార్యము నొనర్చినారు. మహారాజును బంధించిన బంధించిరి, కాని యన్నెము పున్నెము నెఱుఁగని 'రాణివాసపు' స్త్రీలను బంధించుట మగపాడిగాదు. రాచరికముగాదు. రాయప్ప యిచ్చట నున్నంతకాలము మీరాపని చేయవలదు. రాణివాసము ఖైదుచేయుటకు నెన్నఁడు నంగీకరింపను. ఆటు నూతైనను, నూటఁతైనను వారినిఁ గాపాడితీరెదను" అనెను.

పౌరులలో రాయప్ప కెంత పలుకుబడి యున్నదో జగ్గరా జెఱుఁగనివాఁడుకాఁడు. మంత్రికిగూఁడ నా సంగతి తెలియును. అప్పుడు రాయప్పమాటను గాదని త్రోసివేసినచోఁ 'బ్రజావిప్లవము' వచ్చునని భయపడిరి. కాని తమ నిశ్చితాభిప్రాయమును మంత్రి తిమ్మరాజు వాని కిట్లుఱింగించెను.

'రాయప్పగారూ, సరే మంచిది కాని, తిరుమలదేవరాయలను మహారాజును జేయుటకు నేను, జగ్గరాజుగారు దళవాయి వీరనారాయణుఁడు, నిశ్చయించుకొన్నాము. ఓబలరాయఁడు మాకు బాసటయ్యె యిచ్చటనే యున్నాఁడు. మా యీ కార్యములకు మీ రాటంకము గలుగఁజేయఁబూనకుఁడు.

పూనికతోరా మీా మరియాదకూడఁ బోవును.' అని హెచ్చరించెను. వారి పూనిక నీవఱకే కొంచెము వినియున్న వాఁడగుట రాయప్ప యప్పటికిఁ దా నూరకొనుటయె యుత్తమకార్యమని తలంచెను. పాపమాతనికిఁ జిక్కదేవరాయల తుదియాజ్ఞను మీఱవలయునని లేదు. కాని యేమిలాభము! జగ్గరాజాదులఁ గాదని వారి ధాటికిఁ గాఁగలేఁడు. కావున దిరుమలరాయని రాజుగా నంగీకరించెదరని వారితోఁ జెప్పెను. చెప్పి యొక్క విషయము వారికిఁ దెలియజేసెను. 'ఈరాత్రికి మహారాజును సకుటుంబముగా నందే బంధించియుంచుదము. తెల్లవాఱఁగనే 'మహారాణిని' పెద్దకోటలిని ఆనెగొందెకుఁ బంపివేయుదము. చిక్కదేవరాయలవారిని, వారి యిరువురు కుమారులను బంధించి కోటలో నెందే నొకచోటునం దుంచవచ్చును' అని. అదివిని మంత్రి యది యుచితమైనపనియని అంగీకరించెను.

తాను, జగ్గరాజు, రాయప్ప కతిపయ (కొంతమంది) సైనికులు బయటకుఁ బోయినచోఁ దండోపతండములుగా వచ్చి పడుచున్న జనులు తమంత తామె తిరిగి వెడలిపోదురని తలంచి యట్లుగావించెను. జగ్గరాజాదులు పురాభిముఖులైరి. అదిచూచి ప్రజలుకూడఁ దమదారిని దాము పోయిరి.

ఆవరకే మంత్రి యిచ్చిన యాజ్ఞచే వీరభటులు మహారాజు చిక్కదేవరాయలను సకుటుంబముగా బంధించి కావలా కాయుచుండిరి.

నాఁడు మంత్రి, దండనాథులు తమతో నేకమగుటఁజేసి జగ్గరాజు చేసిన 'బందోబస్తు'చేఁ గోటలోనుండి వెలుపలికి వెలు

పలినుండి కోటలోనికిఁ బోతుటీఁగయైనఁ బోవుటకు శక్యము గాకుండెను.

ప్రజలు వెడలిపోఁగానె జగ్గరాజు, రాయప్పనిగూడఁ గోట దాటకుండఁ జేయసమకట్టెను. అది కనిపెట్టి రాయప్ప 'తా నేరాజకీయపు టెత్తులలోను గుట్రలలోను జొరఁగొనంబో ననియుఁ దన కనులయెదుట రాజకుటుంబమునకు నవమానము జరిగినచో సహింపననియు ఖండితముగ జెప్పెను. అంతేగాక తాను తిరుమలరాయునికి నెట్టి యగౌరవము జరుగకుండా మహా రాజునకుఁ జెప్పి యొప్పించి నడపిన కార్యము సంగతి జగ్గరాజు నకు జ్ఞప్తికిఁదెచ్చెను.

అదివిని జగ్గరాజు 'రండు రాయప్పగారూ ! పోదమ'ని పోవుచు జాగ్రత్తయని రక్షకభటులను హెచ్చరించిరాయప్పతో నగరములోనికి వెడలిపోయెను. సైనికులకుఁగూడ వెడలిపొండని యాజ్ఞయిచ్చెను. వారు శిబిరములకుఁ జనిరి. దారిపొడు గున గుంపులు గుంపులుగానున్న జనులు రాయప్ప వచ్చివేయు టను బరికించి యేమి జరిగినది తెలియక యెవరిండ్లకు వారు చనిరి.

మఱునాఁడు తెల్లవాఱఁగానె పెద్దకోడలిని నామె పిన తండ్రిరామరాయల సాయమిచ్చి పుట్టినింటికిఁ బంపివేసిరి. 'మహారాణి' పుట్టినింటికిఁ వెడలుట కంగీకరింపలేదు. మహా రాజును, 'పుత్త్రిలను విడచి యన్యస్థలమున నేఁగఁజాల' నని తెలిపెను.

అది యట్లుండఁగనే జగ్గరాజాదులు తిరుమలదేవరాయని చంద్రగిరి మహారాజని ప్రకటించి యేనుఁగు నెక్కించి నిక్కుచుఁ బురవీథులలో 'బాణసంచాలు' కాల్చుచు నూరేఁగించిరి. పైకిటుల నూరేగింపుతో గతిలేక నడచిరే కాని యుత్సాహము చూపలేదు. పౌరులలో నొక్కరు నానందించలేదు. పూలు సల్లలేదు, హారతి యెత్తలేదు. ప్రజాహృదయ మట్టుడికిన ట్లుడికిపోవుచుండఁగానే యా మధ్యాహ్నము 'దర్బారుమహాలు' తెఱపించి తిరుమలదేవరాయని పట్టాభిషిక్తునిఁ జేసిరి. వేడుక లన్నియు వాడుకప్రకారము జరిగిపోయినవి.

ఆ యుత్సవముల సందడిలోఁ జిక్కుదేవరాయల సంగతి యెవరికిఁగావలయును? 'ఆలన పాలన' లేక యతఁడు, భార్య (రాణి) యిరువురు కుమారులు రాచనగరులోనే యొక మూల నున్న గదిలో బంధింపఁబడి నీళ్ళు నిప్పులు లేక కుమారిలు చున్నారు. దైవగతి నెవ్వరాఁపఁగలరు?

'అంత కింతాయె నింతకు నెంతయగునో.'

# ప్రతిజ్ఞ

సింహాచలములో వరాహ నరసింహస్వామివారి తిరునాళ్ళు మహావైభవముగా జరుగుచుండెను. వైదికులు జట్టులు జట్టులుగా నూరొక్క ధారలలోను స్నానముచేయుచు నాడుచుఁ బాడుచుఁ గొండ నెక్కుచున్నారు.

బొబ్బిలి ప్రాంతమునఁ జరిగిన యొద్దరాజుల 'పితూరి' నణఁచివేసి యాచేంద్రుఁ డప్పటికి స్వామిదర్శనము చేసికొనుటకై వచ్చియుండెను.

చుట్టునున్న మండపములోఁ దిరుగుచు నందలి స్తంభములపైనున్న శాసనముల నొకదానివెంబడి నొకదానిని దిలకించుచుఁ దిన్నఁగా శ్రీకృష్ణదేవరాయలు చెక్కించిన శాసనము గల స్తంభమునొద్దకు వచ్చెను. దీనిపై రాయ లుత్కళ భూమిపాలుఁడగు వీరరుద్రగజపతిని, కళింగరాజును జయించి శ్రీ నృసింహస్వామి కర్పించిన రత్నములయు, ముత్యాలయు వివరములను దెలుపు శాసనమును గాంచెను. వెంటనే యాతనికి

'అభిరతిఁ (ఆసతో) గృష్ణరాయఁడు నిజాంకములన్
(తన గెలుపు బిరుదులను) లిఖియించి తాళస
న్నిభమున (తాటిచెట్టుతో సమానముగా) పొట్టునూరికడ
నిల్పిన కంబము సింహభూధర

ప్రభు తిరునాళ్ళకుందిరుగు
సురప్రకరంబు కళింగ మేదినీ
విభు నపకీర్తి కజ్జలము (మసి)
వేమఱుఁబెట్టి పఠించు నిచ్చలున్.'

అను మనుచరిత్రములోని యల్లసాని పెద్దన్న పద్యమును,

'నెలకొని కృష్ణరాయ ధరణీవిభుఁడుత్కలభూమిపాలుతోఁ గల నెదిరించి,' యనుపారిజాతాపహరణములోని ముక్కుతిమ్మన పద్యమును, స్మృతిపథంబునకు రాఁగాఁ గొంతవొకపడి నిమీలిత నేత్రుఁడై యాకర్ణాటరాజ్యము నేఁటికెని నిల్చియున్నదికదా! దాని భారవాహకుఁడను నేనేకదా యని యానందబాష్పములు రాల్చి కనులువిప్పి చూచెను.

అంతలో నొక 'బేగిరాపు' వగర్చుచు దీనాననుఁడై యాచేంద్రుని యెదుట నిలిచి నమస్కరించి, నిలువలేక చతికిలఁబడెను. యాచేంద్రుఁడాతనిఁజూచి గుర్తించి గుండె జల్లన నిబ్బరమువహించి నారికేళనీరంబులం దెప్పించి వానికొసంగి యతఁడు సేదదేఱినపిమ్మట విశేషము లేమి? చంద్రగిరిలో అందఱు కుశలమేకదా! మన మహారాజావారు సుఖముగా నున్నారుకదా! మన మంత్రి యేమివార్తనంపెను? జగ్గరాయాదు లేమేని కుట్రలు పన్న లేదుకదా? ఏమీ మాటలాడవేమి? చెప్పు భయములేదు. కానున్నది కాకమానదు. అనఁగా నాతఁడు 'చిత్తము యాచేంద్రప్రభూ! ఏమి చెప్పుదును? తాము కోటవిడిచి యుత్తరదిశకు వచ్చినజాడ తెలిసికొన్నారు జగ్గరాజుగారు వచ్చిపడినారు కందనోలునుండి, మంత్రిగారు, సేనానాయకుఁడుగారు, దుర్గాధిపతిగారు. నలుగురు కలసి

నారు 'గూడుపుఠాని' చేసినారు. ఉన్నట్లుండి యొకనాఁడు మహారాజును సకుటుంబముగా బంధించినారు. తిరుమలదేవ రాయలుగారిని రాజని ప్రకటించినారు. ఊరేగినారు. ఈ సంగతి తమకుఁ దెలిపిరమ్మని తమ మంత్రి రామయ్యగారు నన్నుఁ దఱిమినారు. నాఁడు రాయప్పగారు రక్షింపడినచో రాణి వాసము !......' అని కన్నీళ్ళు కాలువలుకట్ట మఱి మాటాడ లేకపోయినాఁడు.

యాచేంద్రుఁడు వాని నోదార్చి 'భయములేదోయి ఇంతమాత్రమునకే యింత యలజడి చెందెదవేల ? ఇల్లలుక గానే పండుగయినదా జగ్గరాజునకు ? ఊఁ. కానీ ! తరువాత నేమయినది చెప్పు' మనఁగనే యతఁడు 'చిత్తము జగ్గరాజేకళ నున్నాఁడో కాని రాయప్పగారి సలహాప్రకారము మహారాజా వారి పెద్దకోడలిగారిని వారి పినతండ్రిగారగు రామరాయల వారిని సాయమిచ్చి పుట్టినింటికి బంపివేసిరి. మహారాజావారు మహారాణీవారు పుత్రులు కోటలోనే యొకమూల మేడలో ఖైదీలుగా బంధింపఁబడియున్నారు. యాచేంద్రబాబుగారూ ! మీరు లేకపోవుటతోడనే యెంతపని జరిగినదో చిత్తగింపుడు బాబూ !' యని మరల విచారింపఁ దొడఁగెను.

యాచేంద్రుఁడు వాని నోదార్చి తేర్చి వానినిగూడఁ దీసి కొని వరాహనృసింహస్వామి సన్నిధి కేఁగి సాష్టాంగ నమస్కార ములు గావించి లేచి యొరలోనుండి కత్తి పైకిఁదీసి నృసింహ స్వామి చరణకమలములపైనుంచి ఓ యుగ్రనరసింహమూర్తీ ! 'వీరప్రతాప' 'రాజాధిరాజ' 'రాజపరమేశ్వర' 'అష్టదిగ్రాజ

కుల మనోభయంకర' బిరుద విభ్రాజియు సుక్షత్రియుఁడును, నగు మామహారాజు చిక్కదేవరాయలు సకుటుంబముగాఁ జెర సాలలోఁబడి మగ్గుచుండఁగా, సిగ్గులేక జగ్గరాజుచే గద్దెనెక్కిం పఁబడిన రాజపుత్త్రుఁడుగాని, కులగోత్రములేని తెలియని, తిరుమలదేవరాయని నేను నా మహారాజుగా నంగీకరింతునా ? ఎన్నటికి నంగీకరింపను. వీర వేంకటపతి దేవరాయలు తన యవసానదశయందు నా కాదేశించినరీతిగా నాతని వంశమున చిక్కదేవరాయల వంశస్థులనే యాచంద్ర తారార్కముగాఁ జంద్రగిరిదుర్గమును కర్ణాటాంధ్ర సామ్రాజ్యమును ఏలునట్లు చేసెదను. ముమ్మాటికి చేసెదను. వీర వేంకటపతిదేవరాయల చరమాశయసిద్ధి పూర్తిగా నెఱవేఱుదాక నేను మంచమునఁ బరుండను. కంచమున భోజనము చేయను. వేంకటగిరిలోఁ గాలుపెట్టను. ఇదే నా ప్రతిజ్ఞ స్వామీ ఇదే నా ప్రతిజ్ఞ ఇదే నా ప్రతిజ్ఞ యని యాచేంద్రుఁడు శపథముచేసి తనచేతి వ్రేలిని కైజారుతోఁ గోసి యా నెత్తురుతో స్వామికి నైవేద్యమిచ్చి యపర నరసింహమూర్తియై సింహాద్రి దిగెను. ఆలయములోని యర్చకు లా 'భీష్మప్రతిజ్ఞ' నాలించి యాశ్చర్యచకితులైరి.

కొండ దిగఁగానే యాచేంద్రుఁడు 'బేగిరావు' కేదో రహస్యము చెప్పి పంపివేసెను. తాను ససైన్యముగా జగ్గరాజును బుగ్గిచేయు ప్రతిజ్ఞతో బయలుదేరెను. అప్పటికే యతని సేనలు మన్నెదొరలతోఁ జేసిన యుద్ధములలో నలసి సొలసి యున్నవి. శ్రమను బాటింపక యతఁడు పోటరియైచని దండుతో సామర్ల కోటయొద్ద విడిసెను. అచ్చటనుండఁగనే యతనికి, జగ్గరాజు

తనరాక నరికట్టుటకై సేనాసమేతుఁడై పినాకినీ (పెన్న) నది యొద్దఁ గాచియున్నాఁడని వార్త యేతెంచినది. ఆ వార్త వినఁగానె యాచేంద్రునకు నొడలెల్లం దెళ్లు జెట్టులు ప్రాఁకినట్లయినది. మోము జేవురించినది. పెదవు లదరినవి. మేను కంపించినది. ప్రళయభీకరమగు నాతని యాకారమును గాంచి సైనికులు తత్తరపాటు చెందిరి. వారినిఁగాంచి యాచేంద్రుఁడు మీరు నాతో రాలేరు. మన్యపు యుద్ధములో నెన్నఁడెఱుఁగనంత శ్రమచెంది యున్నారు. మీలో నదరుగుండె పిక్క బెదరు లేనివారు మాత్రము నాతో రండ నెను. ఆ మాటల కా పోటరియోధులు 'దొరా ! యెంతమాటాడితిరి. మీ సేనలోఁ గొందరు గుండె బెదరు కొందఱు పిక్క బెదరు గలవారున్నారని మీ తలంపా ! మా శరీరములు కండెతుండెములైనను, మా మొండెములు భండనమునఁ (యుద్ధము) బోరాడి జగ్గరాజును వాని సేనలను నుగ్గునూచము గావించితీరునని తాము నమ్ముఁడు !' అని సింహగర్జనములుచేసి బాహువు లప్పళించు (చఱచి) కొని, తొడలు నఱచుకొనఁగా—యాచేంద్రుఁడు వారి యుత్సాహశక్తికి నానందించి 'యోధాగ్రేసరులారా ! మీ సాహసము, భుజబలము నే నెఱుంగనివి కావు. రణనీతి ననుసరించి యోజించినచో మీలోఁ గొందఱిచ్చట నుండుటయే లెస్స. కావున నాతోఁ గొలఁదిమంది మాత్రమే రండు' అని యొప్పఁజెప్పి కతిపయ సైనిక సమేతుఁడై పినాకినీనది కభిముఖుఁడై చనెను. చిక్కదేవరాయాదులగతి యేమైనది యతనికి మరలఁ దెలియరాలేదు. వారు హతులై యున్నచోఁ దా నేమి చేయవలయునో కూడ నాతనికిఁ దోఁచ

కున్నది. చంద్రగిరికి వేగిరావును బంపియున్నను, మఱికొంత మంది చారులనుగూడ దనమంత్రినిఁ గలిసికొన వివిధమార్గముల గుండ నచటికిఁ బంపెను. తన్నుఁ దిరుపతికిఁ జంద్రగిరికి మధ్య నున్న దట్టమగు నడవిలోఁ గల గొండ కొనయొద్ద గలిసికొనవలసి నదని వారి కాజ్ఞాపించెను.

# ఆలోచన

యాచేంద్రుఁ డడ్డదారులనుబడి పరులకంటఁ బడకుండ తిరుపతి కనతిదూరముననున్న సాంద్రాటవిలోని పర్వతాగ్రమందున్న గృహసమీపమును జేరెను.

యాచేంద్రుఁడంపిన చారుని కొక్కనికిని రాజుజాడ తెలియలేదు. కోటలో నందఱు క్రొత్తవారె. అంతఃపురములోఁ బ్రాఁతవాఁ డొక్కఁడును లేఁడు. తుదకుఁ గంచుకి కూడ నపరిచితుఁడె.

కోటలోపల నొకమూల నొక పూజామందిరము గలదు. సుందరవన పరిశోభితమగు నా మందిరములో వీరవేంకటపతిదేవరాయలు భగవద్ధ్యానము చేసికొనుచుండెడివాఁడు అది యతనికి ధ్యానమందిరమే కాక భజనమందిరముకూడ. తాను తన మిత్రులైన శ్రీ తిరుపతి వేంకటేశ్వరభక్తులు కొందఱును గలిసి యందమందభక్తితో భజనలు చేయుచుండెడివారు.

తిరుపతిలోని యాశ్రమాధిపతియగు 'రాంజీ బ్రహ్మచారియు వీరవేంకటపతిదేవరాయలును ఆ మందిరములో భగవత్కథా ప్రసంగములతోఁ దఱచుగాఁ బ్రొద్దులు పుచ్చుచుండెడివారు. శ్రీ వేంకటేశ్వరస్వామివారు రాంజీ బ్రహ్మచారికిఁ బ్రత్యక్షమైరనియు, రాంజీతో నిష్ఠాగోష్ఠి సలుపుచుండెడివారనియుఁ బ్రతీతి.

రాచనగరులోని యితర మందిరములకును దీనికిని నెట్టి సంబంధము లేదు. రాకపోకలకుఁ దగిన ద్వారములు మూసి వేయఁబడెను.

ఏకాంతవాసముకొఱకే యీ మందిరము నిర్మింపఁబడెను. అది యిన్నాళ్ళకు మరల నుపయోగింపఁబడుచుండెను.

కాఱడవిలోఁ గాచికొనియున్న యీచేంద్రునకు నెంత ప్రియత్నించినను రా జెక్కడనున్నది, బ్రతికియున్నది లేనిది కూడఁ దెలియరాలేదు. తాను జంద్రగిరి కంపియున్న చారులలోఁ గొందఱువచ్చి భజనమందిరములో నెవ్వరో యున్నారని మాత్రము మంత్రి రామయ్య యొఱఁగించెనని చెప్పిరి.

యీచేంద్రుఁడచ్చటనున్నవారు తప్పక రాజకుటుంబము వారే యని నిశ్చయించుకొనెను. తానెట్లైన వారి నచ్చట నుండి తప్పించి వేఱొకచోటునకుఁ జేర్చనిచో వారికి ముప్పు తప్పక వాటిల్లునని తలంచెను. తలంచి, రహస్యముగా సేనలతోఁ జంద్రగిరి పట్టణములోఁ బ్రవేశించి ప్రజల సాయమునఁ దిరుగుబాటు లేవఁదీసి రాజప్రాసాద మాక్రమింతునా? ఆక్రమించినచో నా వార్త జగ్గరాజు చెవినిఁ బడినచో తక్షణమే యతఁడు రాజుతల నఱికింపకుండునా? రాజు పోయినవెనుక నా ప్రయత్నము లెందులకు? చిక్కరాయల నొరులకుఁ జిక్కకుండ రహస్యముగా బయటికిఁ దీసికొనివచ్చుట యొక్కటి తక్క నన్యమేదియుఁ జక్కని యుపాయము లేదు. అట్లు రాజును దీసికొని వచ్చిననాఁడు సామంతరాజులును వారి సేనలుగూడ నాకు సాయపడఁగలరు. అప్పుడు చప్పునఁ జంద్రగిరిని ముట్టడించి జయింపఁ

గలుగుదును. కాని యిది యెట్లు నాకు సాధ్యపడును ?
" రాంజీ బ్రహ్మచారియేకదా చంద్రగిరి రాజ్యస్థాపనమునకుఁ గారణభూతుఁడు. ఆతని నాశ్రయించిన నా పూనిన కార్యము నెఱవేఱితీరును " అని యూహించెను.

వెంటనే యా యడవిదారినిబడి యొరుల కంటఁబడకుండఁ దిరుపతికిఁజని రాంజీ బ్రహ్మచారి యాశ్రమము చొచ్చి యాతనికి సాష్టాంగనమస్కారము గావించెను.

రాంజీ యాచేంద్రుని దీవించి ఫలంబు లొసంగి భుజింపుమనెను.

యాచేంద్రుఁడు మహాప్రసాదమని స్వీకరించెను. పిమ్మట నిరువురకు నీ క్రింది సంభాషణము జరిగెను.

రాంజీ :- యాచేంద్రా ! ఎచ్చటినుండి యీ రాక ! చాలకాల మాయెను నిన్నుఁజూచి.

యా :- గురుదేవా ! ఎచ్చటినుండి యని మనవిచేసికొందును ? సర్వము తా మెఱింగినదేకదా !

రాంజీ :- ఔనౌను. ఏమిటి విశేషము.

యా :- ఏమున్నది దేవా ! చిక్కదేవరాయలను జెఱనుండి విడిపింపవలయును, తా మాశీర్వదింపవలయును.

రాంజీ :- యాచేంద్రా ! మేము రాజకీయములజోలికి రాము.

యా :- కాదు గురుదేవా ! హంపీ విజయనగర నిర్మాణమునకు, విద్యారణ్యులవారెట్లో, చంద్రగిరి నిర్మాణమున మీ రట్లుకాదా ?

రాంజీ :- భగవద్విలాసము.

యా :- అయినచో మీ యాశీర్వచన బలముచే వృద్ధిచెందిన నగరరాజము మీ కనులముందన్యాక్రాంతమగుటకు మీ రంగీకరింతురా ?

రాంజీ :- యాచేంద్రా ! దైవాజ్ఞ మాఱుగా నున్నది. హిందూరాజ్య మంతరించు సూచనలు పొడగట్టుచున్నవి. ఈ ఘోర విపత్తు నరికట్టగల శక్తి సామర్థ్యములు చిక్క దేవరాయలయొద్దఁ బొడకట్టుటలేదు. పైఁగా నాతనికిఁ గాల మాసన్నమైనది. దాని నెవ్వరు తప్పింపఁజాలరు. నీ వీ ప్రయత్నమునుండి విరమింపుము.

యా :- గురుదేవా ! దీనుఁడను. రక్షింపుఁడు. సింహాచలములో నుండఁగా నాకు చిక్కదేవరాయలు బంధింపఁబడె నను వార్త తెలిసెను. నృసింహస్వామియెదుట నేను 'చిక్కదేవరాయని మరల సింహాసన మెక్కింపకుండఁ మంచమునఁ బరుండను, కంచమునఁ దినను, వేంకటగిరి త్రొక్కను' అని రక్తము నైవేద్యమిడి ప్రతిజ్ఞ చేసినాను. నా ప్రతిజ్ఞ యెట్లు వ్యర్థము చేసికొనఁగలను. ఇంతలో మా వెలమ కులము కీర్తి గంగఁ గలియవలసినదేనా ? గురుదేవా ! దయలేదా ! యీ శిష్యునిపైని. కటాక్షింపుడు, దారి చూపుఁడు, నా ప్రతిజ్ఞ నిలుపఁబెట్టుఁడు. వీరవేంకటపతి రాయలు నన్ను నమ్మి ప్రాణములు విడినారు. ఆ మహావీరుని యాత్మకు శాంతి చేకూర్పనిండు. అనుగ్రహింపుడు.

రాంజీ :- యాచేంద్రా ! ఎందులకు వృథాప్రయాస మాకు భగవదాజ్ఞ కాలేదు మీకు సాయము చేయుమని, అంత ర్వాణి పలుకుట లేదు.

యా :- అయిన మా గతి యింతేనా ! గురుదేవా ! ఇంతతోఁ జంద్రగిరి రాజ్య మంతరింపవలసినదేనా ? దయ లేదా ? కనికరముంచరా ?

రాంజీ :- యాచేంద్రా ! యేల యింత దీనత చెందుచున్నావు? పిఱికికండ యెఱుఁగని నీ వింత బేలవైతివేల ? చిక్కరాయుని మాట వదలుకో, ఆతని కుమారుఁడు శ్రీరంగరాయుని చెఱ నుండి తప్పించుము. దాన నీ కార్యము నెఱవేఱును, నీ ప్రతిజ్ఞ ఫలించును.

యా :- అదిమాత్ర మెట్లు సాధ్యపడును దేశికోత్తమా !

రాంజీ :- ఖిలేదారు రాయప్ప నాశ్రయింపుము.

యా :- చిత్తము గురుదేవా !

రాంజీ :- జాగరూకుఁడవై మెలఁగుము. జగ్గరాజాదులకు నీ ప్రయత్నములు తెలియనీయకుము. కడు నిగూఢముగా నెల్లపనులు నిర్వర్తించుకొనుము. పొమ్ము శ్రీ వేంక టేశ్వరస్వామి నిన్ననుగ్రహించును లెమ్ము.

యా :- చిత్తము పూజ్యపాదా ! గురుదేవా ! అనుగ్ర హింపుఁడు సెలవుతీసికొని పోయివత్తును.

రాంజీ :- మంచిది పోయిరమ్ము.

# సమావేశము

యాచేంద్రుఁడు తన యునికిని దెలుపుచు నాత్మీయులను గొందఱిని రహస్యముగా రాయప్పయొద్దకుఁ బంపెను. చిర కాలము రాజసేవ చేసియున్న రాయప్పకు యాచేంద్రుఁ డెందు లకు వర్తమానమంపినది క్షణములో నవగతమయినది. యాచేం ద్రునిఁ గలిసికొనుట కతని కంగీకారముగా లేదు. అతఁడు కాంక్షించునది శాంతి. రాజకీయవిప్లవములు యుద్ధములు ననిన నాతనికిఁ దలనొప్పి.

కృష్ణదేవరాయల యనంతరము సకలను తిమ్మయ్య రామరాజు చేసిన కుట్రలవల్లనే సువిశాలమైన విజయనగర సామ్రాజ్య మంతరించినదని యాతని దృఢతరాభిప్రాయము. ఎవరైననుసరే సుస్థిర ప్రభుత్వము నేర్పఱుపఁగలిగినఁ జాలు. ప్రజ లాందోళనలేక సుఖింతురని యాతని నమ్మకము. కావుననే యాచేంద్రుఁ గలిసికొనుట కాతఁ డియ్యకొనలేదు.

ఇంతలోఁ దిరుపతి వేంకటేశ్వరస్వామివారి యాలయ ములో నొక యసాధారణ సంఘటనము సంభవించెను.

తాళ్ళపాక అన్నమయ్యాయను, మహాభక్తుఁడు, గాయ కుఁడు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి గానకైంకర్యముచేయ నిశ్చయించుకొని ప్రతి సాయంకాలమునందు నర్చకులు స్వామికి రాత్రి సేవచేయు సమయమునందుఁ దాను రచియించిన మధుర కీర్తనములను మృదుల కంఠముతోఁ దన్మయుఁడై గానము చేయు చుండెడివాఁడు.

తాము విష్ణుకైంకర్యముచేయు సమయములో అన్నమయ్య, స్వామివారి యెదుట గానముచేయుట కా యర్చకులు ఒప్పుకొనలేదు. అందుల కన్నమయ్య యర్చకులఁ గాంచి "మహాభక్తులారా! స్వామివారు నాసేవ నంగీకరించెనో లేదో తెలిసికొందు. నా కీర్తనలను రెండింటిని గర్భాలయములో నుంచెదను. అవి తాటియాకులమీఁద వ్రాసినవి కావు. రాగిరేకులపై లిఖించినవి. తాటియాకులైన గాలికి నెగురవచ్చును. స్వామి చరణములపైఁ బడవచ్చును. ఇవిగో ఈ రాగిరేకులపై వ్రాసిన రెండు కీర్తనలు. గర్భాలయములో నీ కీర్తనలుగల రాగిరేకు లొక పళ్ళెరమున నుంచుదము. మీరు మామూలుగఁ దలుపులు మూసివేయుఁడు. రేపుదయమున వచ్చి మన మందఱము పరీక్షించుదము." అనఁగా నర్చకు లందుల కియ్యకొనిరి. కీర్తనలు లిఖించిన రెండు రాగిరేకులు గర్భాలయములో నొక పళ్ళెరమునఁ బెట్టి తలుపులుమూసి యెవరి యిండ్లకు వారేఁగిరి.

ఈవార్త తిరుపతియంతయుఁ బొక్కినది. మఱునాఁటి యుదయమునకు దేవాలయము తెఱచు వేళకు గ్రామములోఁ గల యశేష జనానీకము నా వింతచూచు వేడుకతో శ్రీ స్వామివారి యాలయమునకు వచ్చిరి. ఆవరణము, ఏడుకొండలు ప్రజలచేఁ గ్రిక్కిరిసిపోవుచున్నవి.

అర్చకులు అన్నమయ్యను ముందిడుకొనివచ్చి దేవాలయములోఁ బ్రవేశించి గర్భాలయము తలుపులు తెఱచిరి. ఓహో యేమి యీ వింత! పళ్ళెరములోఁ బెట్టిన యా రాగిరేకులు పళ్ళెరములో లేవు. స్వామి పాదపద్మములపై నున్నవి.

ఇప్పుడవి రాగిరేకులుగావు. బంగారు రేకులు. ఇఁక నేమిచెప్ప వలె? అర్చకు లాశ్చర్యపడి యన్నమయ్యగారి పాదములపైబడి తప్పు క్షమింపుమని వేఁడుకొనిరి.

అన్నమయ్యగారి ప్రభావమును గనులారఁ గాంచి ప్రజ లానందపరవశులై జయ జయ నినాదములుచేసి జేగంట లదే పనిగా మ్రోఁగించిరి.

ఆ వింత చూచినవారందఱు నన్నమయ్యగారి కీర్తన లన్నియు రాగిరేకులమీఁదనే వ్రాయించి (చెక్కించి) శ్రీ వేంక టేశ్వరస్వామివారి చరణకమలముల కర్పింప నిశ్చయించుకొనిరి. పెక్కుమంది భక్తు లన్నమయ్యగారికి శిష్యులైరి. రాఁబోవు నేకాదశినాఁడు బ్రహ్మాండమగు నుత్సవముచేసి యా యుత్సవ సమయములోఁ దామ్రపత్రి లిఖితములగు నన్నమయ్యగారి కీర్తనలు స్వామి కర్పించుటకు నిర్ణయించుకొనిరి. చుట్టుపట్టుల నున్న గ్రామములన్నిటికి నుత్సవమును గూర్చిన వార్త లందఁ జేయఁబడెను.

నాఁడేకాదశి పర్వదినము. ఉత్సవములోఁ బాల్గొను టకై పొరుగూరులనుండి వేనవేలు జనులు తిరుపతికి వచ్చిరి. కొండక్రిందఁ, గొండపైన, బ్రతిచోట యాత్రికులు విడిసిరి. కొందఱు సత్రములలోను, గొందఱు మిత్రుల యిండ్లలోను గొంద ఱాశ్రమములలోను విడిసిరి.

ఉత్సవమును జూచు వేడ్కతో రాయప్పకూడఁ దిరుపతికి బయలుదేఱెను. ఆ వార్త వెంటనే యాచేంద్రునకు మంత్రి యందఁజేసెను.

రాయప్ప అన్నమయ్యగారి మిత్రుఁడు, భక్తుఁడు, విశేషించి గాయకుఁడు. కాన్పున నా యుత్సవములోఁ బాల్గొనుటకై తిరుపతికి వచ్చెను. పరమపావనుఁడగు రాంజీ బ్రహ్మచారి యాశ్రమములో బసచేసెను. రాంజీ రాయప్పకు వలయు నేర్పాటులన్నియు యథోచితముగాఁ గావించెను. రాయప్ప రాకకు రాంజీ చాల సంతోషించెను. ఆదరించెను. హృదయపూర్వకాతిథ్యము నిచ్చెను. రాయప్ప రాంజీ యాతిథ్యము గైకొని యొక రసాలసాలము క్రిందనున్న చలువరాతి తిన్నెపైఁ గూర్చుండి యేదియో యాలోచించుకొనుచుండెను.

అంతలో యాచేంద్రుఁడు వచ్చి చేతులు జోడించి సవినయముగా రాయప్పముందు నిలిచెను. రాయప్ప యాచేంద్రునిఁ జూచి చకితుఁడయ్యెను. ఆశ్చర్యపడెను, ఆనందమొందెను, విషాదపడెను. ఏవేవో భావము లాతని హృదయమున నిటునటు పరుగులు వాఱెను. క్షణకాల మాతని కేమనుటకుఁ దోఁచలేదు. కనులు బాష్పపూరితములయ్యెను. కంఠము రుద్ధమయ్యెను. ఎలుఁగు వణఁకాడ యాచేంద్రునిఁ గూర్చుండుమనెను. యాచేంద్రుఁడు చెంత నుపవిష్టుఁడాయెను.

రాయ :- యాచేంద్రా ! కాలగతి వక్రించినది. దైవ మలంఘ్యముగదా !

యా :- (క్షణకాల మేమియు మాటాడలేక) ఔను రాయప్పగారూ ! కాలము వక్రించినప్పుడే దైవ మలంఘ్యమైనపుడే పౌరుషము వహించి కార్యము సాధింపవలయును - అపజయములకుఁ గారణము ప్రయత్నలోపమేకదా యగును.

రాయ :- ప్రయత్న లోపము లెందులకు రావలెను ?

యా :- రాలేదు. రాఁబోవు. మీ యనుగ్రహము మాత్ర ముండవలెను.

రాయ :- ముసలిముండవాఁడను. నా యనుగ్రహముతోఁ బనేమి ? గ్రుడ్డికన్ను దెఱచినను మూసినను నొక్కటేకదా!

యా :- అట్లు సెలవీయకుఁడు రాయప్పగారూ ! మీ కున్న లోకానుభవము, రాజభక్తియు సాటిలేనివి. మీ కటాక్ష లేశము వీనిపైని బఱపుఁడు; కార్యమంతయుఁ జక్కఁబెట్టఁ గలను. చంద్రగిరి రాజ్యమును నిలువఁబెట్టి రాజకుమారు నకుఁ బట్టము గట్టుదును.

రాయ :- నే నన్నియు వదలుకొని యేదో 'రామ ! కృష్ణా' యనుకొని కాలము గడుపుకొనుచున్నాను. నన్నెందులకు మరల రాజకీయములలోనికి ఈడ్తురు ?

యా :- రాయప్పగారూ ! మన మే రాజచంద్రుల గొడుగు నీడల వసించి యింతకాల మున్నామో యా రాజవంశము ఋణము తీర్చునది నిదే. మీరొక్క సాయము చేయుఁడు. చాలు. తరువాతిపని నేను జూచుకొందును. చిక్కదేవ రాయల రెండవకుమారుని శ్రీరంగరాయుని నెట్లయిన మనము బయటకుఁ దీసికొనిరావలయును. పిమ్మట దాని కెల్ల దైవమున్నాఁడు.

రాయ :- సరే యాచేంద్రా ! అట్లే. నీ మాట కాదనఁగలనా? వివాహమున కేమఁరీమదము. మంచిపనికి భగవంతుఁడు తోడ్పడకపోవునా? "లేవండి వేళయైనది. అన్నమయ్య గారి యుత్సవము చూచివత్తము" అని యేదో మంతన మాడెను. యాచేంద్రుఁడు సెలవుతీసికొనెను. రాయప్ప యుత్సవములోఁ బాల్గొని యన్నమయ్య సద్గించి, చంద్రగిరికిఁ బయనమయ్యెను.

*

# రాయప్ప ప్రయాణము

అన్నమయ్య యుత్సవము చూడవచ్చిన రాయప్ప యాచేంద్రుని కోరిక మన్నించు భారము తనపైఁ బడునని యెన్నఁడు తలంపలేదు. దైవతంత్ర మచింత్యము.

రాయప్ప తిరుమలనుండి (కొండమీదినుండి) తిరుపతిక (కొండక్రిందికి) వచ్చి యచ్చటి సీతారామస్వామి నర్చించి మఱి చంద్రగిరికి నేఁగవలయునని నిశ్చయించుకొనినాఁడు.

తనపైని యాచేంద్రుఁడు పెట్టిన కార్యభారము తన్నుఁ గ్రుంగఁదీయుచుండఁగా నాలోచనామగ్నుఁడైనాఁడు. కుడితిలోఁ బడిన యెలుకవలె వాని మనసు కొట్టుకొనసాగెను. ప్రయాణము సాగించినాఁడు. అప్పుడు సాయంసంధ్యాసమయ మైనది. అరుణుని యరుణకాంతు లాకసమంతట నలమికొని క్షణములోఁ జిత్రచిత్రవర్ణములుగా మాఱెను. ప్రకృతిచేయు మార్పుల కది చిహ్నముకాఁబోలు. కేవల దైవభక్తిపరుఁడైన రాయప్ప వేంకటేశ్వరస్వామి ప్రీతికై యా పెద్దవయసులోఁగూడ శ్రమ యని తలంపక భగవంతునిపైని భారమువైచి తిరుపతికి నెడలు టకై యొక్కొక్కమెట్టు మెల్లఁగ దిగనారంభించెను. వానితోఁ గూడ నున్న భటులు 'జయ శ్రీనివాసా' యని యెలుఁగెత్తి యఱచుచుండిరి. రాయప్ప మాత్రము మౌనమువహించి యుండెను. ఒక్కొక్కమెట్టు దిగుచుండ రాయప్ప మనసున కొక్కొక యాలోచన తట్టుచుండెను. దేనిని మాతని కిసుమంతయు శాంతి నొసగుటలేదు. యాచేంద్రునకుఁ దాఁ జేయుదు

నని చెప్పిన సాయమునుగూర్చి యాతఁడు 'సతమతము' కాఁ జొచ్చెను. తాను వహింతునని చెప్పిన కార్యభారము సామాన్య మైనది కాదని వానికి బాగుగాఁ దెలియును. కావుననే స్థైమిత్యము లేనివాఁడయ్యెను.

తన తాత రాయప్ప శ్రీకృష్ణదేవరాయలయొద్దను, రామరాయలయొద్దను నిట్టి యుద్యోగమే చేయుట యతని కప్పుడు కనులకుఁ గట్టినట్లాయెను. విజయనగర వైభవము జ్ఞప్తికివచ్చినది. నానాదేశాగతులైన వర్తకులు తన తాత యొద్దకు వచ్చి తాము తెచ్చిన యచ్చపు నగలు నాణెములు చూపి యా యాభరణములను రాయలవారిచేఁ గొనిపింపుఁడని వేఁడిన వేఁడికోలులుగూడ నాతని మానసమున సాక్షాత్కరించెను. కృష్ణరాయలు రాజవీథులలో గుఱ్ఱపుస్వారి తీయునప్పటి తీరుతియ్యములు, తన చిన్నతనపు పరుగులు, రాచనగరు ముచ్చటలు వాని కనులలో మెలఁగి చెవులలో ధ్వనించెను. విస్ఫారిత (విప్పారిన) నేత్రుఁడయ్యెను. క్షణములోనె సబాష్ప నేత్రుఁడయ్యెను. వెంటనే యాతని మ్లానవదనమునుండి యీ క్రింది మాటలు వినఁబడి వినఁబడనట్లుగా వెలువడినవి.

"దైవమా! నీ వెంత చిత్రచరిత్రుఁడవు! 'ఆనాఁడు రాయలు లేనినాఁడు సార్వభౌముఁ డంతరించిననాఁడు, ముష్కర తురుష్కులు విజయనగరమున కనతిదూరమున విడిసి, రణభేరులు మ్రోఁగించిననాఁడు మా తాత నగరమువిడిచి పోలేదు. తుదకు తురుష్కులు నగరములోనికిఁ జొచ్చుకొనివచ్చి, కోటలోఁ బ్రవేశించి, రాచనగరుచొచ్చి యా రాజభక్తునిఁ

బిలువనంపి 'ఉగ్రాణప్' తాళపుఁజెవులు బలాత్కారముగాఁ దీసికొని యాయన సిగకోసి గేలిచేసి పొమ్మనిన కథ, నేఁటిదిగా నున్నది. ఏ గడియ కాగడియయె మా నాయనమ్మ, మా యమ్మ, మా నాన్న కఱకుతురకలు వచ్చి యింటిపైఁ బడుదు రని పడిన యలజడి యబ్బా! యిబ్బడిగా నా మనస్సును కలవర పఱచుచున్నది. అయ్యయ్యో! తురకలచే నిర్దాక్షిణ్యముగా నంటింపఁబడిన మేడల, మిద్దెల, యిండ్ల గజాశ్వ గోశాలల మంటలు, 'లబోలబో' మని యేడ్చు ప్రజల యాక్రందన ధ్వనులు మఱతునన్నను మఱపురాకున్నవే. ఓహో యెంతటి పుణ్యాత్ముఁడు! ఆ తురక సర్దారు అతఁడు శిక్షించి మా కుటుంబమును శత్రువులవాతఁ బడకుండ నప్పుడు రక్షింపకున్నచో మా వంశము పేరునూరు లేకుండఁ బోయియుండెడిదిగదా? ఆ పల్లెటూరిలో నా యమాయకపు గొల్లయిల్లాలు మహాత్మురాత్రి కాపాడి చేసిన యాదరణము మఱవఁగలనా? తురకల్లో పెనుఁ గొండఁ జేరినపిమ్మట మాపాల్లు కొంచెము గట్టెక్కి క్రమముగాఁ గోలుకొన్నాము. అళియ రామరాయలు సకలము తిమ్మయల యన్యోన్యస్పర్థలు, అసూయలు, రాజకుటుంబములో నంతఃకల హము దెచ్చిపెట్టి విజయనగర మహాసామ్రాజ్య పతనమునకుఁ గారణములైనవి.

ఇన్ని కథ విని యున్న నేను యాచేంద్రునకు నట్టి రాజ్య తంత్రములో సాయపడుదునని మాటయిచ్చితినే? మొగమోటము దరిద్రత్వమునకుఁ గారణమగునా? చూచుచుఁ జూచుచుఁ గొఱవితోఁ దల గోఁకుకొనుట లేదుగదా! ముప్పున నిది నెత్తిని బెట్టుకొంటినే! కానీ యేమి జరుగనున్నదో యది జరుగక

మాపదు. గోటిలోఁ దలపెట్టి రోఁకటిపోటునకు వెఱచుట యెందులకు ? అన్నిటికి శ్రీనివాసుఁడే యున్నాఁడు !" అని

ఈ మాటలు ముగియునప్పటికి కాతఁడు కొండక్రింది మొదటి మెట్టునుండి భూమిమీఁద నడుఁగు పెట్టెను. అప్పటికి జామురాత్రి యైనది. వెంటనే బసకుఁబోయి కాలుసేతులు కడిగి కొని, మడిగట్టికొని ఫలహారముచేసి శ్రీమార్గపనోదార్థ మారాత్రికి నందే విశ్రమించి సుఖనిద్రపోయి, లేచి యుదయముననే చంద్ర గిరికిఁబోవఁ బ్రయాణమయ్యెను. బోయీలు 'లాలకి' (పల్లకి) దీసికొని వచ్చి సిద్ధముగా నుండిరి.

ఇంతలో రాయప్ప స్నానముచేసి పీఁటపైఁ గూర్చుండి భగవద్ధ్యానములో మునిఁగెను. కనులు మూసికొని 'స్వామీ ! శ్రీరామచంద్రా ! నా కర్తవ్యమేమి ? ఆనతిమ్ము' అని తనలోఁ దానే ప్రశ్నించుకొనెను.

ఆతని కేమి ప్రత్యుత్తరము వచ్చెనో చెప్పలేము. కాని యాతఁడు ధ్యానము ముగించి పీఁటపైనుండి లేచునంతలో శ్రీ రామాలయమునుండి యర్చకులు తీర్థప్రసాదములు, నిర్మాల్యములు తీసికొనివచ్చి రాయప్ప వచ్చుటకై సిద్ధముగా నుండిరి.

రాయప్ప కిష్టదైవము శ్రీరాముఁడు. తిరుపతిలోని శ్రీరామాలయమున కాతఁడు ప్రాకారాదులు కట్టించి, శ్రీరామునకుఁ బెక్కు కానుక లర్పించియుండెను.

తాను నమ్మిన దైవమునొద్దనుండి తీర్థప్రసాదములు, నిర్మాల్యములుదీసికొనివచ్చిన యర్చకులు వానికి దేవదూతలుగా దోఁచిరి. వారియొద్ద కేఁగి యా దివ్యపదార్థములు భక్తిపూర్వ

కముగాఁ గైకొనెను. శ్రీరాముఁడు చిక్కరాయలను జెఱ నుండి విడిపింపుమని యాదేశించియే తనకు నిర్మాల్య మంపెనని యతఁడు తలంచెను. సంతసించెను. పులకించెను. అర్చకులకు సత్కారములు గావించెను. అప్పటికిఁ దన ప్రయాణ మాపి వైచెను. అర్చకులతో స్వామి దర్శనమునకు వచ్చెదనని చెప్పి వారిని బంపివైచెను. బోయీలకుఁ బ్రయాణ మీపూట కాదని యెఱింగించెను. పరివార మెవరి పనులలో వారు సర్దుకొనిరి.

రాయప్ప తన వెంట నొక బ్రాహ్మణునిఁ దీసికొని శ్రీ రామాలయమున కేఁగెను. అర్చకులు ధ్వజస్తంభమునొద్దకు నెదురుగా వచ్చి రాయప్పను గర్భాలయమునకుఁ దోడ్కొని పోయిరి. రాయప్ప జేగంట మ్రోఁగించి, త్రికరణశుద్ధిగా రామస్వామికి నమస్కరించి మరల బసకువచ్చి భోజనముచేసెను. అప్పటికిఁ బ్రొద్దు పడమటికి వ్రాలెను. సూర్యాస్తమయము గాకుండఁ జంద్రగిరి కరుగవలయునని తలంచి బోయీలను బిలిపించెను. వారు 'లాలకి' (పల్లకివంటి యానము) సిద్ధముచేసిరి. రాయప్ప లాలకి యెక్కెను. బోయీ లంచెలమీఁద, లాలకిని మోయుచు సంధ్యాసమయమునకుఁ జంద్రగిరి ప్రవేశించిరి.

కొలఁకులు మాని పక్షులు కులాయకూటములకు వచ్చుచుండెను. ఏలపాటలు పాడుకొనుచు, ఆలమందలను దోలికొని గొల్లలు దుర్గద్వారము దగ్గరకు వచ్చిరి. గోధూళివేళఁ గోటలోఁ బ్రవేశించుట మంచిదని రాయప్ప బోయీలను హెచ్చరించెను. క్షణములో బోయీలు కోటగుమ్మమునొద్ద వ్రాలిరి.

అచ్చట 'జనసమ్మర్దము' హెచ్చుగానున్నది. క్రిక్కిరిసిన యా జనుల నడుమనుండి కొందఱు చాకలివాండ్రు చలువబట్టల మూటలను గాడిదలపై వేసికొని కోటలోనికిఁ బోవుచుండిరి. రాజభటులు రాయప్పనుగాంచి త్రుళ్ళిపడి జనులసందడి తొలఁగించిరి. లాలకి కోటలోఁ బ్రవేశించుచుండెను.

గాడిదలపైని మూటలను జూడఁగానే రాయప్పకు మెఱపు మెఱసినరీతిగా నొక భావముప్పతిల్లెను. వికసన్ముఖుడయ్యెను. 'తండ్రీ ! శ్రీరామచంద్రా ! కరుణాసాంద్రా ! ఎట్టి చక్కని యుపాయము తోపించితివి కుఱ్ఱవానిని శ్రీరంగరాయని బయటకు దాఁటించుటకు. ఆనాఁడు గాడిదకాళ్ళు పట్టుకొని వసుదేవుఁడు శ్రీరంగధాముఁడగు చిన్నారి కృష్ణునిఁ గారాగారమునుండి దాఁటించినట్లు నేనుగూడ గార్దభ సమాశ్రయమున మా చిన్నారి పొన్నారి శ్రీరంగరాయలను జెఱనుండి దాఁటించెదను. ఇదే నా ప్రతిజ్ఞ. రాంజీ బ్రహ్మచారి భవిష్యత్తెఱింగినవాఁడు. కావుననే శ్రీరంగరాయల నీచలికి దాఁటించుమన్నారు. వారి వాక్కమోఘమైనది. వారి యాశీర్వాదబలముచేతనే తిరిగి విజయనగర సామ్రాజ్య వైభవము రేకెత్తగలదు' అని నిశ్చయించుకొనెను.

పల్లకి 'ఖిల్లా' (కోట) కార్యాలయముచేత దింపఁబడెను. రాయప్ప తన గదిలోఁ బ్రవేశించి పని చూచుకొనుచుండెను.

# చిక్క దేవరాయలు - చెఱ

చిక్కదేవరాయలున్న చెఱసాల పూర్వ మొకప్పుడు పూజామందిరమే కావచ్చును. కాని యిప్పుడది గబ్బిడాయల నిలయము. గాలి వెలుతురులు లోనికిఁ జొరరాకుండఁ జేయఁ బడియున్నది. ఉన్న కిటికీలు మూయఁబడినవి. ద్వారమునకుఁ గల దంతపుఁ దలుపు లూడఁబెఱుకఁబడి యినుపతలుపులు బిగింపఁబడినవి. ఆ తలుపులకు, లోపలనున్నవారి ముఖము లగపడు రంధ్రములుమాత్ర మున్నవి. అది యొక దయ్యములకొంప గాని మానవులు వసించు నిల్లుగాదు.

హంసతూలికా తల్పములపైని వసించిన చిక్కదేవరాయ లందు బిక్కమొగముతో దిక్కులేక సకుటుంబముగా నల్లాడు చున్నాఁడు.

వానిచెంత నిపుడు (రాత్రులయందు) వెలుఁగుటకు రత్న దీపములు లేవు. భుజించుటకు స్వర్ణపాత్రికలు లేవు. కూర్చుండు టకు సోఫాలు లేవు. వీచుటకుఁగాని, యుదకు విసరుకొనుటకు వింజామరలు లేవు. త్రాగుటకు మధుర పానీయములు లేవు. పీల్చుటకు 'హుక్కా'లు లేవు. చదువుటకు గ్రంథములు లేవు. వినుటకు వీణలు లేవు. విహరించుటకు ఉద్యానవనములు లేవు. ఆరగించుటకు మీఁగడ పెరుఁగులు లేవు. తొడుగుకొనుటకుఁ బట్టుపుట్టములు లేవు. పగటికి రాత్రికి వానికి భేదమంతగాఁ గానవచ్చుటలేదు.

కాకఘూకముల కఠోరరావములె వాని మేలుకొలుపు పాటలు. సూరులఁ గీచుకీచుమను చూరెలుకలు, గబ్బిలములు వాని మిత్రములు.

పూర్వము చిక్కదేవరాయల దేవేరిమాత్రమె యసూర్యంపశ్య. ఇప్పుడందఱువారెల్ల నెండకన్నుఁ గంగనివారె. ఎంతవానికిని విధి దాఁటరానిదికదా! కటికచీకటి కొట్టులో సామాన్యమానవులుగూడఁ దినఁజాలని కొఱ్ఱకూడు, గంటెచున్నము, జొన్నయోగిరము, చోడిజావకూడ నారాజకుటుంబమున వారనుభవింపవలసివచ్చెను.

రోజులెన్నో కడచిపోవుచున్నవి. సూర్యోదయాలు సూర్యాస్తమయములు నెన్నో కడచిపోవుచున్నవి. పగలు రాత్రియుఁగూడ వారి కొకేవిధముగా నుండెను. ఆనందము లేదు, విషాదము లేదు. చచ్చెడివానికి సముద్రము మోఁకాటి లోఁతుగదా!

ఏరీతిని జూచినను వారికిఁ దమ్మావరించియున్న యంధకారము విరియు నాశ యగుపడుట లేదు.

ఒకనాఁడు జాముర్రాత్రివేళఁ జిక్కదేవరాయలు ఏమియుఁ దోఁచక చిన్నకుమారుఁడు శ్రీరంగరాయలని వొడిలోఁ గూర్చుండఁబెట్టుకొని 'నాతండ్రీ! శ్రీరంగరాయా! ఆడుకొనుచు పాడుకొనుచుఁ దినితిరిగే యీవయస్సులోఁ నీకెట్టి దుర్దశ వచ్చినదిరా! మాతోపాటు నీవును గష్టములపాలు కావలసి వచ్చినదిగా బాబూ! నీవైన బ్రతికి బయటఁబడి బట్టగట్టి తిరిగిన మా జన్మములు తరించునురా తండ్రీ!' అనెను.

శ్రీరం :- నాయనగారూ ! మేము నగధీరులగు మీరిట్లధైర్యము చెందుట, రాచపాడి, మగపాడికూడఁ గాదుగదా ! అదృష్ట మబ్బుసమయము వచ్చినచో సర్వత్ర మార్గము లేర్పడును గదండీ !

చి :- తండ్రీ మనకు— అదృష్టము—అబ్బుటకూడనా? ఆరోజు వచ్చుట నేను బ్రతికయుండఁగాఁ జూతునా !

శ్రీరం :- అదెవ్వరు నాన్నగారూ! దూరముగా నెవ్వరో వచ్చు చున్నట్లున్నారు. ఆ తలుపు చారియలోనుండి చూడండి.

చి :- మనకొరకు కేవరు వచ్చెదరోయి చిట్టిబాబూ! వంటవాఁడు వచ్చుచున్నాఁడేమో మనకు భోజనములు తీసికొని.

శ్రీ :- కాదండి నాన్నగారూ ! ఎవరో క్రొత్తవారులాగున నున్నారండీ ! పెద్ద తలపాగా, ప్రక్క జేబులుగల నిలువుటంగీ, ధరించియున్నాఁడండీ ! ఎవరో రాజోద్యోగివలె నున్నా రండి. లేచి చూడండి, మీ రెఱిఁగియున్నవారై యుందురు.

చిక్క :- ఎందులకోయీ చూచుట. ఇంకను మనల శోధించు టకు జగ్గరాజుగారో, తిరుమలరాయలో పంపించిన పరిశోధ కుఁడై యుండును. రానీ ! వాఁడేవచ్చును. తొందరయేమి?

శ్రీరం :- కాదండి నాన్నగారూ ! 'ఆయన' యెవరో మన బంధువులై యుండెదరండీ !

చిక్క :- ఎంత వెఱ్ఱిబాగులవాఁడవోయి ! చిన్నిబాబూ ! మన యుద్ధమున మన చుట్టములనుగూడ రానిచ్చెదరా రాజుగారు.

శ్రీరం :- ఎందుకు రానీయరండి. మన క్షేమము కోరెడివారు మన బంధువులు కారా? మన మేలు కోరెడివారే లేరా యీ కోటలోను?

చిక్క :- ... ... ... ...

శ్రీరం :- మాటలాడరేమండి నాయనగారూ!

చిక్క :- ఊఁ—ఏమన్నావు...ఎవరున్నారు! ఉన్నను రాజాంతనిని మనయొద్దకు రానిచ్చునా?

శ్రీరంగ :- రావలెనన్న వారెట్లో రాకమానరుకదండీ!

చిక్క :- ఊఁ—ఏమిటి బాబూ?

శ్రీరం :- నాన్నగారూ! చూడండి. అదుగో తలుపుదగ్గఱకే వచ్చినారండి నేను చెప్పినవారు!

చిక్క !- ఎవరు వారు?

రాయ :- చిత్తము—మహాప్రభూ! నేను రాయప్పను, ఏలినవారి సేవకుఁడను —

చిక్క :- లే బాబూ! శ్రీరంగా! లే నిజముగా మన బంధువులే వచ్చినారు.

శ్రీరంగరాయలు లేచెను—చిక్కదేవరాయలు వానిని చేయిపట్టుకొని తలుపుదగ్గఱకుఁ దీసికొని వెళ్లెను.

రాయప్ప చిక్కదేవరాయలనుగాంచి ప్రభూ! తామె—తామే—చిన్నబాబుశ్రీరంగరాయలే, మీరు లేచి రావలయునా! నేను రానా లోపలికి. అని తలుపుతీసి గది 'తనిఖీ' చేయుచున్నట్టు లోపలికిఁ జనెను. ఒకమూల కందఱు చేరిరి.

చిక్క :- రాయప్పగారూ! చూచినారా మా యవస్థలు!

రాయ :- (కన్నీళ్ళతో) ప్రభూ! అట్లు సెలవీయకుఁడు. ఎల్ల కాలము కృష్ణపక్ష ముండునా? శుక్లపక్షము వచ్చును, చంద్రోదయ మగును. అందఱకు ఆనందము వెల్లివిరియును.

చిక్క :- ఇరుపక్షములు తెగిన నావంటి పక్షికి మరల శుక్లపక్షములుగూడ వచ్చునా?

రాయ :- కాదు మహాప్రభూ! అట్లు సెలవీయకుఁడు. మన శ్రీరంగరాయలే మన కన్నులవెన్నెల.

చిక్క :- చిన్నవాఁడు కావున మీరన్నది వాస్తవమే! 'బందిఖానాలోఁ' జెంత నీతఁడే లేనిచో నే నేమయ్యెడివాఁడనో! వీని వెలుఁగె మా కిం దాధారమైనది యుండాఁక——

రాయ :- ముందుకూడ శ్రీరంగబాబే వెలుఁగిచ్చువాఁడు.

చిక్క :- రాయప్పగారూ! మీ మాటలు నిగూఢములుగా నుండియు ఆశాజనకములుగా నున్నవి.

రాయ :- చిత్తము! ఏలినవారి కొక్క మనవి. నే నిచ్చట ఆలసింపరాదు.

చిక్క :- అవశ్యము చెప్పుఁడు.

రాయ :- 'మొన్న నీమధ్య'నే తిరుపతిలో నేను యాచేంద్రులు కలసికొన్నాము. యాచేంద్రులు నేను గలిసికొనిన పర్యవసానముగా నొక నిశ్చయమునకు వచ్చినాము.

చిక్క :- ఏమది?

రాయ :- మరేమీ లేదు ప్రభూ! ఎట్లైనను ప్రభువువారిని కుటుంబసహితముగాఁ జెఱనుండి తప్పింప వలయునని యాచేంద్రులు దృఢనిశ్చయులై యున్నారు. నిశ్చయులై యుండుటయే కాదు; ప్రతిజ్ఞకూడఁ జేసియున్నారు.

చిక్క :- ఆ మహావీరుఁడు తలంచినఁ గానిదేమున్నది? చెప్పుఁడు. పిమ్మట నేమిజరిగినది ?

రాయ :- చిత్తము. నేను యాచేంద్రులు కలిసికొనుటకు మునుపే యాచేంద్రులు రాంజీబ్రహ్మచారిని గాంచికొని శ్రీవారిని జెఱనుండి విడిపించునట్లాశీర్వదించుఁడని వేఁడుకొనెనఁట. దానిపై రాంజీబ్రహ్మచారి, యాచేంద్రా! ప్రస్తుతము రాజకుటుంబము నంతను నుద్ధరించుటకు వీలుపడదు. ఎట్లయినను నీవు ముందు చిక్కదేవరాయల రెండవ కుమారుని శ్రీరంగరాయుని జెఱనుండి పైకిఁదీసికొని రమ్ము. పిమ్మటఁ దరువాతపని చూచుకొనవచ్చును. అని సెల విచ్చెనఁట. అందుపై యాచేంద్రుఁడది యెట్లు సాధ్యపడునో సెలవిండని ప్రార్థింపఁగా రాంజీ, నాపై నా భారము పెట్టుమనెనఁట.

చిక్క :- యాచేంద్రుఁ డిప్పు డెక్కడ ?

రాయ :- తిరుపతి దగ్గఱనున్న కాఱడవిలోని యొక కొండ గుహాలో.

చిక్క :- ఓహో యేమి రాజభక్తి! ఆ మహాయోధునిమాటలాదినుండి నేను వినియున్నచో రాయన్నగారూ! మాకీయవస్థ......

రాయ :- ఔను ప్రభూ ! గత జలసేతుబంధన మేల ? ఆలస్య మగుచున్నది. ఇతరు లనుమానింతురు. ఒక్కమనవి చిత్తగింపుఁడు.

చిక్క :- అవశ్యము.

రాయ :- ఏదో యొకరోజున వీలుచిక్కినపుడు నేను మీయొద్ద కొక చాకలివానిని మురికిబట్టలు తీసికొనిరావలసినదిగాఁ బంపించెదను. వాని చేతికి శ్రీరంగరాయల నీయుఁడి. వాఁడు గుడ్డలమూటలో బాబుగారిని బంధించి కోట దాఁటించి యాచేంద్రుని కందఁజేయును. బాబూ ! రంగబాబు గారూ ! భయపడకుఁడు. మీరే సంతోద్ధారకులు. చాకలి మోలా బిగించినను కదలకుఁడు మెదలకుఁడు

చిక్క :- రాయప్పగారూ ! మీ యాజ్ఞ మాకు సుగ్రీవాజ్ఞ గదా ?

రాయ :- నే నెప్పుఁడ నాజ్ఞాపించుటకుఁ బ్రభూ? యాచేంద్రుని యాజ్ఞ మీ యాజ్ఞగా శిరసావహించినాను. రంగబాబు గారిని యాచేంద్రుని కందఁజేసినపిమ్మట యేలినవారు మహా రాజ్ఞిగారు—పెద్దబాబూ !...... మఱి సెలవు. తాము రంగబాబును సిద్ధముచేసియుంచుఁడు—సమయ మాసన్నము కాఁగలదు. సెలవు.

## శ్రీ రంగరాయుల దాటించుట

కనుచీకటి పడుచుం బడుచు నున్నది. చాకలి తిరపయ్య గాడిదమీఁద బరువైన గుడ్డలమూట వేసికొని కోటగుమ్మము దాఁటి గాడిదను దోలుకొని మెల్లగాఁ రాజవీథివిడిచి కోటప్రక్క సందులోనుండి కొంతదూరముపోయి యక్కడనుండి యడ్డముగాఁ దిరుపతికి పోయెడి డొంకదారిని బట్టెను.

తెల్లవాఱఁగానే తిరుపతిలో వరదరాజస్వామివారి కళ్యాణ మహోత్సవము. అది వైశాఖమాసము. పగటివేళ యెండ వేఁడి మిక్కిఁ దాళఁజాలమని యాత్రికులందఱుఁ దిరుపతికి బయలుదేఱిరి.

తిరపయ్య చంద్రగిరిదాఁటి దిరుపతిదారి పట్టునప్పటికి జాముర్రాత్రి కావచ్చినది. శుక్లపక్ష దశమి కావున వెన్నెల బాగుగాఁగాయుచున్నది. తిరుపతి యాత్రికులు జట్టులుజట్టులుగాఁ బయలుదేఱిరి. కొందఱు 'గోవిందలు' కొట్టుచున్నారు. కొందఱు 'హరేరామ హరేరామ రామరామ హరేహరే' యనుచున్నారు. కొందఱు వరదరాజస్వామి మాహాత్మ్యమును గూర్చిన కథలు చెప్పుకొనుచున్నారు. కొందఱు రామభజన చేయుచున్నారు. కొందఱు పాటలు పాడుకొనుచున్నారు.

ఎవరిదారి వారిది. ఎవరిగోల వారిది. ఒకరిజోలి యొకరికిలేదు. ఎవరికివారే తెల్లగుంకక మునుపే తిరుపతికిఁ జేరుకొనవలయునను నహమహమికతో ముందునకుఁ ద్రోసికొని పోవుచున్నారు.

చంద్రగిరికిఁ దిరుపతి సుమారైదుక్రోసుల యంతమాత్రమె దూరమైనను తిరపయ్య గాడిదబరువుతోఁ దెల్లవారుజామునకుఁ గాని యచటికిఁ జేరుకొనలేదు.

అతఁడు తిరుపతికిఁ జేరి తూర్పుదిశగా నున్న యొక జమ్మి చెట్టుక్రింద గాడిదనాఁపి 'యేడుకొండలవాఁడా! కాపాడినావురా' యనుచు నటునిటు బిత్తరిచూపులతోఁ జూచెను. వాని ప్రతి చూపులోను జలుకుఁదనముతోపాటు ఆలోచనకూడ నిమిడి యుండెను. అట్లతఁడు నిరీక్షించుచున్నంతలో నొక చేయెత్తు మానిసి, తన సహజ గాంభీర్యమునకు శౌర్యత్వము వన్నె పెట్టు చుండ నిశిత కరవాలధారియై వచ్చి యెదుట నిలువఁబడెను. వానిని గాంచి తిరపయ్య చిరపరిచితునిఁ గాంచినట్లు సరాలునఁ జెంతకేఁగి నమస్కరించెను. ఆతఁడు తిరపయ్యను 'వచ్చితివా! తీసికొని వచ్చితివా' రా, పోదమని, వీఁపుతట్టి, చేయిపట్టుకొని, నరసంచారము లేని యొక సంకేతస్థలమునకుఁ దీసికొనిపోయెను.

వెంటనే తిరపయ్య గాడిదమీఁది మూటను గ్రిందికి జాగ్రత్తగా దింపెను. నూతన వ్యక్తికూడ సాయపడెను. మూటలదింపి యందొక శుభ్రవస్త్రముల మడతలోనున్న బుడు తని బైకిఁదీసి యొడలు నిమురుచుఁ గ్రొత్తగా వచ్చిన మహా పురుషుని చేతికందిచ్చెను. అతఁ డమందానంద కందళిత హృద యుఁడై యా కుమారునెత్తి కౌఁగలించుకొని, శిరము మూర్కొని తిరపయ్యను దనవెంటఁ దీసికొని వడివడిగా నడచి నట్టడవిలో నున్న కొండగుహాభిముఖుఁడై చనెను. తీర్థప్రజ లందఱు నెవరిగోడవలో వారుండిరి.

# హత్య

ఇది జరిగిన కొన్నాళ్ళకు నొకనాటి మధ్యాహ్నము, జగ్గరాయలు, ఓబలరాయలు మున్నగువారు కోటమట్టు నున్న బురుజులను బరీక్షించువారై కులాసాగా బయలుదేఱి యొక్కొక్క బురుజును, నిదానముగాఁ బరికింపఁదొడఁగిరి.

కోటమట్టును జుట్టువాఱి వారు నాలుగు గడియల ప్రొద్దు వేళకు మెల్లగాఁ జల్లగాలికి నుల్లసిల్లుచుఁ జిక్కరాయాదులు బంధింపఁబడియున్న కారాగారమునకుఁ దిన్నఁగా వచ్చి కోట గోడ దిగి క్రిందికివచ్చిరి.

పదిగజముల దూరము వచ్చునప్పటి కొక్కచోట లేఁ బచ్చికయు, దాని చెంగటఁగల పూఁబోదయు వాడి వత్తిలి యుండుట గానవచ్చెను. ఎందులకివి యట్లు వాడిపోయినవో చూడవలయునని జగ్గరాజునకు బుద్ధిపుట్టెను.

తాను కాలు మోపఁగానే యా నేల దిగిపోవుటయుఁ బచ్చికబెల్లు లంటిచ్చినట్లుండుటయుఁ గని యతఁ డనుమానపడి యేదియో తంత్రముండియుండునని యెంచి తలవంచి పరీక్షించుచు వెనుకకు ముందునకుఁ బోయి చూచెను.

అతని యనుమానము మఱియు బలపడెను. ప్రాకారము దాఁక వెడలెను. అక్కడనుండి మరలఁ దిన్నఁగాఁ జిక్కరాయల 'బందిఖానా' వైపునకు వచ్చెను. పొడుగుననుగూడ నేల యంతయుఁ ద్రవ్వి పూడ్చిన ఛాయ లతనికిఁ బెక్కు లగపడెను.

వెంటనే యొక భటుని రావించి, పనివాండ్రను బిలిపించెను.

'ఏమిరా! యీ ప్రదేశమంతా త్రవ్వి పూడ్చినట్లున్నది. మీ కేమైనఁ దెలియునా? ఎప్పుడైనఁ జూచినారా? మీరు జీతాలు పుచ్చుకొనుట కేగాని, కోట, తోఁట కాపాడుటకుఁగాదు కాఁబోలు. తెండు. పారలు గడ్డపారలు. అదిగో ఆ మూలనుండి యీ మూలదాఁక నల్లగానున్న భాగమంతయుఁ ద్రవ్వుఁడ'ని యాజ్ఞాపించెను. వెంటనే వారు పారలు, గడ్డపారలు తెచ్చి త్రవ్వనారంభించిరి. గడ్డపార వేయుఁగానే యది సరాలునఁ జాల లోఁతుగా దిగిపోయెను. అది చూడఁగానే జగ్గరాజునకు నొడలు మండిపోయెను. అదియొక సొరంగము. దానిని జూచుచునే జగ్గరాజు కను లెఱ్ఱఁబాఱి చింతనిప్పులయ్యెను. 'ఇఁకఁ జాలు నాగుండని' యాపని యాఁపించి నిప్పులు గ్రక్కుచుఁ దిన్నఁగాఁ జిక్కదేవరాయలున్న చెఱసాల గుమ్మమునొద్దకు వచ్చెను. కావలివానిని గ్రుడ్లుఱిమిచూచి తలుపుతీయు మనెను. వాఁడు గడగడలాడుచుఁ దలుపుతీసెను. జగ్గరాజాదులు లోనికిఁ బ్రవేశించినారు.

అప్పటికిఁ జీకటి పడుచున్నది. దీపములుగూడ వెలిఁగింపఁబడెను.

చిక్కదేవరాయాదు లొకమూలఁ బ్రయాణోన్ముఖులై యున్నట్లు నిలువఁబడియుండిరి. వారినిఁ గాంచుటతోడనే జగ్గరాజు ప్రళయకాల రుద్రుఁడై చిక్కదేవరాయునిఁగాంచి యుఱుములుఱిమినట్లుగా గద్దించి 'యేమి టీ హడావుడి' అని ప్రశ్నించెను.

చిక్క :- ఏమున్నది? పెద్దలు తాము దయచేయుచున్నారని లేచి నిలిచినాము. ఇంతే!

జగ్గ :- విన్నానయ్యా! యోబలరాయా! చిక్కదేవరాయల వారి సత్యవాక్య ప్రసంగము, సత్యహరిశ్చంద్రు లటు వీరటు. సరే, కాని - ఆ భూద్వార మేమిటో ముందు సెలవివ్వండి.

చిక్క :- ఏమో నాకేమి తెలియదు.

జగ్గ :- తెలియదా? కానీ! మేమె చూచెదమని కాగడా తెప్పించి తానే యచ్చటి కేగి జగ్గరాజు అదియంతయుఁ బరీక్షించెను.

అది చిక్కదేవరాయాదులు వెలుపలికి బాఱిపోవుటకుఁ ద్రవ్వఁబడిన సొరంగమని నిశ్చయించుకొనెను. ఆ నిశ్చయముతోపాటతని మేను క్రోధావేశముచేఁ గంపించిపోయెను. తనతోఁగూడ నున్న యోబలరాయుని కదంతయుఁ జూపి 'యోబలరాయా! యెంత చక్కగాఁ నున్నదయ్యా! నీ దుర్గ పర్యవేక్షణము! మన యదృష్టముకొలఁది నేఁడీ సొరంగము జాడ తెలియవచ్చినది కాని యొక్కరో జాలస్యమయి యుండె నేని కొంప మునిఁగియుండును.' అని యా సొరంగపు మార్గమును వెంటనే పూడ్పింప నాజ్ఞాపించి, శిరము పంకించుకొనుచుఁ జిక్క దేవరాయల సమీపించి——

'యేమీ! చిక్కా! నీ కింకను బుద్ధిరాలేదా? నా బాహుపరాక్రమము నెఱుఁగవా? 'ఖైదు'లో నుండిగూడ నీ వింకను మాపైఁ గయ్యముపకుఁ గాలు ద్రవ్వనెంచుచున్నావా? నీ తలబిరు సింకను అణఁగలేదా? యేరీ నీ కొడుకులు ఎక్కడ?

చిక్క :- అరుగో !

జగ్గ :- (పరికించి) ఒక్కఁడే యున్నాఁడేమి ? రెండవవాఁడో ?

చిక్క :- ... ... ...

జగ్గ :- ఏమిరా ! మాట్లాడవేమి ? ద్రోహీ ? నిజముచెప్పు. చెప్పవా ? నీ తల యెగురును. ఎంత సాహసము చేసి నావురా ! ఎవఁడురా నీకు సాయము చేసినవాఁడు ? ఏఁ. మాట్లాడవేమి ? చెప్పు. త్వరగా.

చిక్క :- నా కేమీ తెలియదు. మే మొకనాఁటిరాత్రి నిద్రపోయి లేచునప్పటికి మా రంగబాబు మా ప్రక్కలో లేఁడు. కావలివాని నడిగినాము. జాడ దెలియలేదు. మా దురదృష్టమును నిందించుకొన్నాము. ఇందే పడి యేడ్చుచున్నాము. మా యరణ్యరోదనము నాలించువా రెవ్వరు ? పాలించువారెవ్వరు ? మమ్ము హింసింపఁ దలంచి మా పంచప్రాణములైన శ్రీరంగదేవరాయలను మీరే - నిజముగా మీరే-మేము గాఢనిద్రలో నున్నప్పుడు మాకుఁ దెలియకుండ వెలుపలికిఁ గొంపోయి చంపించియున్నారు. అయ్యో ! జగ్గరాజుగారూ ! ముక్కుపచ్చలారని యీ బాలుఁడు మీ కేమి యుపకారము చేసినాడండి ? నామీఁదఁ గదా మీఁకు గోపము. నన్నుఁ జంపించిన నెంత బాగుగా నుండియుండును. ఎంత హృదయశూన్యమైన పని చేయించి నారండీ జగ్గరాజుగారూ !

జగ్గ :- ఔరా ! యెంతటి మోసగాఁడవురా ! చిక్కదేవరాయా ! యెంతటి మోసగాడవురా ? ఎవఁడురా నీకు

సాయపడినది? రెండవతోడకును కోట దాటించినావా! మరల వానిమూలమున రాజ్య మార్జింపవచ్చునని కలలు గనుచున్నావా? సరే, కానీ, కను కలలు, ఇంకను గను.

అని కొంచెము ప్రక్కకుదిరిగి 'ఆఁ. ఎంతటి ప్రమాదము సంభవించినది! ఆ ముసలి రాయప్పమాట విని వీరిని బ్రాణములతో నుండనిచ్చుటచే నింతటి యవస్థ ప్రాప్తించినది. ఈ చముకుకాళ్ళ పెద్దమ్మ తిరుమలదేవరాయనికి రాజ్యభ్రష్టత రానున్నదికాఁబోలు! ఇంతటి ప్రమత్తతకు ఫల మనుభవింపక తీరునా?'

అని యాలోచించుకొనుచు .. "ఎవరురా అక్కడ? రాయప్పగారిని దీసికొనిరండు నేను రమ్మన్నానని, యిక్కడ నున్నానని చెప్పి" అని కేకవైచెను. భటుఁ డొకఁడు పరుగునఁ బోయెను. అంతటఁ జిక్కదేవరాయని పెద్దకుమారుఁడు వీర రాఘవుఁడు "జగ్గరాజా! ఊరక లేనిపోని యనుమానము పెట్టుకొని రాయప్పను, భటులను నిందించిన నేమిలాభము? నీకోపము మాపైఁ దీర్చుకొనుము. ఇఁక మా యాశలడుగంటిన వని మాకుఁ దెలియకపోలేదు," అనెను. దానితో జగ్గరాజు నకుఁ గోపము మఱింత యధికమాయెను, "నోరుమూసికొనుము. నీ "సలహా" "మాకవసరములేదు." అని గద్దించెను. అంత లోపలినుండి రాణి "నాయనా ఆయనతో నీకు వాదమెందు లకు? రా నాయనా. మీరిద్దరును లోపలికిరండు. తుదివరకు నొకళ్ళమొగమొకళ్లు చూచుకొనుచు నిక్కడనే పడియుందుము" అనెను.

“ఆహా! మీ రిక్కడనున్నారా! మీ అబ్బాయి రాజై మమ్మును శిక్షింపనున్నాఁడని గర్వపడుచున్నారు కాఁబోలు! ఆతనినిగూడ వెదకి పట్టుకొని యీ జగ్గరాజు సంహరింపక మానఁడు......ఓరీ మీ రందరును గలిసి వీరి ముగ్గురిని వేరు వేరు గదులలో బంధించుఁ” డనుచుండగా, ఓబలరాయలటుల బంధించి వచ్చెను.

ఇంతలోఁ దిరుమలదేవరాయలు వాహ్యాళి వెడలివచ్చి నగరులోఁ బ్రవేశించినట్లు తూర్యారావములు వినవచ్చెను. అదివిని జగ్గరాజు వెంటనే యాతని రహస్యాలోచన మందిరమునకు రమ్మని కబురువెట్టి, చెంతనున్న భటునిఁగాంచి ‘ఏమిరా రాయప్పగారికొఱకుఁ బోయినవా డట్లే యుణఁగారినాఁ డేమి?’ యని ప్రశ్నించెను. అది విని ఓబలరాయఁడు రాయప్పగారు కొంతకాలముక్రిందటఁ దీర్థయాత్రలు సేవించుటకని రాయలవద్ద సెలవుగైకొని వెడలియుండి రనెను. “ఆఁ యీ వానకాలములో నా ముసలివానికిఁ దీర్థయాత్రలేమి? యిందేదియో యున్నది. ఆ ముసలివగఱడు, మిమ్ముల నందఱను మాయచేసి పోయెను. నాలుగురోజులు నే నిక్కడ లేకపోవుటచే నెంతటిముప్పు వాటిల్లెను?” అని రాయప్ప యింటికిఁబోయి యాతఁడెప్పుడు వచ్చునో యడిగిరమ్మని మఱియొకనిఁగూడఁ బంపి తాను ఓబలరాయల వెంటఁగొని రహస్యాలోచనా మందిరమున కరిగెను.

అక్కడ కప్పుడే తిరుమలదేవరాయలు వచ్చియుండెను. జగ్గరాజును జూచి యాతఁడు “ఏమీ! చిక్కదేవరాయని

రెండవ కుమారుఁడు పారిపోయెనా! అది యెట్లు జరిగియుండును!" అని ప్రశ్నించెను.

జగ్గ :- మీపరిపాలనము మీ జాగ్రత్త యింత బాగుగానున్నది. ఆ కుఱ్ఱవాఁ డెప్పుడు పాఱిపోయెనోకూడ మీకుఁ దెలియుట లేదు.

అంతలో రాయప్ప యింటికి వెడలినవాఁడు వచ్చి నమస్కరించి "స్వామీ! రాయప్పగారు సకుటుంబముగ శ్రీరంగ ముసకుఁబోయి యక్కడనుండి హంపిలోనున్న తమ బంధువులను జూచివత్తుమని చెప్పిపోయిరఁట. వారి మనుమలు శ్రీనివాసప్ప గారుకూడ రెన్నాళ్ళక్రిందట వచ్చి యింటఁగల సామగ్రినంతయుఁగూడఁ దీసికొనిపోయినారఁట" అనెను.

అది విని రాజు తిరుమలదేవరాయలు— 'అవునవును. శయనైకాదశికి శ్రీరంగనాథుని సేవించివత్తునని రాయప్ప నా యొద్ద సెలవుగైకొని వెడలెను. ఆయన వచ్చువఱకు నా యుద్యోగము నిర్వహించుచున్న శ్రీనివాసప్పగూడ నాలుగు దినముల క్రిందటఁ దాతగారు హంపినుండి తన్నచటికి రావలసి నదిగాఁ గబురు పంపిరని నా యొద్ద సెలవుగైకొని వెడలియుం డెను-' అనెను. అది విని జగ్గరాజు-

'శ్రీనివాసప్ప తన ద్రవ్యము- సామగ్రి యంతయుఁ దీసికొని చంద్రగిరినుండి వెడలిపోవుచప్పుడైనను' 'ఎందుల కింత సామగ్రితో నీతఁ డంతదూరము పోవుచున్నాఁడు' అనియైన నీ మార్గాధ్యక్షున కించుకయైన నాలోచన తట్టలేదుకాఁబోలు! అను నంతలో మంత్రి తిమ్మరాజును— దళవాయి వీరనారా

యణుఁడునుగూడ నక్కడకు వచ్చిరి. అందఱు నొకరి కొక రెదురుగాఁ గూర్చుండియుండఁగా—

జగ్గ :- విన్నారా తిమ్మరాజుగారూ ?......

తిమ్మ :- చిత్తము. శ్రీరంగదేవరాయ లప్పుడే వేంకటగిరి చేరినాఁడట. మొన్న యాదివారమునాఁ డాతని నేనుఁగుపై నూరేగించినారఁటగూడ. ఇప్పుడే వార్త యందినది.

జగ్గ :- మొన్ననా ? అట్లయిన నీ సారంగపు మార్గముననే యాతఁడు దాఁటింపఁబడెనా యేమి ?

తిమ్మ :- అట్లు జరిగియుండదు. శ్రీరంగదేవరాయలను దాఁటించినవారు, చిక్కదేవరాయానుజులను మనకు వదలియుందురా ? అదికాదు... ఆఁ. ఇప్పుడు బోధపడినది. వేంకటగిరినుండి వచ్చిన 'బఖైరు' (రిపోర్టు) లో నొక చాకలికిఁ దిరుపయ్య యనువానికి యాచేంద్రుఁడు రెండూళ్ళనిచ్చి బహూకరించెనని యున్నది. వాఁ డెవఁడో యిక్కడివాఁడె యై యుండును.

తిరు :- అవునవును. తిరుపయ్య యను చాకలి యొక్కఁడిక్కడ నుండెడివాఁడు. ఈమధ్య వానిని జూచినట్లులేదు.

జగ్గ :- అన్నిటికి—అవునవు ననుచుండుటయే. ఏమి జరుగుచున్నది కనిపెట్టు చాకచక్యముమాత్రము సున్న—

అని వాకిటనున్న యొక భటునిఁబిలిచి చాకలి తిరపయ్య యెక్కడికిఁబోయెనో విచారించిరమ్ము. అని వానిని బంపివేసి యా రహస్య మందిరమందున్న వారి నందఱి నుద్దేశించి 'సరే యయినదేదో యైనది, చిక్కదేవరాయల నీ క్షణముననే

సకుటుంబముగఁ దుదముట్టింపవలెను. లేకున్నఁ బ్రమాదము వాటిల్లును' అనెను.

రాత్రి రెండు జాములవఱకు నిట్లు మంతనము చేయుచునే యున్నారు. ఓబలరాయఁడు మాత్రము గొందఱు భటులతో జిక్కదేవరాయలు బంధింపఁబడియున్న మందిరము నకుఁ బోయెను.

ఇంతలో జగ్గరాజు పంపిన భటుఁడు మరలివచ్చి నమస్కరించి "చాకలి తిరుపయ్య వరదరాజస్వామివారి తిరునాళ్ళకుఁ దిరుపతికిఁబోయి తిరిగిరాలేదు. అతఁడచటికిఁ బోవుటకుముందె వాని కుటుంబముగూడఁ బుట్టినింటికిఁ బోయెనఁట. వాఁడిప్పుడు యాచమ దొరవారి కొలువులో నున్నట్లు తెలియవచ్చినది. వాఁడె శ్రీరంగరాయలను బట్టలమూటలోఁబెట్టి కట్టి బయటికి దాఁటించియుండును. నాఁడు వాఁడొక్కఁడే గాడిదపైఁ బెద్ద మూటలు నైచికొని కోటలోనుండి వచ్చుచుండగా కావలి వాఁడొకఁడు మూటలను గఱ్ఱతోఁ బొడిచి చూడఁబోవఁగా 'కొట్టకండి బాబూ ! గాడిద బెదరిపోవునని' వాఁడు త్వరత్వరగా దానిని దోలికొనిపోయెనఁట. ఇదిబాబూ! జరిగిన యథార్థము." అని మనవిచేసికొనఁగా వానిని బొమ్మని జగ్గరాజాదులు చాల సేపటివఱకు నా రహస్యాలోచనా మందిరములోనే "ఈ తంత్రములో రాయప్ప నాయకత్వ మెంతవఱకున్నది ? అతనికిఁ దెలియకుండ రాజ ప్రాసాదములనుండి చిన్న పురుగుగూడ బయటికిఁ బ్రాఁకుటకు వీలులేదే. నిజముగా నాతని కిందు జోక్యము లేనిచో నీ ముసలితనములో స్వామిద్రోహమునకుఁ నేల వెడలి యుండును ?" అని తర్జనభర్జనలు చేయుచునుండిరి.

ఓబలరాయఁడేఁగిన రెండు గడియల సేపటికిఁ గోట బురుజుపైని గుడ్లగూబ వెట్టిగ నఱచినది. ఆకాశమున మబ్బుగ్రమ్మి పెద్ద గాలివాన యారంభమాయెను. మఱొక క్షణమున కొక్క పెద్ద యాక్రందన ధ్వని వినవచ్చెను. అంతఁ గొంతసేపటికి రక్తసిక్తమైన ఖడ్గముతో ఓబలరాయలు వచ్చి వారియెదుట నిలిచి దడదడలాడు నెడఁద నడఁచికొనుచు నమస్కరించెను. వెంటనే తిరుమలరాయలు కృతజ్ఞతాసూచకముగా వానికిఁ దన రత్నహారము నొసంగెను. జగ్గరాజు వానినిగాంచి యిట్లు ప్రశ్నించెను.

జగ్గ :- ఏమి యోబలరాయా! నా రేమైనను 'శౌర్యమును' జూపిరా? ఏమి జరిగినది?

ఓ :- 'అబ్బే' ఏమియు లేదు. వీరరాఘవుఁడు మాత్ర మించుక దౌర్జన్యముచేయ యత్నించెను. అంతే. వెంటనే వానిని ముక్క ముక్కలుగాఁ జెక్క చెక్కలుగా ఖండించి వైచితిమి. రాజు కిక్కురు మిక్కురు మన లేదు.

జగ్గ :- రాణి యేమన్నది?

ఓ :- మేము వెడలునప్పటికే యామె యిహలోకములో లేదు. కిటికీ యూఁచల కురిపోసికొని ప్రాణములు వీడినట్లున్నది.

తిరు :- తనంత తానే చనిపోయెనా!—— ఊఁ— ఆడుపిశాచి...

జగ్గ :- తిరుమలరాయా! నీ విఁకఁ బోయి పరుండుము. అనఁగానే——తిరుమలరాయలు శయనాగారమునకుఁ జనెను.

# రఘునాథరాయుల యుభయము

వేంకటగిరి యూరి వెలుపలఁగల పటకుటీరములో యాచేంద్రుఁడు మంత్రితోడను, ఒక సుకుమార రాజకుమారునితోడను సుఖాసీనుఁడై యుండి యీ క్రింది విధమున సంభాషించెను.

యా :- నాయనా! శ్రీరంగరాయా! మీ రేమి బెంగపెట్టుకొనకుఁడు, భయపడకుఁడు. మీకు నేనే యేడుగడను. మిమ్ము చంద్రగిరి సింహపీఠిక నెక్కించినదాఁక నేను వెంకటగిరిలోఁ గాలుపెట్టను. మీ తల్లిదండ్రులను, అన్నను జంపించిన తిరుమలరాయులను, జగ్గరాయలను జంపిన తరువాతనే మీకు చంద్రగిరి రత్నసింహాసనమును అలంకరింతురు లెండు! కొలఁదికాల మోపికపట్టుఁడు. పితికికండ లేని మీ పెద్దల కీర్తిని మీకు నిలుపఁబెట్టకున్న నెవరు నిలుపుదురు మహారాజకుమారా!

శ్రీర :- భగవంతునివలె మీరు సాయపడుచుండ నాకు లోటేమి యాచేంద్రా! మీ యాశీర్వచనమున్న మాకు నెఱవేఱని దేమియుండును?

జగ :- దొరగారూ! తమరు శ్రీరంగరాయలఁ గోట దాటించినారని విని జగ్గరాజు చిక్కదేవరాయలవారిని సకుటుంబముగాఁ జిత్రవధచేయించి, మనపై దండెత్త సిద్ధముగానున్నాఁడు. ఇది వానకాలనికూడఁ జూడఁడు. కాన శ్రీరంగరాయలను మనము రఘునాథరాయుల చెంతకుఁ చేర్చుట యుత్తమ కార్యము.

యా :- ఔనౌను మంత్రిగారూ! మనమింక నా కార్యమునకుఁ గడంగవలయును. మీ రనినట్లే వేంకటగిరిలో నీ రాకుమారు నుంచుట మనకు శ్రేయస్కరముగాదు. మన కాప్త మిత్త్రుఁడైన యీ రఘునాథరాయల సంరక్షణములో నుంచుదము. మనకు జగ్గరాజుతో యుద్ధము తప్పదు. చిక్కదేవరాయ మహారాజువారిని సకుటుంబముగా నిర్దయులై, నిర్భీకులై, నిర్లజ్జులై, చిత్రవధ చేయించిన యీ పాపులను రూపుమాపి, యీ శ్రీరంగరాయలఁ జంద్రగిరి లక్ష్మీవిలాస సభాభవనమున సింహపీఠి నెక్కింపకున్న నా బాహుపరాక్రమము, మీ బుద్ధిబలము, ఎందులకుఁ గాల్పనా?

జగ :- యాచభూపతీ! తమరు పలికి బొంకనివారు, ఆడితప్పనివారు, ప్రతిజ్ఞ వీడనివారు. మీ మాటలు శిలాక్షరములు. నే నిచ్చటనుండి సామంతరాజులను, ఈ శ్రీరంగరాయల యధికారమును మన్నించునట్లు చేయుచుందును. మీ రీ రాకొమరుని మధుర జింజీల కంటఁ బడకుండఁ గాపాడుకొనుచుఁ దంజావూరు తీసికొనిపోయి రఘునాథరాయల కప్పఁజెప్పుడు. పిమ్మట మనము జగ్గరాయల బుగ్గికావింతము, తిరుమలరాయల తీట యణఁగింతము. అనెను—ఆమాటలకు యాచేంద్రుఁడు చాల సంతసించి, చిక్కదేవరాయల ద్వితీయ పుత్రుఁడైన శ్రీరంగరాయలను దాను జెఱనుండి విడిపించి తీసికొనివచ్చితిననియు, నింకమీఁదట నందఱకు నతఁడే ప్రభువుగాని తిరుమలరాయఁడు గాఁడ'ని ప్రకటించెను. సామంతరాజుల కెల్లరకు వర్తమానము లంపెను. రాకుమారునిఁ దనయొద్దకుఁ దీసికొనివచ్చుచున్నా నని రఘునాథ

రాయలయొద్దకు ముందుగాఁ జారముఖంబున వర్తమాన మంపెను. ఆ వార్త విని రఘునాథరాయలు తొలుత విచారించి, యాచేంద్రుని ప్రతిభకు దూరదృష్టికి సంతసించి వెంటనే చారుల ద్వారమున నభయవార్త నంపెను.

యాచేంద్రుఁ డా వార్తవిని సంతసించి యిచ్చటి కార్యభారమంతయుఁ దన మంత్రిమీఁదఁబెట్టి శ్రీరంగరాయలఁ దన వెంటఁ దీసికొని సముచిత సేనాసమేతుఁడై సాధ్యమైనంతవఱకు మధుర జింజీలకుఁ దెలియకుండ నుండుటకై ప్రచ్ఛన్నముగాఁ దూర్పు సముద్రతీరముగుండ రఘునాథరాయలయొద్దకుఁ బోవుచుండెను.

ఈ లోపల జగ్గరాజు గుట్టువానిజాడ తెలియక నేల నాలుగు చెఱఁగులు గాలించుచుండెను. తంజావూరులో దక్క మఱొక్కచోట రాజకుమారు డుండఁడని యూహించుకొనెను. తానై రఘునాథరాయలపై దాడివెడలి రాజకుమారుని విడిపించుకొని వచ్చుటకు జగ్గరాజు సాహసింపలేకపోయెను. మధుర జింజీలసాయము మర్థించెను. వా రీవఱకే రఘునాథరాయలపైఁ గుట్రలు పన్నుచున్నవారగుట జగ్గరాయలకు సాయపడఁ జంక లెగుర నైచిరి. యాచేంద్రుఁడు రాజపుత్త్రునితోఁ దంజావూరింకను జేరియుండఁడని యూహించి, జగ్గరాజు యాచేంద్రుని దారి నరికట్టుటకై తలపెట్టెను.

అది నదులనిండ నీరపూరము లున్నకాలము. కావేరి నది దాఁటి దంజావూరు చేరుటకు దాని యానకట్ట మార్గ మొక్కటే శరణ్యము. రఘునాథరాయలు కట్టించిన యానకట్ట విఱుగఁగొట్టించి నైచినచో యాచేంద్రుని యాట కట్టునని

యూహించి, వెంటనే మోటుపనివాండ్రను బిలిపించి ప్రజలకు రాఁగల నష్టమునైన గణింపక యా వారధిని నేలమట్టముగాఁ గొట్టించి పాఱవైచెను.

జగ్గరాజు చేసిన దారుణకృత్యము వెంటనే రఘునాథ రాయలకుఁ దెలిసిపోయెను. అంతట క్రోధఘూర్ణమాన మానసుఁడై వేపమానగాత్రుఁడై సింహగర్జనముతోనే గట్టించిన కావేరినది యానకట్ట బ్రద్దలుకొట్టించిన యా చెట్టను బట్టుకొని తల యెగురగొట్టించినకాని నేను నిద్దురపోనని భీష్మప్రతిజ్ఞ గావించెను.

బాలుఁడగు శ్రీరంగరాయలతో యాచేంద్రుఁడు దన యొద్దకు వచ్చుచున్నాఁడను వార్త వింటంచుటతోడనే, రఘునాథరాయలు ససైన్యుఁడై బయలుదేరి, కుంభకోణమునొద్ద యాచేంద్రుని రాకకై వేచియుండెను.

రాజకుమారుని కంటికి ఱెప్పవలెఁ గాపాడుకొనుచు యాచేంద్రుఁడు కుంభకోణమునకుఁ గూఁతవేటు దూరముగా వచ్చెను. అచ్చటఁ జాటున మాటునఁ బొంచియున్న మధుర జింజీలు యాచేంద్రు నెదిర్చి యాఁగుమని రాజకుమారుని విడువుమని బెదరించి యుద్ధమునకు సన్నద్ధులైరి. యాచేంద్రుఁడు జంకును గొంకును లేక, యాఁగుటకు వీలు లేదు. మమ్మాపితిరా; మీ ప్రాణములు మీవికావు. జాగ్రత్త! అని కను లెఱ్ఱఁజేసి యుఱిమెను. యాచేంద్రుని పౌరుష ప్రతాపము లీవఱకే చవిచూచియున్న మధుర జింజీలు తటపటాయించుచున్న సమయములో రఘునాథరాయలు ససైన్యుఁడై యచటికి వచ్చిపడెను. రఘునాథరాయల రాకనుగాంచి సింగంబునుగన్న

లేడుల విధంబుగా జింజీలు తోఁకముడిచి కాలికి బుద్ధిచెప్పి పాఱిరి. రఘునాథరాయలు యాచేంద్రుని గాఁగిలించుకొనెను. ఇట్లు వారు క్షణకాలము గాఢాలింగనమున ప్రేమసాగరములు మునింగిరి. రఘునాథరాయలు రాజకుమారుని జేరంజీరి యెత్తుకొని ముద్దాడి, తల నవరించి, బుగ్గలు పుణికి, తన గుఱ్ఱముపై నెక్కించుకొనెను. తమ రాకను దంజాపూరులో దెలుపుఁడని చారులను తఱిమెను. వారందఱు గుంభకోణముమీఁదుగా గాలక్రమమునఁ దంజావూరు చేరిరి.

రఘునాథరాయలు తంజావూరు చేరునప్పటికిఁ బగటి పూట నాల్గవజాము ప్రారంభమయ్యెను. అది రఘునాథ రాయలు ప్రతిదినము కొలువుదీర్చు సమయము.

రఘునాథరాయలు శ్రీరంగరాయలు యాచేంద్రుఁడు గలిసి వచ్చుచున్నారను వార్త తెలియఁగానె తంజావూరంతయు విజయసూచకముగా నలంకరింపఁబడెను.

వీరు దేవిడీయొద్దకు రాఁగానే ఫిరంగులు ప్రేల్చఁబడెను. రాజభటులు విచ్చుకత్తులనెత్తి యభివాదనము చేసిరి. రఘునాథ రాయాదు లంతిపురమునకేఁగి మార్గాయాసము నపనయించుకొన మజ్జనాదు లొనర్చుకొని, రాజలాంఛనములు ధరించి సభాభవనమునకేతెంచిరి.

రఘునాథరాయలు దన సింహాపీఠికపైఁ గుమార శ్రీరంగ రాయలఁ నధివసింపఁజేసి, తానును, యాచేంద్రుడును రాజ కుమారుని చెంత నాసీనులైరి. సంస్కృత కవులగు యజ్ఞనారాయణ వేంకటమఖియు, వాని కుమారులగు రాజచూడామణి

దీక్షితుఁడును, రామకృష్ణాధ్వరియును, తాతాచార్యుఁడును, ఉభయభాషా కవయిత్రిలగు మధురవాణీ రామభద్రాంబలును, ఆంధ్ర కవిశేఖరుఁడగు చేమకూర వేంకటకవిరాజును, వైణిక, మార్దంగిక, నటకాదులును ఆ సభ నలంకరించిరి.

రఘునాధరాయలు శ్రీరంగరాయల యుదంతముఁ బండిత మండలికి వినిచి శ్రీరంగరాయల సార్వభౌమత్వమును దా నంగీక రించినట్లు ప్రకటించెను.

సభ్యులు హర్షధ్వానములు గావించిరి. వెంటనే కవులు లేచి యేకకంఠముగా రఘునాధరాయలను, ప్రశంసించిరి. తోడనే రసికావతంసుఁడగు రఘునాధరాయలు, తన కీర్తికి నిధానములగు సాహిత్యరత్నాకరము, రఘునాథాభ్యుదయము వ్రాసిన సంస్కృత కవుల కగ్రహారములొసంగి, చేమకూర వేంకటకవి కగ్రహారము నొసంగి తన చేతనున్న 'ముక్తాకటకము' దీసి వానిచేతికిఁ దొడిగెను. పిమ్మటఁ దాను వ్రాసిన సంస్కృత రామాయణము, రఘునాధరామాయణము, వాల్మీకి చరిత్రము, పారిజాతాపహరణము, సంగీతసుధ మున్నగు గ్రంథములలోని రసవద్ఘట్టములను సభ్యులకు వినిచి వీణావాద్యములో మేళవించుటకుఁ దాను రచించిన 'రఘునాధమేళ' యను మేళము గాయకులు మేళవించి పాడఁగా విని యానందించెను. చిన్నవాఁడయ్యు శ్రీరంగరాయలు రఘునాధరాయల సభా విశేషములను దన మనమునఁ బట్టించుకొనెను. యాచేంద్రుఁడు రఘునాధుని రాసిక్యమున కుప్పొంగెను. అంతట సభ ముగిసెను.

# మంత్రాలోచన

సభానంతరము రఘునాథరాయలు యాచేంద్రుని, దన మంత్రి ముఖ్యుఁడగు గోవిందయజ్వను, రామయ్యుని దీసికొని యాలోచనా మందిరమున కరిగెను.

రఘు :- యాచేంద్రా ! ఆనాఁడు వేంకటపతిరాయలే విశ్వాసముతోఁ బ్రాణములు విడిచెనో దాని నింతదనుక నిలిపితిమి. జగ్గరాజు, ఈ శ్రీరంగరాయలు తన చేఁదాటిపోయెనని వినఁగానె చేసిన దారుణ కృత్యమునకు మాఱు ప్రతీకారము మనము చేసితీరవలయును. జగ్గరాజు ఎవనిని దనకు రాజనిమురియుచున్నాఁడో; ఆ తిరుమలరాయని మనము అవశ్యము నాశనము చేయవలయును. కావున మీరు తక్షణము బయలుదేరి యే రీతిగానైనఁ జంద్రగిరిలోఁ బ్రవేశించి తిరుమలరాయని వధింపవలయును.

గోవి :- చిత్తము రాజశేఖరా ! తాము సెలవిచ్చిన దెంతయు సమంజసముగా నున్నది, నా దొక్కమనవి. యాచేంద్రుఁడు తిన్నఁగాఁ జంద్రగిరి పోవుటకంటె దారిలో ఆమరమువారిని (మాండలిక ప్రభువులు) గలిసికొని, రాయప్పగారి సందర్శనముగూడఁ జేసికొని వెడలుట మంచిది. ఆ మహానుభావుఁ డొసంగిన 'సలహా' ప్రకారము నడచినచోఁ గార్యము సులభముగా ఫలించును. తిరుమలరాయల లోతుపాతులు రాయప్పగారికిఁగాక మత్తెవరికిఁ దెలియును !

యా :- ఔనది నిజమే. రఘునాథరాయా! వారి యునికి మనము తెలిసికొనుట యెట్లు? అప్పుడే జగ్గరాజు ఈ రాజకుమారచంద్రుఁ డిచ్చట నున్నాడని పసిపట్టి కసిదీర్చుకొనుటకై చిల్లర రాజులను ప్రోవుచేసికొని తంజావూరుమీఁదికి దండెత్తి వచ్చుచుండును.

గోవి :- యాచేంద్రా! గుణభద్రుఁడగు తుంగభద్రానదిచెంత నున్నాఁతుఁడైన రాఘవేంద్రస్వామి 'మంత్రాలయము'ను నాశ్రమము స్థాపించినది మీ రెఱిఁగియే యుందురు. వైరాగ్యభాగ్య మనుభవించుచున్న రాయప్పగారు మానియై యందే తపము న్నవారని మొన్న తెలియవచ్చినది. మీరు నేఁడె ప్రయాణమై యచ్చట కేఁగుఁడు.

అనఁగానే యాచేంద్రుఁడు సెనాసని యజ్జమాటలను మెచ్చుకొని రఘునాథరాయలకుఁ గృతజ్ఞత తెలిపి రాజకుమారునితో 'పోయివచ్చెదను బాబుగారూ! మీరు హాయిగా రఘునాథరాయల బాహు వజ్రపంజరములో భద్రముగా నుండుఁడు. త్వరలో మన మందఱము చంద్రగిరికిఁ బోదము.' అని చెప్పి రఘునాథరాయని యభయదానబలమున శ్రీరంగరాయలు సుఖముండఁగలఁడని తలంచి యుత్తరదిశాభిముఖుఁడై చని యెడనెడఁగల 'అమరము' వారినిఁ గలిసికొని తమకు సాయపడవలసినదిగా గోరఁగా వారు 'చంద్రగిరికి రాజై తిరుమలరాయఁ డుండఁగా వానిని గాదని మేము మీకెట్లు సాయము చేయఁగలము! ఆ సింహాసనమున నెవరున్న వారిని మన్నించుటయే మా ధర్మము. మీరు శ్రీరంగరాయలను జంద్రగిరిలోనో, తంజావూరులోనో, రాజును జేయుఁడు. తిరుమలరాయలు లేకుండుట శ్రీరంగ

రాయలు రాజగుట యిదే మా కోరిక. అప్పుడు మీ చిత్తము; అగ్నిలో నుఱుకుమన్న నుఱుకుదుమ'నిరి. వారి కోరిక యాచేంద్రునకు యజ్ఞ యిచ్చిన సలహాకు దోహదముకాఁగా నందుండి చని చని తుంగభద్రా నదీతీరముననున్న మంత్రాలయ మును జేరుకొనెను.

యాచేంద్రుఁడు తిరిగి తిరిగి కేవలము తుంగభద్రకుఁ జెంగటనున్న యొక కుటీరారామభూమిలో మాకంద తరుచ్ఛాయను భాగవత పురాణము వినుచున్న యొక ఋషిపుంగవునిఁ గాంచి సాష్టాంగప్రణామ మొనర్చెను.

హాని :- ఓయప్పా ! యెప్పుడు రాక ? ఏమిటీ చోద్యము ! రాజకుమారుఁడు భద్రముగా నున్నాఁడుకదా ! మీ రాజ భక్తి కంతరాయము వాటిల్లలేదుగదా ! కూర్చుండుఁడు.

యా :- (సవినయముగాఁ గూర్చుండి) 'స్వామీ! రాజభోగము లనుభవించు మీ కిట్టిపాట్లు కల్పించినది నేనేకదా !

హాని :- యాచేంద్రా ! ఎంతమాట ! అది మన విధి. ఏ సామ్రాజ్యము నుప్పుతిని, గుడ్డకట్టి మనము మనినామో ; ఆ సామ్రాజ్యమును నిలువఁబెట్టుటయే మన కర్తవ్యమైనది. అట్లు చేసినాము. నాచేనైనది నేఁ జేసినాను. ఇఁక మీరు చేయవలసినది ఆ రాజకుమారుని బట్టాభిషిక్తునిఁ జేయుట.

యా :- హానిచంద్రా ! రాజకుమార చంద్రుఁడు రఘునాథ రాయుల రక్షణములో నున్నాఁడు. దినదినాభివృద్ధి నొందఁ గలఁడు. రాజకుమారుని తమరు మా కందించిన పిమ్మట సారంగముద్వారమున బయటకు రా నుంకించుచున్న చిక్క-

దేవరాయలను జగ్గరాజు సకుటుంబముగాఁ జిత్రవధచేయించి నాఁడు ఓబలరాయని కాజ్ఞ వెట్టె.

హాని :- హరిహరీ ! యెంతమాట విననయ్యెను? యాచేంద్రా! కాలగతి నెవఁడు తప్పింపఁగలఁడు ! సరే— మీ రేల వచ్చినారు ?

యా :- తమ సహాయము నర్థించి—

హాని :- ఇంకను నా సహాయమా !

యా:- కాదు రాణ్మౌనీ ! ఒక చిన్న యుపకృతి — కాదు మాటసాయము- ఆశీర్వచనము- చేయుఁడు చాలు. మీరు నాఁటిన 'రాచమొలక' పెంపొందును.

హాని :- ... ... ...

యా :- స్వామీ ! ఏమీలేదు. చిక్కరాయాదులను జగ్గరాజు చంపించినాఁడు. వానికిఁ బట్టుకొమ్మయైన తిరుమల రాయలను వధించినఁగాని మీఁదటి కార్యము సుకరముగాదు. మహాత్మా ! అనుగ్రహింపుఁడు. మానమూనకుఁడు.

హాని :- (కనులు మూసికొని) 'సరే యాచేంద్రా ! తిరుమల రాయలు వేశ్యాలంపటుఁడు. విషయలోలుఁడగు నతఁడు చంద్రగిరి చివరనున్న రత్నాంగి మేడలో 'పచ్చీసు' లాడు చుండును. సరి. వెడలిరండు- తెలిసినదికదా !' అనెను.

యాచేంద్రుఁ డా యమృతవాక్కుల నాలించి యక్కడ నుండి బయలుదేఱి పెనుగొండ దిక్కుగాఁ బోయెను.

పెనుఁగొండలోఁ గొండవీటి తిమ్మరాజు కుమారుఁడు రామరాజును గలిసికొనెను. శ్రీరంగరాయలను సార్వభౌము నిగా నంగీకరింపుమనెను. ఆతని పుత్రికను రంగరాయలకిచ్చి

పెండ్లి చేయవలయునని కోరెను. రాబోవు యుద్ధములోఁ దమకు సాయపడవలసినదిగాఁ గోరెను. రామరాజు-తన తండ్రి తిమ్మరాజు గారికి వర్తమానమంపి యస్లే కావింతునని చెప్పెను. అది విని యాచేంద్రుఁడు మది నుప్పొంగి, తన తలఁపులు ఫలోన్ముఖములగుచున్నందులకు భగవంతునకు నతులర్పించుచు నెడ నెడ గల సామంతరాజులనుగూడఁ గలిసికొనుచు రాజకుమారుని యుదంతమును దెల్పుచుఁ గానసమార్గములఁబడి మహానిపుణ్య వాక్యముల స్మరించుకొనుచు వెంకటగిరికరిగి, తన మంత్రితో మంతనమాడి తొంటి తిరుపతి కాంతార పర్వతగుహ కరిగెను. అచ్చటి కతఁడు చేరునంతలో నిరువురు చారులువచ్చి సిద్ధముగా నుండిరి. యాచేంద్రుఁడు వారిఁ గాంచి హర్షము చెంది 'కార్యమా! పండా' అని ప్రశ్నించెను.

చారులు :- స్వామీ! కార్య మేల యగును-అంతయుఁబండే.

యా :- అది యెట్లు——

చా :- తిరుమలరాయలవారు - వేశ్యాసరససల్లాపము ముగియఁగానే ప్రక్కనున్న వసారాలోఁ దూఁగుటుయ్యాలలో నూఁగుచు నిద్రించునఁట. రేపు వారు వేశ్యాగృహమునకు తప్పక వత్తురఁట. కోడికూఁత వేళవఱకందే యుందురఁట.

యా :- సరే. మీరు వెడలుఁడు——చంద్రగిరిలోనే కడు మెలఁకువతోఁ దిరుగుచుండుఁడు——మీఁదిపని మేము చూచుకొందుము——అని చెప్పి మఱునాఁటిరాత్రి నిశీథమునకు నచ్చటికి వెడలి తిరుమలరాయని పరిమార్చి రావలసినదిగా గూఢ సైనికుల కాజ్ఞాపించి తాను వేంకటగిరి కేగెను.

# యుద్ధము

రఘునాథరాయలు తొంటి చంద్రగిరి కర్ణాట సామ్రాజ్యమును నిలువఁబెట్టుటకై బద్ధకంకణుఁడై శ్రీరంగరాయల కభయమిచ్చి తనయొద్ద మనుచు చుండుటయుఁ దిరుమలరాయలు వేశ్యాగృహములో యాచేంద్రుని శేముషీవిలాసముచేఁ జంపఁ బడుటయు విని సామంతరాజులందఱు నొక్కరొక్కరే వచ్చి యాచేంద్రునిఁ గలిసికొని కర్ణాట సామ్రాజ్యాధిపత్యమునకు జోహారులొనర్చి జగ్గరాయల జయించి శ్రీరంగరాయలఁ బట్టాభిషేకముఁ జేయించుఁ గార్యములోఁ దామును బాల్గొందు మని కత్తులుపట్టి ప్రమాణములుచేసి ప్రతిజ్ఞలు గైకొనిరి.

రఘునాథరాయలతో యుద్ధముచేయ జగ్గరాజు దక్షిణ భూభాగమున బలము చేకూర్చుకొనుచుండెను.

యాచేంద్రుఁ డుత్తర భూభాగమంతయుఁ దిరిగి తిరిగి చేసిన ప్రచార ఫలితమే అమరమువారు, సామంతరాజులు పెక్కుమంది, రఘునాథ యాచేంద్రులపక్షము నవలంబించుట—

రఘూనాథుని కాదన్నవారు చోళక నేపాళీయులు కృష్ణప్ప నాయకుఁడు మాత్రమె. వీరు జగ్గరాజు పక్షమూనిరి. రఘునాథరాయలు జగ్గరాజుపైని దండయాత్ర సాగించుచున్నామని చాటించెను. చైత్రయాత్రకు బలములుదేఱుచు 'సింధుదేశస్థులైన చోళకులను శిక్షించి, నేపాళరాజును నిగ్రహించి, జగ్గరాజును నుగ్గుచేసి కర్ణాటసామ్రాజ్యపీఠముపైని శ్రీరంగరాయలఁ

గూర్చుండఁబెట్టికాని తంజావూరులో గాలుపెట్టనని' ప్రతిజ్ఞ చేసెను.

సముద్రము దాఁటినఁగాని చోళకుని దుర్గము ముట్టడింప శక్యముగాదు. ఏనుఁగులపై సముద్రలంఘనము చేయ నెంచెను. కాని యది మంచిదికాదని యెంచి పడవల వంతెన గట్టించి సముద్రము దాఁటి సైనికులను 'దేవికోటలోఁ' బ్రవేశింపు డని యాదేశించెను. వా రొకరిభుజముపై నొక రెక్కి ప్రాకారముల నెగఁబ్రాఁకి కోటలోఁ బ్రవేశించిరి. అదిగాంచి చోళకుఁడు చేయునదిలేక కోట తలుపులు తెఱచుకొని పలాయనము గావించెను. రాజు పోకను గాంచిన వాని సేన తోఁక జాడించెను. సాయము చేయవచ్చిన కృష్ణప్పనాయకుఁడు కాలికి బుద్ధిచెప్పి చెట్టు పుట్ట పట్టెను. నేపాలరాజు శరణుపొందఁగా వానిని క్షమించి విడిచిపుచ్చెను. ప్రజల వేఁడికోలు ననుసరించి రఘునాథరాయలు చోళకుని దఱిమి తఱిమి పట్టుకొని బంధించి చెఱసాలలోఁ బడవైచి యాకోటకుఁ దన సైనికులను గాపలాయుంచి, జగ్గరాయలు శత్రుబృందముతోఁ గలియక పూర్వమే వానిని మట్టుపెట్టఁదలంచి 'పాయంటుకాలిమరు' అనుచోట సముద్రలంఘనము గావించి జగ్గరాయలు వ్యూహములు పన్ని యున్న ప్రదేశమునకు బయలుదేఱెను. సముద్రము దాఁటిన రఘునాథరాయలఁగూర్చి ప్రజలు దైవాంశసంభూతుఁడని చెప్పకొనసాగిరి.

జగ్గరాజు ప్రేరణచే బుడతకీచులు (పోర్చుగీసువారు) కూడ రఘునాథరాయల నెదిర్చి పోరలేక పాఱిపోయిరి. పాఱి

పోవునపుడు వారు తమ యాస్తిపాస్తులను, తుదకు భార్యలను గూడ జడిసి విడిసిపోయిరి.

ఇంతలోఁ జారులు పరుగులువాఱి వచ్చి, జగ్గరాజు ససైన్యుఁడై కావేరీ నదీతీరమున వ్యూహము రచించి మోహరించి యున్నాఁడని చెప్పిరి. అది విని రఘునాథరాయలు తన సేనలను దఱిమి కావేరి యొడ్డుననే చని 'పళవానేరి' యొద్ద దండువిడిసెను.

ఈ యుద్ధాగ్నిజ్వాలలు రఘునాథరాయ యాచేంద్రుల ప్రేరణను జేసి యుత్తరమునఁ గొండపల్లి మొదలుకొని, దక్షిణమునఁ దంజావూరువఱకును, పశ్చిమమున నీలగిరికిబోవు దారిలో కోయంబత్తూరు జిల్లాలో గల మెట్టుపాలెము వఱకును వ్యాపించినవి.

అది నళనామ సంవత్సరాషాఢశుద్ధ పంచమి దినము. రఘునాథుఁడు 'తన సేనలు బయలుదేఱి వచ్చుచున్నవి. సిద్ధముగా నుండుమ'ని జగ్గరాజునకు వర్తమానమంపెను.

రఘునాథరాయలు రామభద్రమను పేరుగల తన వారణముపై విరాజిల్లుచున్న 'విజయగరుడాద్రి' యను నంబారీపైఁ గూర్చుండి పెండ్లికిఁ బోవునట్లు పొలికలని (యుద్ధభూమి)కిఁ జనుచుండఁగా రాజులు, మన్నీలు, రౌతులు, దొరలు, గుఱ్ఱాలపై నెక్కి రాయల ననుసరించిరి. కోనేటి కొండ్రాజు, కట్ట రంగరాజు, కస్తూరిరాజు, మిట్టపాళెంపు సంపెటనాగరాజు, రామరాజు, జీకురఘునాథరాజు, ఓబలరాజు, మనుబోలురాజు, శ్రీరంగపతిరాజు, శ్రీగిరిరాజు, వీరరాఘవరాజు, విఠ్ఠలరాజు,

నంద్యాల చిట్టిరాజు, నాళపరాజు, గడితిమ్మరాజు, కాలువ రాజులు, కడపరాజులు, పంటరాజులు, పాళెలరాజులు, శ్రీపతి వారు, కైజీతంపు దొరలు, జూపల్లివారు, దేసూరిరెడ్లు, రఘునాధుని మేనమామ, కుమార రంగయ్య. పామినాయనివారు, బలుమూరివారు, మండపవారు, కంబమువారు, కొండవీటివారు, కొండపల్లెరెడ్లు, అంకుశరావువారు మొదలగువారు యాచేంద్రుని నాయకత్వమున వచ్చి రఘునాధరాయనిఁ గలిసికొనిరి.

సేనలు కదిలి పళవానేరికి మూఁడున్నర క్రోసుల దూరముననున్న 'తోపూరు' (నేటి తొహూరు) చేరుకొనెను.

అప్పటికిఁ బ్రొద్దుగ్రుంకినది. తెల్లవాఱిన షష్ఠి. జగ్గరాజు పాండ్యరాజాదులతో వచ్చి యచ్చట కనతి దూరముననే విడిసియుండెను.

ఏ రాత్రివేళవచ్చి తన సేనపైఁబడునో యని రఘునాధరాయలు దుర్నిరీక్ష్య తేజోవిరాజమానుఁడై తెల్లవారినదాఁక మేలుకొనియుండెను. ప్రొద్దుపొడుపుతోడనే యుద్ధము చెలరేఁగెను. పాండ్యుఁడు రఘునాధుని బాకుపోటుతిని తన గుఱ్ఱము నదిల్చి, వెనుదిరిగి గడ్డికఱచి యుదేపోకగాఁ బాఱిపోయెను.

అది గాంచి జగ్గరాజు బిగ్గరగాఁ దన సేనలను బురికొల్పుచు రఘునాధరాయలపైఁ దలపడెను. రఘునాధుఁడు, జగ్గరాజును ద్వంద్వయుద్ధమునకు దిగిరి.

అంతలో మెఱపు మెఱసిన చందముగా 'జగ్గరాజును నేను చంపుదును. నేను చంపుదును - మీరుండుఁడు' అనుచు యాచేంద్రాదులు వచ్చి పైఁబడిరి. అంతలో జగ్గ

రాజు సేనానాయకుఁడు చెంచువానికి బాసటగా వచ్చిన మాక రాజు రావెళ్ళ వెంకన్న, మధుర వీరప్ప మున్నగువారు గలియఁ బడి రఘునాథ సైనికులతోఁ బోరు ఘోరముగాఁ జేయుచుండిరి.

ఆ తుముల సంగ్రామములో రఘునాథరాయ యాచేంద్రుల బాకు లొకేసారి యొకటి జగ్గరాయుల కంఠమునను ఒకటి ఱొమ్మునను ఈవలనుండి యావలికి పోవునట్లు పొడవఁబడెను— జగ్గరాయ మహారాక్షసుఁడు నేలకొఱఁగెను. రఘునాథ సేనలు సింహగర్జనముచేసి విజయసూచకముగా శంఖములు పూరించెను.

అది కని మాకరాజు మూఁకలనువీడి పరువెత్తెను. చెంచు కంచెలుదాఁటి సిగవీడ, పంచెజాఱ పాఱెను. రావెళ్ళ వెంకన్న డొంకలు పట్టెను. ముత్తు వీరప్ప నెత్తిని చేతులు వైచుకొని కత్తికాటు వేసినను మొగమున నెత్తురులేక వెనుదిరిగి చూడక పలాయనము గావించెను.

# పట్టాభిషేకము

లోకకంటకుఁడైన జగ్గరాజు బుగ్గియైనసంగతి కర్ణాట సామ్రాజ్యమంతటను నీటిమీఁది తైలమువలెఁ బ్రాకిపోయినది.

రఘునాథరాయల యాజ్ఞంజేసి కన్యాకుమారి మొదలు కొని కళింగనగరమువఱకు నూరనూరను, పల్లెపల్లెను, వరాహ ధ్వజము లెగురవేయఁబడెను.

విజయవార్త తెలియఁగానే యాచేంద్రుని మంత్రి ససైన్యుఁడై వేంకటగిరినుండి చంద్రగిరికేఁగి కోట నాక్రమించు కొని శ్రీరంగరాయల ప్రతినిధిగా ధరాపాలనంబు గావింపఁ దొడఁగెను.

ప్రజలు నూతనోత్సాహముతో విరాజిల్లుచుండిరి. ఇంటింటఁ బండువు చేసికొని పిండివంటలు వండుకొని భుజించిరి. కులదైవతములకు ధూపదీప నైవేద్యము లొసంగి యెసంగిరి.

యుద్ధము ముగిసిన మఱునాఁడె రఘునాథరాయలు యాచేంద్రుఁడును సపరివారులై తంజావూరు వెడలిరి. అచ్చట నుండియె కొండవీటి తిమ్మరాజుగారికి దన మనుమరాలు ముమ్మ డాంబికను దోడుకొని యాశ్వయుజ శుద్ధ సప్తమి నాఁటికిఁ జంద్రగిరికి దయచేయవలసినదిగా వార్తనంపెను.

వీరవేంకటపతిరాయల మరణానంతరము చంద్రగిరిలో జరిగిన విజయదశమి మహోత్సవములలోఁ జెప్పుకోఁదగిన విశే షము లేవియు లేవు. రావణ సంహారమునకుఁ బిమ్మట శ్రీరామ

పట్టాభిషేకమునకై యెదురుచూచిన యయోధ్యా నగరవాసుల వలెఁ జంద్రగిరి పౌరులు శ్రీరంగరాయల పట్టాభిషేకములకై యెదురుచూచుచు విజయదశమి యెప్పుడు వచ్చునా యని రోజులు లెక్కించుకొనుచుండిరి.

జగ్గరాజు మరణముతోఁ బరిసమాప్తిచెందిన తన జైత్రయాత్రలనుగూర్చి తాను వ్రాసిన రఘునాథాభ్యుదయ నాటకమును రఘునాథరాయలు ముగించెను.

ఈ విజయదశమితో శ్రీరంగరాయలకు నిరువదియేండ్లు నిండును. వివాహ మహోత్సవము పట్టాభిషేక మహోత్సవము నాఁడె కావింపఁబడుననియు సప్తమినాటికె సామంతరాజులందఱు నా మహోత్సవములలోఁ బాల్గొనుటకై రావలయుననియుఁ దంజావూరునుండియె యెల్లయెడలకు వార్త లందజేసిరి. చెన్నపట్టణములోనున్న ఈస్టిండియా కంపెనీవారికిఁగూడ నుత్సవమునకు రావలసినదిగా ఆజ్ఞపెట్టెరి.

రఘునాథరాయలు యాచేంద్రుఁడు చెఱియొక యేనుఁగుపైనెక్కి, శ్రీరంగరాయలను, రఘునాథుని 'పట్టపుగజము'పై నెక్కించి, బారులుదీరి యాశ్వికులు తమ వెంటనంటిరాఁగా గవి గాయకులు పల్లకీలలో రాఁగా దారిపొడుగునను బ్రజలు జయజయ నినాద పూర్వకముగా స్వాగతము లర్పించుచుండఁగాఁ జంద్రగిరికిఁ బయలుదేఱిరి.

ఆశ్వయుజ శుద్ధ సప్తమినాఁటికి చంద్రగిరి చేరిరి. ప్రజలు తండోపతండములుగా నెదురుగావచ్చి యానందపరవశులై జగ్గరాజును నిందించుచు యాచేంద్రుని రఘునాథరాయలను గీర్తింప

సాగిరి. పౌరనారీమణులు సౌధాగ్రములనుండి లాజలు, సేసలు, పూవులు, శ్రీరంగరాయాదులమీఁదఁ జల్లిరి. మంగళ వాద్యములు బోరుకలంగ సభిజిల్లగ్నములో మహారాజకుమా రుని గోటలోఁ బ్రవేశపెట్టిరి. ఫిరంగులు పేల్పఁబడెను. వరాహధ్వజము లెగురవేయఁబడెను. సంతర్పణలు, సమా రాధనలు, అభిషేకములు, పూజలు పురస్కారములు ఎల్ల దేవాలయములలోను గావింపఁబడెను.

నాఁటి యుదయమునకే కొండవీటి తిమ్మరాజు, వాని కుమారుఁడు మనమరాలితో వచ్చి సుధాకర నిలయములో విడిసియుండిరి.

సప్తమి మొదలు విజయ దశమి పూజలు యథావిధిగా జరుపఁబడుచున్నవి.

విజయదశమినాఁడు పగలు పదిగడియలమీఁద శుభ ముహూర్తమున శ్రీ ముమ్మడాంబా శ్రీరంగరాయల వివాహ మహోత్సవము మహావైభవముగా రఘునాథారాయ యాచేం ద్రుల సమక్షమునఁ జరిగెను.

ఆవెంటనే పట్టాభిషేకముగూడ జరిగింప వివాహవేదిక నుండి సమలంకృతమైన సభావేదికకుఁజనిరి.

కవిగాయక సామంత నృపాలాదు లందఱు యథాస్థా నంబు లలంకరించిరి. బ్రాహ్మణోత్తములు వేదోక్తముగా శ్రీరంగరాయలకుఁ బట్టాభిషేక మొనర్పస్వర్ణకలశములతో సప్త సముద్రములనుండి తీసికొనివచ్చిన పవిత్రోదకములను శ్రీ ముమ్మ డాంబా శ్రీరంగరాయల శిరంబుల నభిషేకించి యాశీర్వదించిరి.

ఆంధ్రవరాహ విజయధ్వజము వినువీధిని నెగిరినది.

'జయ ! కర్ణాటక సామ్రాజ్య సార్వభౌమా ! శ్రీరంగ రాయ రాజహాళీ ! విజయీభవ' యని వందిమాగధు లుచ్చై స్స్వనముతో జయనినాదములు గావించిరి. రఘునాథరాయ యాచేంద్రులు లేచి శ్రీరంగరాయలకు నమస్కరించి తమ రాజ భక్తిని సభాముఖంబుగాఁ బ్రకటించిరి. సభ్యులు హర్షనినాదం బులు గావించిరి. సామంతరాజులు గజ తురగ రత్న రత్నహా రాదులు కానుక లర్పించిరి. ఈస్టిండియా కంపెనీ పక్షమున వచ్చిన యాంగ్లేయ ప్రతినిధి తాను దెచ్చిన రత్నమయ చంద్ర హారమును, అపూర్వదర్శనీయ వస్తుసముదాయమును గానుకగా నర్పించి, చంద్రగిరిసామ్రాజ్య ప్రతినిధియగు చెన్నప్పయొద్దనుండి చెన్న పట్టణములో వర్తకాదులు చేసికొనుటకై తాము పొందిన తాత్కాలికపు టొడంబడికను ఖాయపర్చి శాశ్వతపుఁబట్టా యొసంగ వేఁడుకొనెను. రఘునాథరాయ యాచమనాయకుల యనుమతిపై శ్రీరంగరాయలు కంపెనీ ప్రతినిధికి పట్టావ్రాయించి యొసంగెను. గాయకులు గానముచేసిరి. నట్టువకత్తె లాడిరి; పాడిరి. కవిపుంగవులు లేచి యిట్లు కీర్తించిరి.

చెల్లెను మీప్రతిజ్ఞ లల సింహగిరీంద్ర నృసింహమూర్తిసం
ఫుల్ల కృపాకటాక్షమునఁ, బొంపిరిపోవఁగ రంగరాట్టు సం
పల్లలితాంధ్రలక్ష్మి కరపల్లవముల్ గ్రహియించి మించెడిన్
నల్లనొ ! ధన్యులీరు రఘునాథనృపాలక ! యాచనాయకా !

స్వస్తి

ఇతి శివమ్.

పావనీ ప్రెస్, పట్టాభిరోడ్ – మచిలీపట్టణము.

జూన్ 1952.